

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 249

గురువారం 30-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వరద జలాలను ఒడిసిపట్టి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే సంకల్పంతో.. ప్రజల సాగు, తాగు నీటి అవసరాలను తీరుస్తూ లక్షలాది రైతన్నలకు మేలు చేస్తూ జగనన్న ప్రభుత్వం తలపెట్టిన జలయజ్ఞంలో మరో మైలురాయి..



'అవుకు రెండో టన్నెల్'
ప్రారంభోత్సవం..

శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

రాయలసీమ ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ గాలేరు-నగరి సుజల స్రవంతిలో భాగంగా రూ. 567.94 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన అవుకు ప్రాజెక్ట్ మొదటి, రెండో టన్నెల్లు... మూడవ టన్నెల్, ఇతర అనుబంధ పనుల్లో భాగంగా కూడా ఇప్పటికే రూ.934 కోట్ల విలువైన పనులు పూర్తి.. దీనితో ఇప్పటికే మొత్తం రూ.1,501.94 కోట్ల విలువైన పనులు పూర్తి.. నేడు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసి గోరకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ కు 20,000 క్యూసెక్కుల నీటిని నంద్యాల జిల్లా మెట్టుపల్లి వద్ద విడుదల చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

ప్రయోజనాలు..

శ్రీశైలం కుడి గట్టు కాలువ క్రింద 1.5 లక్షల ఎకరాలకు సాగు నీటి సరఫరా.. గాలేరు నగరి సుజల స్రవంతి పథకం క్రింద గండికోట, వామికొండ, సర్వారాయసాగర్, మైలవరం, పైడిపాలెం తదితర రిజర్వాయర్లకు రోజుకు 1 టీఎంసీ చొప్పున అదనపు నీటి సరఫరాకు వెసులుబాటు..
ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు..
1.31లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ.. 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి త్రాగునీరు..

వేగంగా అవుకు టన్నెల్-3 పనులు..


కృష్ణా నదిలో వరద నీరు లభ్యమయ్యే సమయం రోజురోజుకి తగ్గిపోతున్న నేపథ్యంలో, నేడు ప్రారంభిస్తున్న 20 వేల క్యూసెక్కులకు అదనంగా మరో10 వేల క్యూసెక్కుల నీటిని త్వరితగతిన తరలించేలా రూ.1,297.78 కోట్ల వ్యయంతో చురుగ్గా అవుకు టన్నెల్-3, డిస్ట్రిబ్యూటరీ మరియు ఇతర అనుబంధ పనులు.. రూ.934 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తి.. మొత్తం 5.801 కి.మీ పొడవులో ఇప్పటికే 4.526 కి.మీ పనుల పూర్తి..
దీనితో మొత్తం 30 వేల క్యూసెక్కుల నీటిని తరలించే వెసులుబాటు..

అవుకు ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు చేసిన వ్యయం

2004-05 నుండి 2013-14 వరకు	2014-15 నుండి 2018-19 వరకు	2019-20 నుండి 2023-24 వరకు		ఇప్పటి వరకు చేసిన మొత్తం వ్యయం (రూ.కోట్లలో)
		టన్నెల్ - 2	టన్నెల్ -3	
340.53	81.55	145.86	934	1,501.94

Not to Scale

అవుకు టన్నెల్ - II & III నమూనా చిత్రం



అవుకు 1 & 2 టన్నెల్స్ ముఖ్యాంశాలు..

- గోరకల్లు నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 60 కి.మీ పొడవున వరద కాలువ, కొనసాగింపుగా సొరంగం తవ్వకం పనుల పూర్తి..
- అన్ని అవాంతరాలను అధిగమించి, ఫాల్ట్ జోన్‌లో 180 మీటర్ల సొరంగం నిర్మాణంతో పాటు లైనింగ్ పనులు పూర్తి.. కుడి, ఎడమ టన్నెల్స్‌లో సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు..
- తద్వారా రాయలసీమకు మరో 10,000 క్యూసెక్కుల నీరు అదనంగా తరలించే వెసులుబాటు..
- గాలేరు-నగరి వరద కాలువ ద్వారా 15 రోజుల్లోనే గండికోట రిజర్వాయర్ నింపేందుకు అవకాశం..
- శ్రీశైలం జలాశయానికి వరద వచ్చే సమయంలో 20 వేల క్యూసెక్కుల చొప్పున రాయలసీమకు రోజుకు 2 టీఎంసీల నీటి సరఫరా..

రాయలసీమను సస్యశ్యామలం చేసే దిశగా జగనన్న ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు..

1. దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమ తాగు, సాగునీటి కష్టాలను, పారిశ్రామిక అవసరాలను తీర్చే లక్ష్యంతో..
ఒక వైపు గ్లోబల్ వార్మింగ్ కారణంగా వర్షాలు, వరద వచ్చే రోజులు తగ్గిపోతుంటే, మరోవైపు పక్క రాష్ట్రం వివిధ లిఫ్ట్‌ల ద్వారా 800 అడుగుల లోపు నుంచే నీటిని డ్రా చేయడంతో పాటు విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న పరిస్థితి.. ఈ నేపథ్యంలో శ్రీశైలంలో 875 అడుగులు మించితే గానీ మనకు కేటాయించిన పూర్తి నీటిని డ్రా చేయలేని స్థితిని చక్కదిద్దుతూ.. ఒకవైపు కాలువల సామర్థ్యం పెంచుతూనే, మరో వైపు 797 అడుగుల నుంచే నీరు తీసుకోగలిగి త్వరితగతిన ప్రాజెక్టులు నింపేలా, రోజుకు 3 టీఎంసీల జలాలను కరవు ప్రాంతాలకు న్యాయం చేస్తూ తరలించడానికి చురుగ్గా రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు..

2. రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం క్రింద..
   - ఎ. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచడంతో పాటు కాలువల వెడల్పు, లైనింగ్ పనులు, అదనపు టన్నెల్స్ నిర్మించి గోరకల్లు, అవుకు రిజర్వాయర్ల ద్వారా తక్కువ సమయంలో అన్ని పథకాలకు సరిపడా నీరు అందించడానికి చర్యలు..
   - బి. రూ.600 కోట్ల వ్యయంతో తెలుగు గంగ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యం 15వేల క్యూసెక్కులకు విస్తరణ.. SRBC, GNSSల సామర్థ్యం రెండూ కలిపి 30వేల క్యూసెక్కులకు పెంచేందుకు చురుగ్గా పనులు.. కుందూ నది, నిప్పుల వాగు సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచి సోమశిల వరకు నీటి సరఫరా..
   - సి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ లీకేజ సమస్యను ప్లాస్టిక్ డయాఫ్రమ్ వాల్ సాంకేతికతతో అరికట్టడంతోపాటు తక్కువ సమయంలో అన్ని ప్రాజెక్టులకు సరిపడా నీళ్లందించేలా రూ.600 కోట్లతో తెలుగు గంగ కాలువ సామర్థ్యాన్ని లైనింగ్ ద్వారా పెంచి పూర్తి సామర్థ్యం మేరకు 17 టీఎంసీల నీరు నింపిన జగనన్న ప్రభుత్వం..
   - డి. HNSS ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6,000 క్యూసెక్కులకు పెంచేందుకు వీలుగా రివర్స్ టెండరింగ్ విధానంలో పారదర్శకంగా పనులు..
   - ఇ. HNSS కాలువ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలోని 23,000 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించేందుకు 2.18 TMCల సామర్థ్యంతో జిల్లేడు బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణ పనులు ఇప్పటికే మొదలు..
   - ఎఫ్. పుట్టపర్తి నియోజకవర్గంలోని 195 సాగు నీటి చెరువులను, 3 టీఎంసీల హంద్రీనీవా నీటితో నింపి 10,034 ఎకరాలకు నీటి ఎద్దడి నివారణ, 2,43,609 మంది జనాభాకు తాగునీరు సరఫరా చేయడానికి రూ.864 కోట్లతో పనులు ఇప్పటికే మొదలు..
   - జి. రూ. 240 కోట్ల వ్యయంతో మడకశిర బైపాస్ కాలువ ద్వారా సత్వరమే ఆయకట్టుకు నీరు అందించే దిశగా అడుగులు..

3. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు రూ. 925 కోట్లు చెల్లించి, 27 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నీరు నింపిన జగనన్న ప్రభుత్వం..
4. చిత్రావతి ప్రాజెక్టు లో రూ. 280 కోట్లతో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తి చేసి, పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు 10 టీఎంసీల నీరు నింపిన జగనన్న ప్రభుత్వం..
5. రూ. 253 కోట్లతో లక్కసాగరం వద్ద HNSS పంప్‌హౌస్ ప్రాజెక్ట్ చేపట్టి ఇప్పటికే పూర్తి చేసి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులకు సాగునీరు అందించి, 10 వేల ఎకరాలకు పైగా సస్యశ్యామలం చేసిన జగనన్న ప్రభుత్వం..
6. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాలకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా మొదటి టన్నెల్ పూర్తి చేసిన జగనన్న ప్రభుత్వం.. రెండో టన్నెల్ కూడా దాదాపుగా పూర్తి.. డిసెంబర్, జనవరిలో జాతికి అంకితం.. తద్వారా ఖరీఫ్ వర్షాలతో 2024 సెప్టెంబర్ నాటికి నల్లమల సాగర్ నింపి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు..
7. కుప్పం నియోజకవర్గానికి నీరందించేందుకు కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి.. డిసెంబర్, జనవరిలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేసి గౌరవ ముఖ్యమంత్రి గారిచే ప్రారంభం..
8. సర్వారాయసాగర్ (3 టీఎంసీలు), పైడి పాలెం (6 టీఎంసీలు) ఆర్ అండ్ ఆర్ పరిష్కరించి పూర్తిస్థాయిలో నీటి నిల్వ..

శ్రీ. అంబటి రాంబాబు, జలవనరుల శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా మెట్టుపల్లి వద్ద 'అవుకు రెండో టన్నెల్' ను 30 నవంబర్, 2023న ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్‌లో వీక్షించవచ్చు..

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

● రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి తడి లేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా గ్లిజరిన్, అలోవెరా జెల్, కొబ్బరి నూనె… వీటిలో ఏదైనా ఒకటి రాసి పది నిమిషాలు మర్దన చేయాలి. తరువాత లైట్ ఆపేసి పది నిమిషాలు శ్వాస మీద దృష్టి కేంద్రీకరించాలి. రోజూ ఇలా చేయడం వల్ల శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అంది రక్త ప్రసరణ జరుగుతుంది. ఫలితంగా ముఖం మెరుపులీనడమే గాక, చర్మం రంగు కూడా అందంగా మారుతుంది.



● రెండు టేబుల్ స్పూన్ల పటికపొడిలో టీస్పూను పసుపు, అర టీ స్పూను నిమ్మరసం, టీస్పూను రోజ్ వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖంపైన పూతలా వేయాలి. పూర్తిగా ఆరిన తరువాత వేళ్లతో సర్కిల్స్‌లా ఐదు నిమిషాలు రుద్దిన తరువాత నీటితో కడిగేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ముఖం మీద ఉండే అవాంఛిత రోమాలు రాలిపోతాయి.

న్యూస్ మేకర్



గోవాకు చెందిన దిశా నాయక్ చరిత్ర సృష్టించింది. విమానాశ్రయాల్లో అగ్ని ప్రమాదాలను నివారించే భారీ వాహనం 'క్రాష్ ఫైర్ టెండర్'ను నడిపే తొలి భారతీయ వనితగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ప్రమోట్ అయ్యింది. గోవా వాసులు సరే, విమానయాన రంగం కూడా ఆమెను ప్రశంసగా చూస్తోంది.

ఎయిర్‌పోర్ట్ ఫైర్‌ఫైటర్

అగ్నిప్రమాదాలు ప్రాణాంతకం. ఎయిర్‌పోర్ట్‌లో జరిగే అగ్ని ప్రమాదాలు మరీ తీవ్రం. సెకన్ల వ్యవధిలో చావు బతుకులు నిర్ణయమవుతాయి సరిగ్గా స్పందించకపోతే. అందుకే ప్రత్యేకంగా 'ఏరోడ్రోమ్ రెస్క్యూ అండ్ ఫైర్ ఫైటింగ్' (ఏ.ఆర్.ఎఫ్.ఎఫ్.) సర్వసమయాల్లోనూ సిద్ధంగా ఉంటుంది ప్రతి ఎయిర్‌పోర్ట్‌లో. అయితే ఈ విభాగంలో స్త్రీల ప్రాతినిధ్యం చాలా తక్కువ. 2021 వరకు గోవాలో ఒక్క మహిళ కూడా ఈ విభాగంలో లేదు. దిశా నాయక్ ఈ ఉద్యోగంలో చేరి గోవాలో తొలి ఎయిర్‌పోర్ట్ ఫైర్‌ఫైటర్‌గా నిలిచింది. ఇప్పుడు ఆమె 'క్రాష్ ఫైర్ టెండర్' నడిపే ఫైర్‌ఫైటర్‌గా ప్రమోట్ అయ్యింది. దాంతో మన దేశంలో క్రాష్ ఫైర్ టెండర్‌ను ఆపరేట్ చేసే తొలి సర్టిఫైడ్ ఉమన్ ఫైర్‌ఫైటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది.

క్రాష్ ఫైర్ టెండర్ (సి.ఎఫ్.టి.) అంటే?

ఇది హైటెక్ ఫైర్ ఇంజిన్. అగ్నిమాపక దళంలో కనిపించే ఫైర్ ఇంజిన్‌కు, దీనికి చాలా తేడా ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌లో, విమానాలు ల్యాండ్ అయ్యేటప్పుడు ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే మంట లార్పేలా ఈ ఫైర్ ఇంజిన్‌ను తయారు చేస్తారు. దీనిని నడపడానికి, మంటలు ఆర్పేలా ఆపరేట్ చేయడానికి తీవ్రశిక్షణ అవసరం. సాధారణంగా మగవారు రాణించడానికే కొంత శ్రమ పడతారు. అలాంటిది దిశా నాయక్ అన్ని పరీక్షలు పాసై సి.ఎఫ్.టి.ని ఆపరేట్ చేసే మహిళా ఫైర్‌ఫైటర్ అయ్యింది.

యూనిఫామ్ ఉండే ఉద్యోగం చేయాలని..

గోవాలోని పెర్నెమ్‌కు చెందిన దిశా నాయక్‌కు బాల్యం నుంచి యూనిఫామ్ ఉండే ఉద్యోగం చేయాలని కోరిక. అయితే చదువు పూర్తయ్యాక అలాంటి ఉద్యోగం ఏమీ దొరకలేదు. 2021లో గోవాలోని 'మనోహర్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్'లో ఫైర్‌ఫైటర్ ఉద్యోగాలకు పోస్టులు పడ్డాయి. ఎయిర్‌పోర్ట్ అగ్నిమాపక దళం లో అప్పటికి ఎవరూ అమ్మాయిలు లేకపోయినా దిశా అప్లై చేసింది. 'మా అమ్మాయి చిన్నప్పటి నుంచి చాలా చురుకు. మోటర్ సైకిల్ నడిపేది. రన్నింగ్ బాగా చేసేది. ఆమె ఫైర్‌ఫైటర్‌గా చేరతానంటే రాణిస్తుందనే నమ్మకంతోనే ప్రోత్సహించాం' అంటారు తల్లిదండ్రులు. వారి ప్రోత్సాహంతో జూన్ నెలలో ఉద్యోగంలో చేరింది దిశా.



● తల్లిదండ్రులతో…

అంచెలంచెలుగా ఎదిగి

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి దిశాలోని చురుకుదనం, అంకితభావం పై అధికారులు గమనించారు. కేవలం సహాయక సిబ్బందిగా ఉండటం కంటే క్రాష్ ఫైర్ టెండర్‌ను నడిపేందుకు ఆమె ఆసక్తి చూపడం గమనించి ఆమెను ట్రైనింగ్‌కి పంపారు. తమిళనాడులోని నమక్కల్‌లో ఆరునెలల పాటు శిక్షణ తీసుకుంది దిశ. ఎయిర్‌పోర్ట్‌లో అగ్నిప్రమాదాలు సంభవించే తీరు, ఏ ప్రమాదంలో సి.ఎఫ్.టి.ని ఎలా ఉపయోగించాలి… అక్కడ ఆమెకు నేర్పించారు. తిరిగి వచ్చాక ఉన్నతాధికారులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఆమె ప్రావీణ్యాన్ని నిర్ధారించి సి.ఎఫ్.టి ఆపరేటర్‌గా ప్రమోట్ చేశారు. 'ఆమె అన్నిరకాల పరీక్షల్లో ఉత్తమంగా నిలిచింది' అని తెలిపారు.

అన్నివిధాలా సిద్ధంగా

'అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంఘటనాస్థలికి చేరుకోవడం కంటే చేరుకున్నాక ఏం చేయాలన్నదే ఎక్కువ ముఖ్యం. ఎయిర్‌పోర్ట్ ఫైర్‌ఫైటర్‌గా పని చేసేవారికి ఎయిర్‌పోర్ట్‌లోని అన్ని ప్రవేశమార్గాలు, కీలకమైన ద్వారాలు, ముఖ్యస్థానాలు మైండ్‌లో ప్రింట్ అయి ఉండాలి. ప్రమాదం జరిగితే ఎక్కడికి చేరి ఎలా కాపాడాలన్నదే ముఖ్యం. ఈ ఉద్యోగంలో క్షణాల్లో యూనిఫామ్‌లోకి మారి వెహికిల్‌లో కూచోవాలి. శారీరక బలంతో పాటు మానసిక బలం ప్రదర్శించాలి. సాంకేతిక జ్ఞానం కూడా తప్పనిసరి' అని తెలిపింది దిశ.

ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ కొన్ని విషయాల్లో బిడియం, సిగ్గుతో వెనకబడే ఉన్నారు స్త్రీలు. ముఖ్యంగా పీరియడ్స్, లోదుస్తుల గురించి మాట్లాడాలంటే భయం. ఎవరిదైనా బ్రా, పెట్టీకోట్‌లు కొద్దిగా బయటకు కనిపిస్తుంటే… చెప్పడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇలా మాట్లాడ్డానికి ఇబ్బంది పడే అంశాన్నే కెరీర్‌గా ఎంచుకుంది రిచాకర్. అమ్మాయిల నుంచి మహిళలు ధరించే 'బ్రా'ల బ్రాండ్‌ను ఎంతో ధైర్యంగా మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఎటువంటి బిడియం లేకుండా తీసుకొచ్చిన ఈ బ్రాండ్ నేడు కోట్ల టర్నోవర్‌తో దూసుకుపోతోంది.

బ్రాండెడ్ కెరీర్



జంషెడ్‌పూర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది రిచాకర్. తండ్రి టాటా స్టీల్ కంపెనీ ఉద్యోగి కాగా తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి విభిన్నంగా ఆలోచించే మనస్తత్వం రిచాది. డిగ్రీ అయ్యాక ఐటీ కంపెనీలో కొన్నేళ్లపాటు ఉద్యోగం చేసింది. శాప్ రిటైల్ కన్సల్టింగ్, స్పెన్సర్స్‌లో ఉద్యోగం చేశాక… సొంతంగా వ్యాపారం చేయాలన్న కోరికతో నర్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా చేసింది. ఒకపక్క ఉద్యోగానుభవం, మరోపక్క మేనేజ్‌మెంట్ స్టడీస్ ద్వారా నేర్చుకున్న జ్ఞానంతో సొంతంగా వ్యాపారం పెట్టడానికి పూనుకుంది. ఇందుకోసం మహిళల లోదుస్తుల వ్యాపారం ఎంచుకుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ''సమాజంలో లోదుస్తుల గురించి మాట్లాడాలంటే భయపడతారు. ఈ వ్యాపారం అవసరమా? వద్దు'' అని నిరుత్సాహపరిచారు. తల్లిదండ్రులు అలా చెప్పినప్పటికీ రిచా ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. తన వ్యాపారం ప్రారంభ పనుల్లో మునిగిపోయింది.

రేడియంట్ మి

మహిళలు ధరించే బ్రాలను సొంతంగా డిజైన్ చేసి, తయారు చేసి, విక్రయించడంపై దృష్టిపెట్టింది. కొన్నిరోజులకి తన పని మీద నమ్మకం ఏర్పడడంతో 2011లో 'జివామే' పేరుతో బ్రా బ్రాండ్‌ను ఏర్పాటు చేసింది. జివామే అంటే హిబ్రూలో 'రేడియంట్ మి' అని అర్థం. కాలేజీ అమ్మాయిల నుంచి పిల్లతల్లుల వరకు అందరూ సౌకర్యంగా ధరించే బ్రాలను విక్రయించడం మొదలు పెట్టింది. కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తుండడంతో ఐదు వేల డిజైన్లు, యాభై బ్రాండ్లు వంద రకాల సైజుల్లో లోదుస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్‌ల ద్వారా అందిస్తోంది జివామే.

కోట్ల టర్నోవర్‌తో…

లోదుస్తులు ధరించిన మహిళలు సౌకర్యంగా… కాన్ఫిడెంట్‌గా ఉండడమే లక్ష్యంగా లోదుస్తులను అందుబాటులో ఉంచుతుండడంతో జివామే బ్రాండ్ మార్కెట్లోకి వచ్చిన ఏడాదిలోనే పెట్టుబడిదార్లను ఆకర్షించింది. దీంతో 2012లో మూడు మిలియన్ల డాలర్లు, మరుసటి ఏడాది ఇది రెట్టింపు అయ్యింది. 2015 నాటికి నలభై మిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చాయి. దీంతో కంపెనీ ఆరువందల కోట్లపైకి ఎగబాగి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

డైరెక్టర్‌గా…

కోట్ల టర్నోవర్‌తో దూసుకుపోతోన్న సమయంలో కొన్ని కారణాలతో 2017 సీఈవో పదవి నుంచి తప్పుకుని, డైరెక్టర్‌గా కొనసాగుతోంది రిచాకర్. ప్రస్తుతం రిచా నెట్ వర్త్ దాదాపు 750 కోట్లు ఉండొచ్చని అంచనా. మంచి లాభాల్లో దూసుకుపోతోన్న జివామే బ్రాండ్‌ను 2020 లో రిలయన్స్ రిటైల్ కొనుగోలు చేసింది. తన కలను నిజం చేసుకున్న 43 ఏళ్ల రిచా కర్ ప్రస్తుతం తన భర్త కేదార్ గవాన్‌తో కలిసి అమెరికాలో నివాసముంటోంది.

'' ఒక స్త్రీ మనసును మరో స్త్రీ మాత్రమే అర్థం చేసుకుంటుంది. అందుకే మూసపద్ధతులను దాటుకుని మహిళలు సౌకర్యంగా ధరించే లో దుస్తుల బ్రాండ్‌ను తీసుకొచ్చాను. జివామేను మార్కెట్లోకి తేవడానికి, దానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకు రావడానికి చాలా సవాళ్లను, ఒత్తిళ్లనూ ఎదుర్కోవలసి వచ్చింది. వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోబట్టే ఇవాళ ఈ స్థాయికి రాగలిగాను. ఇంట్లో… సమాజంలో మనల్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తారు. అయినా మన మీద మనం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. అప్పుడు అమ్మాయిలు దేనిలో తక్కువ కాదు. మనసులో ఏదైనా నిర్ణయించుకుంటే అది కచ్చితంగా సాధించ గలుగుతారు'' అని చెబుతూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది రిచాకర్.

ఇంటిప్స్




● క్యారట్స్ ఎండిపోయినట్లు, వాడిపోయినట్లుగా ఉంటే ఒక గిన్నెలో వేసి, క్యారట్స్ మునిగేలా నీళ్లు పోయాలి. ఈ గిన్నెమీద మూతపెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. పన్నెండు గంటల తరువాత నీటిలో నుంచి క్యారట్స్ తీసి చూస్తే తాజాగా ఉంటాయి. ఇప్పుడు తొక్క తీసి చక్కగా వాడుకోవచ్చు. క్యారట్ మీద నల్లటి మచ్చలు ఏర్పడినప్పుడు కూడా ఈ చిట్కా చక్కగా పనిచేస్తుంది.

● ఎంత కడిగినా పాల బాటిల్స్ వాసన వస్తుంటాయి. ఇలాంటప్పుడు పాల బాటిల్‌లో టేబుల్ స్పూను వంటసోడా, కొన్ని నీళ్లు పోసి రాత్రంతా ఉంచాలి. ఉదయం బాటిల్‌ను షేక్ చేసి కడిగితే పాల వాసన పోతుంది. ఇదే విధంగా పాల బాటిల్‌లో కొద్దిగా వెనిగర్ వేసి షేక్ చేసి పక్కన పెట్టాలి. ఆరు గంటల తరువాత వేడి నీటితో కడగాలి. పాల వాసన పోతుంది.

● 200 ఎమ్ఎల్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల వైట్ వెనిగర్, రెండు టేబుల్ స్పూన్ల పంచదార వేసి కలపాలి. ఈ నీటిని కుండీల్లోని మొక్కల మట్టిపైన, ఆకులపైన చల్లాలి. ఈ నీరు కీటక నివారిణిగా పనిచేయడమేగాక, మొక్కలకు పునరుజ్జీవాన్ని ఇస్తుంది.



పురస్కారం





● గ్రామ సమావేశంలో…

ఆర్మీ ఆఫ్ జెండర్ చాంపియన్స్

● ఫలితం వచ్చే వరకు ప్రయత్నం ఆగదు

పేదరికంలో పుట్టిన ఢిల్లీకి చెందిన సఫీనా హుసేన్ చదువును నమ్ముకొని ఉన్నత స్థాయికి చేరింది. లండన్‌లో చదువుకున్న సఫీనా అమెరికాలో ఉద్యోగం చేసింది. ఆ తరువాత మన దేశానికి తిరిగి వచ్చి పేదింటి ఆడపిల్లలు బడి బాట పట్టడానికి 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. ఎన్నో రాష్ట్రాలలో వేలాదిమంది ఆడపిల్లలు చదువుకోగలిగేలా చేసింది.

తాజాగా… ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో కృషి చేస్తున్న వారికి 'వరల్డ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ఫర్ ఎడ్యుకేషన్, ఖతర్' వారు ఇచ్చే 'వైజ్'ప్రైజ్‌కు ఎంపికైంది. ఈ ప్రైజుకు ఎంపికైన ఫస్ట్ ఇండియన్ సఫీనా హుసేన్ గురించి…

'అబ్బాయిని స్కూలుకు పంపిస్తున్నారు కదా. మరి అమ్మాయిని ఇంటిపనులకే పరిమితం చేస్తున్నారేమిటి?' అని అడిగినప్పుడు ఆ ఇంటిపెద్ద నవ్వుతూ ఇచ్చిన సమాధానం….

'ఆడపిల్లలకు చదువెందుకు. ఏదో ఒకరోజు పెళ్లి చేయాల్సిందే కదా' ఇంచుమించు ప్రతి ఇంటి నుంచి ఇలాంటి సమాధానమే వినిపించింది.

'ఆడపిల్లలకు విద్య' అనే నినాదం ప్రాధాన్యతకు నోచుకోని ఎన్నో ప్రాంతాలను చూసింది సఫీనా. దీనికి పేదరికం ఒక కారణం అయితే, ఆర్థికస్థాయి బాగున్నా 'ఆడపిల్లకు చదువెందుకు' అనే నిర్లిప్తత మరోకారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఇంటి ఆడపిల్ల బడికి వెళ్లాలనే లక్ష్యంతో 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది సఫీనా.

'ఒక సమస్య గురించి మాట్లాడేటప్పుడు దానితో మమేకం కావాలి' అంటున్న సఫీనాకు పేదరికం అనేది అపరిచిత సమస్య కాదు. ఢిల్లీలోని ఒక పేదకుటుంబంలో పుట్టింది. ఎన్నో కష్టాల మధ్య కూడా 'చదువు' అనే ఆయుధాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ఆ కుటుంబం నుంచి లండన్‌లో చదువుకున్న తొలి వ్యక్తి అయింది. లండన్ నుంచి అమెరికాకు వెళ్లి స్వచ్ఛంద సేవారంగంలో పని చేసిన సఫీనా 2005లో స్వదేశానికి తిరిగి వచ్చింది.

'చదువుకోవడం వల్ల నేను ఎంతో సాధించాను. దేశదేశాలు తిరిగాను. చదువుకోకపోతే నా పరిస్థితి ఊహకు కూడా అందనంత దయనీయంగా ఉండేది' అనుకున్న సఫీనా హుసేన్ పేదింటి ఆడపిల్లల చదువు కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ప్రభుత్వ సంస్థల నుంచి వివరాలు సేకరించింది. చదువుకు సంబంధించి జెండర్-గ్యాప్ ఉన్న 26 జిల్లాల గురించి తెలుసుకుంది. అందులో తొమ్మిది రాజస్థాన్‌లో ఉన్నాయి.

రాజస్థాన్‌లో ఆడపిల్లల చదువుకు దూరంగా ఉన్న ప్రాంతాలను మొదట ఎంపిక చేసుకుంది సఫీనా బృందం. గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకులతో 'ఆర్మీ ఆఫ్ జెండర్ చాంపియన్స్'ను ఏర్పాటు చేసి 'దయచేసి మీ అమ్మాయిని స్కూల్‌కు పంపించండి' అంటూ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. 'ఆడపిల్లలకు చదువు' అనే అంశంపై గ్రామ సమావేశాలు ఏర్పాటు చేశారు. సఫీనా ఆమె బృందం కృషి వృథా పోలేదు. ఎన్నో గ్రామాల్లో ఎంతోమంది ఆలోచన తీరులో మార్పు వచ్చింది. తమ ఇంటి ఆడపిల్లలను స్కూలుకు పంపించడం ప్రారంభించారు.

చాలా బడులలో ఆడపిల్లల కోసం టాయిలెట్ సదుపాయాలు లేవు. అలాంటి బడులలో ప్రత్యేక టాయిలెట్‌లు నిర్మించేలా చేశారు. బడిలో అకాడమిక్ పాఠాలు మాత్రమే కాకుండా లైఫ్‌స్కిల్స్‌కు సంబంధించిన పాఠాలు కూడా చెప్పేవారు.

'ఆడపిల్లలకు చదువు దూరం కావడం అనేది ఆర్థిక సమస్యతో ముడిపడి ఉన్న అంశం కాదు. అది పితృస్వామిక భావజాలానికి సంబంధించింది. మేము పనిచేసిన కొన్ని ప్రాంతాలలో ప్రజలు ఇంటి ఆడపిల్ల కంటే గొర్రెలు, మేకలను విలువైన ఆస్తిగా భావించడం చూశాం. ముందు వారి ఆలోచన తీరులో మార్పు తీసుకు రావాలనుకున్నాం. అది అంత తేలిక కాదని తెలిసినా రంగంలోకి దిగాం. ప్రభుత్వ సంస్థల నుంచి లోకల్ వాలెంటీర్స్ వరకు కలిసి పనిచేశాం. అయితే మేము నిరాశతో వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి రాలేదు' అంటుంది సఫీనా.

'ఆడ పిల్లలకు చదువు అందని ప్రాంతాలు ఏమిటి?' అనే అంశంపై ఒకప్పుడు ప్రభుత్వ సంస్థల డాటాపైన ఆధారపడిన సఫీనా బృందం ఇప్పుడు డాటా ఎనాలటిక్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలాంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. జియో-ట్యాగ్‌డ్ టార్గెట్ విలేజెస్ నుంచి మొబైల్ ఫోన్స్‌లో డాటా సేకరిస్తున్నారు. తమ పనితీరును మరింత మెరుగుపరుచుకొని ఉత్తమఫలితాలు సాధించడానికి వారికి ఇది ఉపయోగపడుతుంది.

గతాన్ని గట్టిగా గుర్తు పెట్టుకున్న సఫీనా హుసేన్ ఎన్నో రాష్ట్రాలలో ఎంతోమంది పేదింటి అమ్మాయిల ఉజ్వల భవిష్యత్ కోసం 'ఎడ్యుకేట్ గర్ల్స్' ద్వారా కృషి చేస్తోంది.

అయినా వెనకడుగు వేయలేదు



'ఎడ్యుకేట్ గర్ల్స్'తో తొలి అడుగులు వేసినప్పుడు 'మీలాగే చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు' అని నిరుత్సాహపరిచారు కొందరు. అయితే అలాంటి మాటలను మేము సీరియస్‌గా తీసుకోలేదు. 'ఫలితం వచ్చేవరకు మా ప్రయత్నం' అనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. బయటి వాళ్లు చెప్పే మాటల కంటే తమ ఊరి వాళ్లు చెప్పే మాటలకే గ్రామస్థులు ప్రాధాన్యత ఇస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో స్థానికులతో కలిసి ఆర్మీ ఆఫ్ జెండర్ ఛాంపియన్స్‌ను ప్రారంభించి ఆడపిల్లల విద్యకు సంబంధించి ఇంటింటి ప్రచారం నిర్వహించాం.

– సఫీనా హుసేన్, ఫౌండర్, ఎడ్యుకేట్ గర్ల్స్

ఆత్మబలం

భవిష్యత్తుకు ప్రేరణ



● ప్రేరణ

'మీ కూతురు ఇక నడవలేదు. వినలేదు' అంటూ వైద్యుడి నోటి నుంచి వచ్చిన మాట విన్న తరువాత ఉజ్వల, ఆమె భర్త తమ జీవితాలను అర్ధంతరంగా చాలించాలనుకున్నారు.

నిరాశే తప్ప ఆశ కనిపించని ఆ కఠిన సమయంలో హెలెన్ కెల్లర్ ఆత్మకథ చదివిన ఉజ్వల ఆత్మస్థైర్యం తెచ్చుకొని, జీవితాన్ని వెలుగుమయం చేసుకుంది. కూతురికి ఉజ్వల భవిష్యత్ ఇచ్చింది…

ఆ రోజులు ఎలాంటివి అంటే… పాప నవ్విన ప్రతిక్షణం ఆ దంపతులకు పండగే.

అలాంటి ఆనందమయ రోజుల్లో ఆరు నెలల పాప ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. ఈ ప్రమాదం వల్ల పాప పక్షవాతానికి గురైంది. వినికిడి శక్తి కోల్పోయింది.

'పాప ఇక ఎప్పటికీ నడవలేదు' అన్నట్లుగా చెప్పాడు డాక్టర్.

ఆ ఇల్లు ఒక్కసారిగా చీకటిలోకి వెళ్లిపోయింది.

'ఆత్మహత్య తప్ప మన జీవితానికి మరో పరిష్కారం లేదు' అనుకున్నారు ఉజ్వల, ఆమె భర్త. ఆ సమయంలో ఒకరోజు తన సోదరి దగ్గర మనసులోని బాధను బయట పెట్టింది ఉజ్వల. సోదరి ఏం మాట్లాకుండా హెలెన్ కెల్లర్ ఆత్మకథ పుస్తకం 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' చేతిలో పెట్టి 'ఇది ఒకసారి చదువు… ఇంతకుమించి ఏమీ చెప్పను' అన్నది.

'ప్రతి నిమిషం నిరాశే' లాంటి ఆ రోజుల్లో ఒకరోజు ఉజ్వల హెలెన్ కెల్లర్ ఆత్మకథ చదవడం మొదలుపెట్టింది. ఎన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'గుడ్ ఇంగ్లీష్'పై హెలెన్ పట్టుసాధించిన విధానం నుంచి జీవితంలోని నిరాశామయ సమయాల్లోనూ ధైర్యంగా ముందుకు వెళ్లడం వరకు 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుంది.

నయాగరా జలపాతం దగ్గర ఉన్నప్పుడు ఆ జలపాతం అందాలను హెలెన్ మనోనేత్రంతోనే చూసిన విధానం అపురూపంగా అనిపించింది. ఆ పుస్తకం చదవడం పూర్తిచేసిన తరువాత తన మనసులో కమ్మిన నిరాశ మేఘాలు దూదిపింజల్లా ఎగిరిపోయాయి. 'నా బిడ్డ కనీసం చూడగలుగుతుంది కదా' అనుకుంది ఉజ్వల. తనలో సానుకూల శక్తికి అక్కడే బీజం పడింది.

'ప్రియాంక'గా ఉన్న పాప పేరును 'ప్రేరణ' గా మార్చింది. మార్పు మొదలైంది. అది ఆశావహమైన మార్పు.

మరోవైపు… నడవడం కష్టం అనుకున్న పాప వైద్యం, వ్యాయామాల వల్ల నడవడం ప్రారంభించింది. అయితే వినికిడి లోపం మాత్రం పోలేదు. ప్రేరణను స్పీచ్ అండ్ హియరింగ్-ఇంపేర్డ్ స్కూలులో చేర్పించింది.

ప్రేరణకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న ఆసక్తిని గమనించి పుణెలోని 'సాధన నృత్యాలయ'లో చేర్పించింది ఉజ్వల.

'నృత్యాలయలో చేర్పించిన మాటేగానీ ప్రేరణ ఎలా డ్యాన్స్ చేయగలుగుతుంది? గురూజీ చెప్పే ముద్రలను ఎలా అర్థం చేసుకోగలదు… ఇలాంటి సందేహాలెన్నో నాలో ఉండేవి. అయితే గురూజీ షమిత మహాజన్‌లో మాత్రం ఎలాంటి సందేహం లేదు. ప్రేరణను ఎలాగైనా మంచి నృత్యకారిణిగా తయారు చేయాలనే పట్టుదల ఆమె కళ్లలో కనిపించింది' అంటుంది ఉజ్వల.



● తల్లితో…

ఒక ద్వారం మన కోసం…

బాధ, ఆవేశంలో ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాలు ప్రమాదకరంగా ఉంటాయి. ప్రశాంతమైన హృదయంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మన కోసం ఎక్కడో ఒక చోట ఒక ద్వారం తెరుచుకొనే ఉంటుంది. ఆవేదన, ఆవేశాలతో ఆ ద్వారం దగ్గరకు చేరలేము.

– ఉజ్వల సహానే

శమిత మహాజన్ దగ్గర నృత్యంలో పాఠాలు నేర్చుకోవడం మొదలు పెట్టింది ప్రేరణ.

మొదటి రెండు సంవత్సరాలు బాగానే కష్టపడాల్సి వచ్చింది ప్రేరణ.

'మాటల ద్వారా ప్రేరణకు నాట్యానికి సంబంధించిన ముద్రలను నేర్పించడం కష్టం. చాలా ఓపిక ఉండాలి. గురూజీ ఎప్పుడూ ఓపిక కోల్పోలేదు. గురూజీ చెప్పేదాన్ని లిప్-రీడింగ్ ద్వారా అర్థం చేసుకోవడం మొదలు పెట్టింది ప్రేరణ' అని గతాన్ని గుర్తు చేసుకుంటుంది ఉజ్వల.

ఎంతోమంది సీనియర్ డ్యాన్సర్‌ల ముందు ప్రేరణ ఆరంగేట్రం ఇచ్చింది. సింగిల్ మిస్టేక్ కూడా చేయలేదు.

'నాట్యకారిణిగా నీకు ఉజ్వల భవిష్యత్ ఉంది' అని పెద్దలు ప్రేరణను ఆశీర్వదించారు.

'చీకటిగా ఉన్న నా ఆత్మగదుల్లోకి ఒక కాంతికిరణం ప్రసరిస్తే ఎలా ఉంటుంది?' అని తన ఆత్మకథ చివరిలో ప్రశ్నిస్తుంది హెలెన్ కెల్లర్.

అది అచ్చంగా ఆత్మస్థైర్యంతో తెచ్చుకున్న అపూర్వ విజయంలా ఉంటుంది. అందుకు ఉదాహరణ ప్రేరణ.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 249
గురువారం 30-11-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే. ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'


ద్రవిడ్ బృందానికే జై
హెడ్ కోచ్‌గా కొనసాగనున్న ద్రవిడ్.
ఇతర సిబ్బందికీ మళ్లీ చాన్స్ - 12లో


మళ్లీ 20 వేల స్థాయికి పైకి నిఫ్టీ
కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
సెన్సెక్స్ లాభం 728 పాయింట్లు -13లో


ఉచిత రేషన్ మరో ఐదేళ్లు
దేశంలోని పేదలకు ఇస్తున్న ఉచిత రేషన్‌ను కేంద్రం మరో ఐదేళ్లు పొడిగించింది. డ్వాక్రా మహిళలకు డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించింది.
వివరాలు 6లో ▸


అదొక పీడ కల, అగ్ని పరీక్ష
ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగం నుంచి 17 రోజుల తర్వాత బయటపడిన కార్మికులు తమ అనుభవాలను వెల్లడించారు.
వివరాలు 6లో ▸



యూఎస్‌లోనే హెచ్‌-1బీ రెన్యూవల్
హెచ్-1బీ వీసాల రెన్యూవల్‌కు స్వదేశానికి వెళ్లాల్సిన అవసరం లేదని.. తమ దేశంలోనే పూర్తి చేయవచ్చని అమెరికా తెలిపింది.
వివరాలు 6లో ▸


దారి మళ్లిన విమానం!
ఓ భార్యాభర్త గొడవ దెబ్బకు మ్యూనిచ్ నుంచి బ్యాంకాక్ వెళ్తున్న విమానాన్ని అత్యవసరంగా ఢిల్లీ విమానాశ్రయానికి మళ్లించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

2 నుంచి ఏపీలో భారీ వర్షాలు



బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రపై ఎక్కువగా.. ఉత్తర కోస్తాపై స్వల్పంగా ఉంటుందని పేర్కొంది. డిసెంబర్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు మొదలవుతాయని వెల్లడించింది.
వివరాలు 5లో ▸

రుషికొండపై నిర్మాణాల నిలుపుదలకు హైకోర్టు 'నో'



విశాఖపట్నం రుషికొండపై జరుగుతున్న పర్యాటక శాఖ రిసార్ట్ పునరుద్ధరణ పనులను, నిర్మాణాలను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ కమిటీ నివేదిక ఇచ్చిన తరువాత ఏం చేయాలో చూస్తామని తేల్చిచెప్పింది.
వివరాలు 2లో ▸

ఒక్క ఫోన్ చాలు | సమస్యలన్నీ పరిష్కారం..

పారిశ్రామిక ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ భరోసా

- పారిశ్రామిక అభివృద్ధి.. స్థానిక యువతకు ఉపాధి లక్ష్యంగా అడుగులు.. జీఐఎస్ ఒప్పందాలను వేగంగా అమల్లోకి తెస్తున్నాం
- గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందాల మేరకు ఇప్పటికే 33 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభం
- శరవేగంగా మరో 94 ప్రాజెక్టుల పనులు
- వివిధ దశల్లో మిగతావి.. పురోగతి సాధించేలా నిరంతరం సీఎస్ సమీక్షలు
- నాలుగున్నరేళ్లలో 130 భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.69 వేల కోట్ల పెట్టుబడులు
- 86 వేల మందికి ఉద్యోగాలు కల్పించగలిగాం
- మన ప్రభుత్వం వచ్చాక కొత్తగా 1.88 లక్షల ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు
- వీటి ద్వారా 12.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి.. ఫిబ్రవరిలో ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలు విడుదల
- రూ.1,785 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, 18,304 మందికి ఉద్యోగాలు కల్పించేలా 21 ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ల అభివృద్ధి
- రూ.1,100 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టులకు సీఎం వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు



సీఎం జగన్ పారిశ్రామిక విధానాలు అభినందనీయం 3లో
ప్రపంచ ప్రఖ్యాత సంస్థ పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్ ప్రశంసలు

పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా అన్ని రకాలుగా చేయి పట్టుకుని నడిపిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పారిశ్రామికవేత్తల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉందని గుర్తు చేశారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదిరిన ఒప్పందాలను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ త్వరితగతిన అమల్లోకి తెస్తున్నామని, ఇందుకోసం కృషి చేస్తున్న అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా
మిగతా 3వ పేజీలో ▶

ప్రభుత్వం ఘనతలను చెప్పకోవడంలో

తప్పేముంది?

'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై హైకోర్టు
అధికారులు పాల్గొనకుండా ఉత్తర్వులివ్వాలన్న అభ్యర్థన తిరస్కృతి

- ఇది ప్రచారమే కాదు.. ప్రజలకు సమాచారం అందించడం కూడా
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజూ పత్రికల్లో భారీ ప్రకటనలు ఇస్తున్నాయి
- సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూనే ఉన్నాయని కోర్టు వ్యాఖ్య
- ప్రభుత్వ నిధులు ఖర్చు చేయకూడదన్న వినతికీ తిరస్కరణ
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం.. నోటీసులు జారీ
- ఈ కార్యక్రమంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం: న్యాయవాది

సాక్షి, అమరావతి: 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో అధికారులు పాల్గొనకుండా, ప్రభుత్వ నిధులు ఖర్చు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం తన ఘనతలను ప్రజలకు చెప్పుకోవడంలో తప్పేముందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. సంక్షేమ పథకాలను ప్రభుత్వ యంత్రాంగం ద్వారా వివరించడంలో తప్పేమీ లేదంది. ఏ ప్రభుత్వమైనా ఇదే చేస్తుందని వ్యాఖ్యానించింది. ఇది ప్రచారం మాత్రమే కాదని, ప్రజలకు సమాచారం అందించడం కూడా అని తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజూ వాటి ఘనతల గురించి పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు ఇస్తున్నాయంది. తాము (హైకోర్టు) కూడా ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను బుక్‌లెట్



రూపంలో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వివరిస్తున్నామంది. ఇందుకు ప్రభుత్వసాయం కూడా తీసుకుంటున్నామని చెప్పింది. 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై
మిగతా 2వ పేజీలో ▶



కదం తొక్కిన జనం

2లో

మచిలీపట్నం, కురుపాంలో సామాజిక సాధికార యాత్రలకు తరలివచ్చిన ప్రజలు

సీఎం జగన్ అందించిన చేయూతతో ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించిన బడుగు, బలహీనవర్గాలు మచిలీపట్నం, కురుపాంలో కదంతొక్కాయి. విద్య, వైద్య రంగాలను సమూలంగా మార్చడమే గాక ప్రభుత్వ సేవలను తమ ఇళ్ల వద్దే అందిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. భారీఎత్తున భూ పంపిణీతో తమ బతుకులు మార్చారంటూ కురుపాంలో గిరిజనులు హర్షధ్వానాలు, 'జై జగన్' నినాదాలతో కృతజ్ఞతలు తెలియజేశారు.

బుధవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

12న పలాసలో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభోత్సవం



సీఎం జగన్ చేతుల మీదుగా డిసెంబర్ 12న పలాసలో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. 2లో

నేడు తెలంగాణలో ఎన్నికలు



తెలంగాణలో శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 10లో



అప్పులపై ఎల్లో బ్యాచ్‌ది తప్పుడు ప్రచారమే

రాష్ట్రాల అప్పులపై నివేదిక విడుదల చేసిన ఆర్బీఐ

- అప్పుల్లో మొదటి స్థానంలో ఉన్న తమిళనాడు.. ఆ తర్వాత స్థానాల్లో యూపీ, మహారాష్ట్ర, బెంగాల్, కర్ణాటక
- ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- 2023 మార్చికి రాష్ట్ర అప్పులు రూ.4,42,442 కోట్లు
- చంద్రబాబు హయాం(2018–19)లో అప్పుల వృద్ధి 15.3 శాతం
- 2022–23లో అప్పుల వృద్ధి 12.4 శాతం మాత్రమే

10లో



జలసిరుల 'సీమ'

అత్యాధునిక పరిజ్ఞానంతో అవుకు రెండో సొరంగం పూర్తి

- నేడు జాతికి అంకితం చేయనున్న సీఎం
- గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల తరలింపునకు లైన్ క్లియర్.. కేవలం 15 రోజుల్లోనే గండికోట రిజర్వాయర్ నింపేందుకు మార్గం సుగమం
- రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- 640 గ్రామాల్లో 20 లక్షల మంది తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

11లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆ పథకమే లేకపోయుంటే..



ఆ రోజు దీపావళి పండుగ. అందరం సంబరంగా మాట్లాడుకుంటున్నాం. మధ్యాహ్నం 3 గంటలకు ఉన్నట్లుండి గుండెల్లో నొప్పి మొదలైంది. గ్యాస్ ప్రాబ్లమ్ అనుకుని ఈనో తాగాను. నొప్పి తగ్గలేదు. పైగా చెమటలు అధికమై సాయంత్రం 5 గంటలకు జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న గౌరీగోపాల్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి చూడగా గుండెపోటు అని వైద్యులు నిర్ధారించారు. ఒక్కసారిగా నాకు గుండె ఆగినంత పనైంది. వెంటనే ఆరోగ్య శ్రీ కింద అప్రూవల్ తీసుకుని గుండెకు స్టెంట్ వేసి వైద్యులు నా ప్రాణాలు కాపాడారు. ఈ చికిత్సను పూర్తిగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా చేశారు. నేను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో ఆసరాగా రూ.5 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ పథకమే లేకపోయినట్టయితే నేను కచ్చితంగా అప్పులపాలయ్యే వాడిని. నేను కొన్ని దశాబ్దాలుగా టైలర్‌గా జీవనం సాగిస్తున్నాను. నా భార్య పేరు ఉమాదేవి. మాకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. నా కష్టార్జితంతో ముగ్గురు కుమార్తెలకు పెళ్లి చేశాను. కుమారుడు పి.మంజునాథ్ డిగ్రీ పూర్తి చేశాడు. చిన్న కుమార్తె ప్రియాంక పీజీ పూర్తి చేసి సుజికి షోరూమ్‌లో టెలికాలర్‌గా పని చేస్తోంది. ఈ అమ్మాయికి పెళ్లి చేసేందుకు 62 ఏళ్ల వయసులోనూ కష్టపడుతున్నాను. ఈ క్రమంలో ప్రభుత్వ పథకాలు మా కుటుంబానికి ఆసరాగా నిలిచాయి.

– పి.మణి, బండిమెట్ట కాలనీ, కర్నూలు
(జోగినేని కుమార్, విలేకరి, కర్నూలు)

నాతో పాటు నలుగురికి ఉపాధి



డ్వాక్రా సంఘంలో ఉంటూ ప్రభుత్వం అందించిన అవకాశాలను ఉపయోగించుకుని నేను ఉపాధి పొందడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నా. మా ఊళ్లో దుర్గాభవాని పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. ఆసరా పథకం కింద ఏటా రూ.15,800 నగదును రాష్ట్ర ప్రభుత్వం నా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తోంది. ఈ నగదుతో పాటు బ్యాంక్ లింకేజీ రుణం రూ.లక్ష, స్త్రీనిధి కింద రూ.2 లక్షలు రుణం తీసుకుని సొంతంగా కొంత నగదు వెచ్చించి ఇంటి వద్ద కంప్యూటర్ ఎంబ్రాయిడరీ నిర్వహిస్తున్నా. ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాల్లో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ ద్వారా తయారు చేసిన జాకెట్లు, చీరెలు ప్రదర్శించి తద్వారా కూడా మంచి ఆర్డర్లు పొందుతున్నా. ఆసరా నగదు వల్ల కావాల్సిన మెటీరియల్ ముందుగానే తెచ్చుకుంటున్నా. నా దగ్గర నలుగురు మహిళలు ఎంబ్రాయిడరీ నేర్చుకోవడంతో పాటు కుట్టు పనులు చేస్తున్నారు. నేను ఉపాధి పొందడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాననే విషయం చాలా ఆనందం కలిగిస్తోంది. సీజన్‌ను బట్టి నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నా. ఆర్థిక అవసరాల కోసంఇప్పుడు ఏ మాత్రం అప్పు చేయాల్సిన పరిస్థితి లేదు. ఇటీవలే ఆరు గేదెలతో పాడి కూడా ప్రారంభించాను. మంచి లాభం వస్తోంది.

– కాకాని అలేఖ్య,
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా
(పి.సాంబశివరావు, విలేకరి, పెనుగంచిప్రోలు)

తల్లిలేని పిల్లలను సర్కారే ఆదుకుంది



నా కుమార్తె సంతోషిదాస్‌ను నా అల్లుడు విజయకుమార్ దాస్ ఐదేళ్ల కిందట హైద్రాబాద్‌లో హత్య చేశాడు. మాది నిరుపేద కుటుంబం. అతనిపై అక్కడ కేసు పెట్టే ఆర్థిక స్థోమత లేక, పోరాడ లేక నా మనవరాలు వర్షిత (14), మనవడు జ్యోతిష్ (11)లను అప్పట్లోనే సొంతూరైన శ్రీకాకుళం తీసుకొచ్చేశాను. అనారోగ్యం వల్ల మా ఆయన పని చేయలేరు. నేనే నాలుగిళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని ఎలాగోలా నెట్టుకొస్తున్నాను. నా బతుకే అంతంతమాత్రం అనుకుంటే ఇద్దరు పిల్లల పోషణ కష్టమైంది. ఇంతలో ఎన్నికలు వచ్చి వైఎస్ జగన్ సీఎం అయ్యారు. అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టిన తొలి ఏడాది పిల్లల ఆధార్ కార్డులు లేకపోవడంతో అ డబ్బు అందలేదు. నా దీనస్థితిపై 'సాక్షి'లో వార్త రావడంతో అధికారులు స్పందించి పిల్లలిద్దరికి ఆధార్ కార్డులు సమకూర్చారు. ఇప్పుడు అమ్మ ఒడి వస్తోంది. ఇదే వారికి ఆధారమైంది. జగనన్న గోరుముద్దతో ఒక పూట స్కూల్‌లోనే మంచి భోజనం అందుతోంది. విద్యా కానుక ద్వారా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం ఇస్తున్నారు. ఇప్పుడు వైద్య పరీక్షలు కూడా చేసి మందులిస్తున్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాల వల్ల పిల్లల పోషణ నాకు భారం అనిపించడం లేదు.

– బైరాగి అన్నపూర్ణమ్మ,
చిన బొందిలీపురం, శ్రీకాకుళం
(వీవీఎస్.శ్రీనివాస్, విలేకరి, శ్రీకాకుళం)

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం సాధికార సభకు పోటెత్తిన అశేష జనసందోహంలో ఓ భాగం



వెల్లివిరిసిన గిరిజన చైతన్యం

కురుపాంలో సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన ప్రజలు

- గిరిశిఖర గ్రామాల నుంచి తరలివచ్చిన జనం
- బతుకులు మార్చిన జగనన్నకు జేజేలంటూ పాటలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సుదీర్ఘకాలంగా వెనుకబడి ఉన్న గిరిజన ప్రాంత దశను మార్చేలా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనం జై కొట్టారు. విద్య, వైద్య రంగాలను సమూలంగా మార్చడమే గాక ప్రభుత్వ సేవలను తమ ఆవాసాలకే చేర్చినందుకు హర్షధ్వానాలతో కృతజ్ఞతలు తెలిపారు. భారీఎత్తున భూ పంపిణీతో బతుకులు మార్చిన జగనన్నకు జేజేలంటూ పాటలు పాడారు. గిరిజన పక్షపాతికి సుదూర గిరిశిఖర గ్రామాల నుంచీ తరలివచ్చి ధన్యవాదాలు చెప్పారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర దృశ్యమిది. గిరిజన చైతన్యానికి ఈ యాత్ర అద్దంపట్టింది. తొలుత కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం నందివానివలస గ్రామం నుంచి వందలాది యువకులు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బయల్దేరారు. 11 గ్రామాల మీదుగా 12 కిలోమీటర్లకు పైగా సాగిన ఈ ర్యాలీకి ప్రజలు ప్రతి గ్రామంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కురుపాం పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరిగింది. సభ ఆద్యంతం జై జగన్, జై జై జగన్ నినాదాలతో హోరెత్తింది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చేసిన మేలును ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే ప్రజలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక జిల్లాతో గిరిజనులకు గుర్తింపు: ఎంపీ గొడ్డేటి మాధవి

సుదీర్ఘకాలంగా వెనుకబడి ఉన్న గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని, ప్రత్యేకంగా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటుచేసి 45 లక్షల మంది గిరిజనులకు గుర్తింపు ఇచ్చారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

సీఎం జగన్ దేశానికే స్ఫూర్తి: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, చెప్పని పథకాలను ఎన్నింటినో అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ దేశానికే స్ఫూర్తిగా నిలిచారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసి, సాధికారత కల్పించిన సీఎం ఒక్క జగన్ మాత్రమేనని అన్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం చంద్రబాబు సొంత మామకు వెన్నుపోటు పొడిచినట్లే 2014 ఎన్నికల్లో గెలిపించిన ప్రజలనూ మోసం చేశారని చెప్పారు. 2024 ఎన్నికల్లోనూ మాయమాటలు చెప్పడానికి చంద్రబాబు సహా టీడీపీ మోసగాళ్లు మళ్లీ ప్రజల ముందుకొస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని అన్నారు.

గిరిజన బిడ్డలకు పెద్దపీట: ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

రాష్ట్రంలోని గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు అనేక నామినేటెడ్ పదవులు ఇచ్చి అన్ని రంగాల్లో ముందడుగు వేసేలా తీర్చిదిద్దుతున్నారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. చంద్రబాబు ఏనాడూ గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదన్నారు. బాబుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్ గిరిబిడ్డలను అనేక పథకాలతో ఆదరిస్తున్నారని, మంచి విద్య, అధునాతన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. గిరిజనులకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని అన్నారు.

గిరిజనులకు అందుబాటులో విద్య: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, సాలూరులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంతో పాటు పార్వతీపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా గిరిజనులకు ఉన్నత విద్యను సీఎం వైఎస్ జగన్ అందుబాటులోకి తెస్తున్నారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడే సీఎం జగన్ వెంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నిలవాలని, లేదంటే నష్టపోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో కదం తొక్కిన బడుగు జనం

- ఘనంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాధికార యాత్ర
- వేలాదిగా పాల్గొన్న జనం
- జై జగన్ నినాదాలతో మార్మోగిన మచిలీపట్నం



కృష్ణా జిల్లా మచిలీపట్నం సాధికార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



బస్సు యాత్రలో పాల్గొన్న నాయకులు

చిలకలపూడి (మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన చేయూతతో ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించిన బడుగు, బలహీన వర్గాలు మచిలీపట్నంలో కదంతొక్కాయి. బుధవారం ఇక్కడ జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. సీఎం జగన్ అండతో తాము సాధించిన విజయాన్ని వివరిస్తూ నియోజకవర్గంలో కలియతిరిగారు. జై జగన్ అంటూ వీరు చేసిన నినాదాలతో మచిలీపట్నం మారుమోగింది. స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో సాధికార యాత్ర ఘనంగా జరిగింది. అనంతరం జరిగిన సభలో ప్రజలు అశేష సంఖ్యలో పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల ఆశలు, ఆశయాలు నెరవేర్చిన సీఎం జగన్: మంత్రి ధర్మాన

సభలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని అట్టడుగు వర్గాలు ఆశలు, ఆశయాలను నెరవేర్చారని చెప్పారు. ఎలాంటి ఉద్యమాలు లేకుండానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు రాజకీయ అధికారం కట్టబెట్టారని, ఇలా చేయడానికి దమ్ము, ధైర్యం ఉండాలని అన్నారు. 32 లక్షల మందికి ఇళ్లస్థలాలు అందించటం ద్వారా ముఖ్యమంత్రి చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు విద్యను ప్రైవేటు పరం చేయటం వల్ల అట్టడుగు వర్గాలకు విద్య అందలేదన్నారు. వైఎస్ జగన్ కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దటంతో పాటు విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఇచ్చి పౌష్టికాహారాన్ని కూడా అందిస్తున్నారని, తల్లుల ఖాతాల్లో అమ్మఒడి ద్వారా నగదు జమ చేస్తున్నారని వివరించారు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. తలసరి ఆదాయం, వ్యవసాయం, జీవన ప్రమాణాలు, పరిశ్రమల కల్పనలో మన రాష్ట్రం దేశంలోనే 4, 5 స్థానాల్లో ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థలే చెబుతుండగా రాష్ట్రంలో అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు విమర్శించడం శోచనీయమన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను ఆదరించాలని కోరారు.

బడుగుల తలరాతలు మారుస్తున్న జగన్: ఎమ్మెల్యే అనిల్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కులవృత్తుల వారికి కత్తెరలు, ఇస్త్రీ పెట్టెలు, గొర్రెలు, వలలు ఇచ్చి వారు ఇలాగే బతకాలని చంద్రబాబు ప్రయత్నిస్తే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే బడుగులకు ప్రపంచస్థాయి విద్యనందిస్తూ వారి తలరాతలు మారుస్తున్నారని అన్నారు. మత్స్యకారుల వలసల నివారణకు, వారి ఉపాధికి సీఎం జగన్ తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారన్నారు. 2019లో గెలిపించినందుకు సీఎం జగన్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా పదడుగులు ముందుకు వేస్తే 2024లో గెలిపిస్తే 100 అడుగులు ముందుకు వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఒక ఇంట్లో ఒకరు చదువుకుంటే నెలకు రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.90 వేలు అని లోకేశ్ చెప్పారని, ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. ఇలా ఇస్తే ఏడాదికి లక్ష కోట్ల రూపాయలు దీనికే సరిపోతాయన్నారు.

జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం: ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

చంద్రబాబు ఒక్క ముస్లిం నాయకుడినీ మంత్రిగా చేయలేదని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు ఇవ్వలేదని, సీఎం జగన్ డిప్యూటీ సీఎం పదవితో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చి గౌరవించారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు సీఎం జగన్ కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా తలెత్తుకొనేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బందరు ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పలాసలో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభానికి 12న సీఎం జగన్

- మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసలో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభించేందుకు డిసెంబర్ 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలాస రానున్నారని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను బుధవారం ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి సందర్శించిన మంత్రి అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజాసంఘాలు, వామపక్షాలతో కలిసి కిడ్నీ బాధితుల పక్షాన గళం వినిపించామని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రాలు కార్యరూపం దాల్చాయని చెప్పారు. రూ.700 కోట్లతో మంచి నీటి పథకం సైతం నిర్మించినట్టు తెలిపారు. వీటిని ప్రారంభించేందుకు సీఎం జగన్ డిసెంబర్ 12న పలాస వస్తున్నారని చెప్పారు.

అన్నిరకాల వైద్యసేవలూ పొందేలా..

పలాసలో ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ ఆస్పత్రి కేవలం కిడ్నీ వ్యాధిగ్రస్తులకేననే అపోహ ఉందని మంత్రి అప్పలరాజు అన్నారు. కానీ.. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, న్యూరాలజీ, పల్మనాలజీ, ఆడియోగ్రాఫీ, ఐసీయూ వంటి అత్యవసర వైద్యసేవలు 24 గంటలూ అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి అత్యవసర వైద్యం అవసరమున్నా ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే సేవలు పొందవచ్చన్నారు. డయాలసిస్ యూనిట్‌లో 40 బెడ్‌లు అందుబాటులో ఉన్నాయని, మూడు నుంచి నాలుగు షిఫ్ట్‌లలో రోజుకు 120 నుంచి 200 మందికి రోజుకు డయాలసిస్ చేసుకునే వెసులుబాటు ఉందని వివరించారు. ఆయన వెంట మహేంద్ర రైతు కూలీ సంఘం, ఉద్దాన రైతు కూలీ సంఘం, జీడి రైతు సంఘం, యూటీఎఫ్, యూవీవీ సేవా సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, పలాస యూత్ అసోసియేషన్, శ్రీవివేకానంద సేవాసమితి, గ్రీన్ ఆర్మీ అసోసియేషన్, సీపీఐ ప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వం ఘనతలను చెప్పుకోవడంలో తప్పేముంది?

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలుగుదేశం పార్టీ మద్దతుతో పిల్

'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని అడ్డుకోవాలంటూ తెలుగుదేశం పార్టీ మద్దతుతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. జర్నలిస్ట్ కట్టిపోగు వెంకయ్య దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాదులు నర్రా శ్రీనివాసరావు, పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ, ఈ కార్యక్రమాన్ని మొదట అధికార పార్టీ కార్యక్రమంగా చేపట్టారన్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్‌మీట్‌లో కూడా చెప్పారన్నారు. ఆ తరువాత ప్రభుత్వ కార్యక్రమంగా మార్చారని, వాలంటీర్లను, అధికారులను భాగస్వాములను చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బుక్‌లెట్లు ముద్రించి వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయిస్తున్నారన్నారు. ఇందుకోసం రూ.20 కోట్లు విడుదల చేశారని చెప్పారు. వాలంటీర్లు అధికార పార్టీ జెండాలను ఎగురవేస్తున్నారని, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం ఇదంతా చేస్తోందన్నారు.

పత్రికా కథనాలను పరిగణనలోకి తీసుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పింది

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఇందులో తప్పేముందని ప్రశ్నించింది. వాలంటీర్లు జెండాలు ఎగురవేస్తున్నారనడానికి ఆధారాలు ఏమున్నాయని అడిగింది. పత్రికల్లో కథనాలు వచ్చాయని నర్రా శ్రీనివాసరావు చెప్పగా.. వాటిని పరిగణనలోకి తీసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉమేష్ చంద్ర స్పందిస్తూ.. పత్రికా కథనాలను హైకోర్టులు సుమోటో పిల్‌గా పరిగణిస్తూ విచారణ జరుపుతున్నాయన్నారు. విచారణ సందర్భంగా పత్రికా కథనాలను పరిగణనలోకి తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఇటీవల చాలా స్పష్టంగా చెప్పిందని సీజే స్పష్టం చేశారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి వంటి కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనడం కేంద్ర సివిల్ సర్వీసెస్ రూల్స్‌కు విరుద్ధమని శ్రీనివాసరావు అనగా.. ఆ రూల్స్ ఐఏఎస్‌లకే వర్తిస్తాయని, మిగిలిన వారికి కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. సంక్షేమ పథకాలను అధికారుల ద్వారా ప్రచారం చేయడంలో తప్పేముందని ప్రశ్నించింది. తన స్వరాష్ట్రం జమ్మూ కాశ్మీర్‌లో కూడా ఇలాగే చేశారని సీజే జస్టిస్ ఠాకూర్ వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) మహేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

రుషికొండపై నిర్మాణాల నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

- కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చాక ఏం చేయాలో చూస్తాం
- అనుమతులు, ఉల్లంఘనల గురించి కమిటీనే చూసుకుంటుంది
- పిటిషనర్లకు తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం
- గౌరప్పన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపిన కేంద్రం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం రుషికొండపై జరుగుతున్న పర్యాటక శాఖ రిసార్ట్ పునరుద్ధరణ పనులను, నిర్మాణాలను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. నిర్మాణాలకు సంబంధించి ఉల్లంఘనలను పరిశీలించేందుకు ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ కమిటీ నివేదిక ఇచ్చిన తరువాత ఏం చేయాలో చూస్తామంది. ఉల్లంఘనలు ఏం ఉన్నాయో తాము కమిటీకి చెబుతామన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. కమిటీకి మీరు చెప్పాల్సిన అవసరం లేదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం తేల్చిచెప్పింది.

రాజకీయ నేతల వ్యాజ్యాలు..

విశాఖ జిల్లా యండాడ గ్రామం సర్వే నంబర్ 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ (ఎంఓఈఎఫ్) నిబంధనలు, విశాఖపట్నం పట్టణ ప్రాంతాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ గతంలో వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఇదే వ్యవహారంలో ఎంపీ రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది యజ్ఞదత్ స్పందిస్తూ.. ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హెచ్‌టూవో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీస్ సలహాదారు గౌరప్పన్ నేతృత్వంలో ఎంఓఈఎఫ్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ డిసెంబర్ మొదటి వారంలో రుషికొండ నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇస్తుందని నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. మూర్తి యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. ఉల్లంఘనలను కమిటీకి వివరించేందుకు అనుమతివ్వాలని కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. ఏం ఉల్లంఘనలు ఉన్నాయో కమిటీనే చూసుకుంటుందని, మీరు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. కమిటీ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది. ఇచ్చిన అనుమతులు ఏమిటి? నిర్మాణాలు అందుకు అనుగుణంగా ఉన్నాయా? ఉల్లంఘనలు ఏం ఉన్నాయి? తదితర వివరాలను కమిటీ స్వయంగా చూసుకుంటుందని తెలిపింది. నిర్మాణాలను నిలువరించేందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరగా.. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం చెప్పింది. తదుపరి విచారణను డిసెంబర్ 27కి వాయిదా వేసింది.


గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ సీఎండీ కనుభాయ్ జే టక్కర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం జగన్


బ్లూఫిన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధితో..


శ్రీవేంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధితో..


కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ ప్రతినిధితో..


పత్తికొండ- టమాటో ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్


సెసామి ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్


సిఘాచి ఇండస్ట్రీస్ అండ్ ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్‌కు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్


ఏపీఐఐసీ ప్రాజెక్ట్‌లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్

100 మురుగు శుద్ధి వాహనాలను ప్రారంభించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: స్వచ్ఛ ఉద్యమి యోజన పథకం కింద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు 100 మురుగు శుద్ధి వాహనాలను అందజేసే కార్యక్రమాన్ని బుధవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జెండా ఊపి సీఎం జగన్ ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీలు విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మురుగు శుద్ధి వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

వారి సంకల్పం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి

ఉత్తరాఖండ్ రెస్క్యూ ఆపరేషన్‌పై సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడంపై సీఎం వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. ''టన్నెల్ ఆపరేషన్‌లో రెస్క్యూ టీం అవిశ్రాంతంగా పనిచేసింది. అలుపెరగని ప్రయత్నాలు చేసి కార్మికులను రక్షించిన రెస్క్యూ టీమ్‌కు నా అభినందనలు..వారి సంకల్పం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి. చిక్కుకున్న 41 మంది కార్మికులు సొరంగం నుండి సురక్షితంగా బయట పడటం సంతోషాన్ని ఇచ్చింది' అని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'కిట్టు'ని పరిచయం చేయడం ఆనందంగా ఉంది: సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఆడుదాం ఆంధ్రా అధికారిక చిహ్నం 'కిట్టు'ని పరిచయం చేస్తూ సీఎం వైఎస్ జగన్ ఆనందం వ్యక్తం చేశారు. ఆడుదాం ఆంధ్రా అధికారిక చిహ్నం 'కిట్టు'ని పరిచయం చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ రాష్ట్రవ్యాప్త క్రీడా టోర్నమెంట్ ద్వారా క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని నమ్ముతున్నాను. ప్రతి ఒక్కరు ఈ రోజే రిజిస్టర్ చేసుకోండి'' అని సీఎం జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సీఎం వైఎస్ జగన్ పారిశ్రామిక విధానాలు అభినందనీయం

ప్రపంచ ప్రఖ్యాత సంస్థ పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్ ప్రశంసలు

- పెప్పర్ మోషన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్సు, ట్రక్ క్లస్టర్
- చిత్తూరు జిల్లాలో అతి పెద్ద యూనిట్ ఏర్పాటు చేస్తున్న సంస్థ
- రూ.4,640 కోట్లతో 800 ఎకరాల్లో ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహాయ సహకారాలు, విధానాలు అంతర్జాతీయ సంస్థల అధిపతుల ప్రశంసలు అందుకుంటున్నాయి. పరిశ్రమ ఏర్పాటుకు దరఖాస్తు నుంచి పరిశ్రమ ప్రారంభోత్సవం వరకు పారిశ్రామికవేత్తలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండదండగా నిలుస్తోంది. వేగంగా అన్ని అనుమతులూ ఇస్తోంది. దీంతో రాష్ట్రంలో శరవేగంతో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. జర్మనీకి చెందిన ప్రపంచంలోనే అతి పెద్ద విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్ కూడా సీఎం వైఎస్ జగన్ విధానాలకు ప్రశంసలందించారు. ఈ సంస్థ విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీకి రాష్ట్రంలో ప్రపంచంలోనే అతిపెద్ద యూనిట్ ఏర్పాటు చేస్తోంది. రూ.4,640 కోట్లతో చిత్తూరు జిల్లా పుంగనూరు వద్ద 800 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఈ యూనిట్ నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించనుంది. ఈ యూనిట్ ద్వారా 8,100 మంది ఇంజినీర్లు, టెక్నీషియన్లకు ఉపాధి లభిస్తుంది. పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసింది. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే పెప్పర్ మోషన్ యూనిట్ వివరాలను వివరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్ట్రిక్ బస్సులు ట్రక్కుల క్లస్టర్ ఏర్పాటుకు వేగంగా అనుమతులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటులో సీఎం వైఎస్ జగన్ విధానాలను కొనియాడారు. ఏడాదికి 30,000 విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సామర్థ్యంతో ఇక్కడి యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు ఇంటిగ్రేటెడ్ వర్టికల్ ప్రొడక్షన్ ఫెసిలిటీ, 20 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీల తయారీ, అంతర్జాతీయ ప్రమాణాలతో యూనిట్ ఏర్పాటు, డీజిల్ బస్సులు, ట్రక్కులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రిట్రో ఫిట్టింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపీలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఏషియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా వంటి దేశాల్లోని పెప్పర్ భాగస్వాములకు కూడా ఇక్కడి నుంచే సేవలు అందిస్తామని చెప్పారు. మూడు దశల్లో ఏర్పాటు చేసే ఈ యూనిట్ తొలి దశ 2025 మూడో త్రైమాసికానికి అందుబాటులోకి వస్తుందన్నారు. 2027 మూడో త్రైమాసికానికి మూడో దశలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పారిశ్రామిక విధానాలు, సింగిల్ విండో అనుమతులు, అమలు చేస్తున్న పారదర్శక విధానాలను సీఎం జగన్ పెప్పర్ మోషన్ ప్రతినిధులకు వివరించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పెప్పర్ మోషన్ సీటీవో డాక్టర్ మథియాస్ కెర్లర్, ఫైనాన్స్ డైరెక్టర్ ఉవే స్టెల్లర్, సీఐవో రాజశేఖర్‌రెడ్డి నల్లపరెడ్డి, సీఎస్‌వో సత్య బులుసు, సీసీవో రవిశంకర్, అసోసియేట్ శ్రీధర్ కిలారు, ఉర్త్ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీ హర్ష ఆద్య పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌తో జర్మనీకి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్, ప్రతినిధి బృందం

సీఎం విజనరీ థింకింగ్ మమ్మల్ని ఆకట్టుకుంది: ఆండ్రియాస్ హేగర్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజనరీ థింకింగ్, అమలు చేస్తున్న పాలసీలు తమను ఆకట్టుకున్నాయని, ఈ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలు మరువలేమంటూ పెప్పర్ మోషన్ సీఈవో ఆండ్రియాస్ హేగర్ కొనియాడారు. సీఎంను కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఏపీలో వరల్డ్ క్లాస్ యూనిట్ ఏర్పాటు చేయడంపై చాలా సంతోషంగా ఉన్నాం. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మా యూనిట్ ఏర్పాటుచేస్తున్నాం. ప్రజా రవాణాకు అవసరమైన విధంగా డీకార్బొనైజ్డ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ తీసుకువచ్చేలా మా యూనిట్ నుంచి వాహనాల ఉత్పత్తి జరుగుతుంది. ఏపీలో యూనిట్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయంగా భావిస్తున్నాం. బెంగళూరు, చెన్నై నగరాలకు దగ్గరగా మా యూనిట్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తున్నాం. మాకు సహాయ సహకారాలు అందించిన సీఎం గారికి ప్రత్యేక కృతజ్ఞతలు' అని చెప్పారు.

ఒక్క ఫోన్ చాలు.. సమస్యలన్నీ పరిష్కారం

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వచ్చే ఫిబ్రవరిలో ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలను విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,100 కోట్ల విలువైన 9 ప్రాజెక్టులకు బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన నిర్వహించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

విశాఖ ఒప్పందాలు వేగంగా సాకారం..

పారిశ్రామిక రంగంపై ముఖ్యంగా ఎంఎస్ఎంఈ,ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. కలెక్టర్లు కూడా దీనిపై దృష్టి సారించి పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలను అందించాలి. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఎంవోయూలు చేసుకున్నాం. వీటి ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాం. ఇవన్నీ సాకారమయ్యేలా సమీక్షిస్తూ పురోగతి కోసం చర్యలు తీసుకున్నాం. ఇందులో 33 యూనిట్లు ఇప్పటికే ఏర్పాటై ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి. మరో 94 ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మిగిలిన వాటి పనులు పలు దశల్లో ఉన్నాయి. వీటిలో మరింత పురోగతి సాధించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలకు చేయూతనిస్తున్నాం. నెలకు కనీసం 2 సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా వీటన్నింటినీ వేగంగా కార్యరూపంలోకి తెస్తున్నాం. కలెక్టర్లు కూడా ప్రతి అడుగులోనూ చేయి పట్టుకుని నడిపిస్తూ దీన్ని వేగవంతం చేయాలి.



12.62 లక్షల మందికి ఉపాధి

ఈ నాలుగున్నరేళ్లలో 130 భారీ, అతిభారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయగలిగాం. వీటి ద్వారా రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 86 వేల మందికి ఉద్యోగాలు కూడా ఇవ్వగలిగాం. ఎంఎస్ఎంఈ రంగంలో ఎప్పుడూ చూడని విధంగా అడుగులు వేశాం. కోవిడ్ సమయంలో ఎక్కడా, ఎవరూ కుప్పకూలిపోకుండా వారికి చేయూతనిచ్చాం. గత నాలుగున్నరేళ్లలో 1.88 లక్షల ఎంఎస్ఎంఈలు కొత్తగా వచ్చాయి. వీటి ద్వారా 12.62 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అందరం కలసికట్టుగా బాధ్యత తీసుకున్నాం కాబట్టే ఇది సాకారమైంది. పారిశ్రామికవేత్తలకు ఇబ్బంది ఎదురైనా మనం కేవలం ఒక ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నామనే మెస్సేజ్‌ను ఎంత సానుకూలంగా తీసుకెళ్లగలిగితే అంత ఉత్సాహంగా ముందుకొస్తారు. ఇది నా దగ్గర నుంచి మొదలుకుని మీ వరకు ఇదే తత్వాన్ని అలవరచుకోవాలి.

రూ.1,100 కోట్ల పెట్టుబడులకు శ్రీకారం

పరిశ్రమలు–వాణిజ్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ఇవాళ తొమ్మిది ప్రాజెక్టులు చేపడుతున్నాం. దాదాపు రూ.1,100 కోట్ల పెట్టుబడితో 21,744 మందికి ఉద్యోగాలు లభించేలా మంచి అడుగు పడుతోంది. మూడు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, మిగిలిన ఆరు ప్రాజెక్టులకు శంకుస్థాపన నిర్వహిస్తున్నాం. కొద్ది రోజుల క్రితం నేను పత్తికొండ వెళ్లినప్పుడు టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు దిశగా అడుగులు వేయమని చెప్పా. కొద్ది కాలంలోనే అది అధికారుల కృషితో కార్యరూపం దాల్చి శంకుస్థాపన దశకు వచ్చింది. రూ.12 కోట్ల పెట్టుబడితో టమోటా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు పత్తికొండలో శంకుస్థాపన నిర్వహిస్తున్నాం. ఇదే మాదిరిగా ప్రతి ఒక్కరూ అంతే వేగంగా అడుగులు ముందుకేయాలి. ఇవాళ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను జరుపుకొంటున్న తొమ్మిది యూనిట్లకు శుభాభినందనలు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు. మీ అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నా.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు, కంపెనీల ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్నాథ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్‌కుమార్, హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ కమిషనర్ ఎంఎం నాయక్, పరిశ్రమలశాఖ కమిషనర్ సీహెచ్ రాజేశ్వరరెడ్డి, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో శంకుస్థాపనలు, ప్రారంభించిన యూనిట్లు

- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు ముత్తుకూరు మండలం దొరువులపాలెంలో రూ.250 కోట్లతో గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్ ప్రారంభం. దీని ద్వారా 1,150 మందికి ఉద్యోగాలు. ఏటా 4.2 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి దీని సామర్థ్యం.
- రూ.144 కోట్లతో శ్రీవేంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పనులకు శంకుస్థాపన. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం కొమ్మూరు గ్రామం వద్ద ఏర్పాటయ్యే ఈ మొక్కజొన్న ఆధారిత పరిశ్రమ ద్వారా 310 మందికి ఉద్యోగావకాశాలు. ఏడాదికి 90 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి. దీని ద్వారా వేలమంది రైతులకు ప్రయోజనం.
- విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడ వద్ద రూ.13 కోట్లతో బ్లూఫిన్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీకి శంకుస్థాపన. దీని ద్వారా 45 మందికి ఉద్యోగావకాశాలు. 3,600 మెట్రిక్ టన్నుల గోధుమలు, 480 టన్నుల మిల్లెట్స్, 720 మెట్రిక్ టన్నుల పొటాటో ఉత్పత్తులు తయారు చేసే ఈ కంపెనీ ఏర్పాటుతో స్థానిక రైతులకు లబ్ధి.
- కర్నూలు జిల్లా పత్తికొండ వద్ద టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ పనులకు శంకుస్థాపన. రూ.12 కోట్ల పెట్టుబడితో ఏటా 3,600 మెట్రిక్ టన్నుల టమాటా ఉత్పత్తుల తయారీ. ఈ ప్రాజెక్టును పత్తికొండ వెజిటబుల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్‌కు అప్పగించనున్న ప్రభుత్వం. వారి ద్వారా లీజు ప్రాతిపదికన మంచి సమర్థత కలిగిన కంపెనీకి అప్పగించేలా సహకారం. పత్తికొండలో రైతులకు భారీ ప్రయోజనం. టమాటా ధరల స్థిరీకరణకు దోహదం చేయనున్న పరిశ్రమ.
- విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం రేగ పంచాయతీ పెద్దిరెడ్లపాలెం వద్ద నువ్వుల ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రారంభోత్సవం. ప్లాంట్‌ను నెలకొల్పిన ఏపీఎఫ్‌పీఎస్. ఎల్.కోట జైకిసాన్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌కు ప్లాంట్‌ను అప్పగించిన ప్రభుత్వం. నువ్వుల నూనె, చిక్కీ ఉత్పత్తుల తయారీ. రూ.2.5 కోట్ల పెట్టుబడితో 20 మందికి ఉద్యోగాలు. ఏడాదికి 600 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి కలిగిన ఈ యూనిట్‌తో స్థానిక రైతులకు ప్రయోజనం.

పరిశ్రమల శాఖలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా..

- కర్నూలు జిల్లా ఓర్వకల్లు నోడ్ గొట్టిపాడు వద్ద సిగాచి ఇండస్ట్రీస్ ఫార్మా (ఏపీఐ) యూనిట్‌కు శంకుస్థాపన. రూ.280 కోట్ల పెట్టుబడితో 850 మందికి ఉద్యోగాలు. ఏడాదికి 72 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి.
- కర్నూలు జిల్లా ఓర్వకల్ నోడ్ గొట్టిపాడు వద్ద న్యూట్రాస్యూటికల్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్. పనులకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన. రూ.90 కోట్ల పెట్టుబడితో 285 మందికి ఉద్యోగాలు. ఏడాదికి 4,170 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి.
- పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 18 జిల్లాల్లో 21 ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లకు సీఎం ప్రారంభోత్సవాలు, మరికొన్ని చోట్ల పనులకు శంకుస్థాపనలు. కాంప్లెక్స్ ద్వారా రూ.1,785 కోట్ల పెట్టుబడులకు అవకాశం. తద్వారా 18,034 మందికి ఉద్యోగాలు.
- కాకినాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రింటింగ్ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్లను ప్రారంభించిన సీఎం జగన్. ఈ సెంటర్లలో 1,000 మందికి ఉద్యోగాలు.

పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం

సీఐఐ సదస్సులో నెడ్‌క్యాప్ వీసీ అండ్ ఎండీ రమణారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: పీక్ పవర్ డిమాండ్‌ను తీర్చడానికి పంప్డ్, హైడ్రో పవర్ స్టోరేజీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందని నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రమణారెడ్డి తెలిపారు. రెన్యూవబుల్ ఎనర్జీలో కర్ణాటక మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని చెప్పారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందన్నారు. బుధవారం విశాఖలో సీఐఐ నిర్వహించిన 'మేకింగ్ ఇండియన్ ఇండస్ట్రీ ఎనర్జీ ఎఫిషియెంట్ వరల్డ్ క్లాస్' అనే అంశంపై సదస్సులో ఆయన ప్రసంగించారు. పంప్డ్ స్టోరేజీ, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందని, 33,240 మెగావాట్ల సామర్థ్యాన్ని అంచనా వేస్తూ 20,900 మెగావాట్లకు డీపీఆర్‌లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అప్పర్ సీలేరులో 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన శక్తి పెరుగుదలతో స్టోరేజీ గ్రిడ్‌లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సన్‌రైజ్ సీఎస్‌పీ ఇండియా చైర్మన్ దీపక్ గాధియా మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద, సమర్థవంతమైన సోలార్ కాన్సంట్రేటర్ అయిన బిగ్ డిష్‌ను భారతదేశానికి పరిచయం చేస్తున్నట్లు తెలిపారు.



“ కాలం అన్నింటినీ వక్యానికి తెస్తుంది:
ఏ మనిషీ పుట్టుకతో వివేకి కాదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 30 నవంబర్ 2023

సిల్‌క్యారా చేస్తున్న హెచ్చరిక

మానవ సంకల్పం ముందు శిఖరం తలొంచింది. పదిహేడు రోజులుగా కోట్లాదిమంది దేశ ప్రజానీకం మాత్రమే కాదు... దేశదేశాల పౌరులూ పడిన ఆరాటం, ఆత్రుత ఫలించాయి. ఉత్తరకాశీలోని సిల్‌క్యారా సొరంగం కుప్పకూలటంతో 422 గంటలపాటు బందీలైన 41 మంది కార్మికులు మంగళవారం సాయంత్రం సురక్షితంగా బయటపడ్డారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల నిపుణులు మొదలుకొని వైద్య నిపుణుల వరకూ అందరికందరూ రాత్రింబగళ్లు సమన్వయంతో సాగించిన కృషి ఒక ఎత్తయితే...అత్యంత కష్టసాధ్యమైన ర్యాట్ హోల్ మైనింగ్‌లో నిపుణులైన కార్మికులు చివరి 12 మీటర్ల పొడవునా వున్న శిథిలాలను ఎంతో ఓపిగ్గా, జాగ్రత్తగా తొలగించటం మరో ఎత్తు. వెరసి బందీలైనవారంతా క్షేమంగా బాహ్యప్రపంచాన్ని చూడగలిగారు. ఇలాంటి సంక్లిష్ట సందర్భాల్లో చిక్కుకున్నవారిలో సమూహ చేతన ఎంతమాత్రమూ సడలరాదన్నది మనస్తత్వ నిపుణుల మాట. బందీల్లో కనీసం ఒక్కరికైనా సద్యోజనిత నాయకత్వ లక్షణం వుంటే తప్ప ఇలాంటి సామూహిక చేతనకు అవకాశం వుండదు. 2010లో చిలీ రాగి గనుల్లో పదివారాలు చిక్కుకున్న కార్మికులైనా... మరో ఏడెనిమిదేళ్లకు ఉత్తర థాయ్‌లాండ్‌లోని కొండ గుహల్లోకి వరద నీరు ప్రవేశించటంతో పదకొండు రోజులపాటు చిక్కుకున్న ఫుట్‌బాల్ టీమ్ పిల్లలైనా క్షేమంగా బయటపడటానికి కారణం ఇదే అంటారు. భయానక పరిస్థితులు ఎదురైనప్పుడు ఎవరైనా నాలుగో రోజు వరకూ ప్రాణాలు నిలుపుకోగలిగితే మానసికంగా వారు దృఢంగా వున్నట్టేనని, ఆ తర్వాత వారు దేన్నయినా సునాయాసంగా అధిగమిస్తారని మనస్తత్వ నిపుణులు చెబుతారు. వెలుపలి ప్రపంచంలో కోట్లాదిమంది పడుతున్న తపనకు బందీలైన ఆ 41 మంది కార్మికుల దృఢచిత్తం తోడవటం వల్లనే ఇదంతా సవ్యంగా పూర్తయింది. ఆ కార్మిక కుటుంబాల మాటేమోగానీ... అశేష ప్రజానీకం ఆశానిరాశాల్లో ఊగిసలాడిన తీరు మాత్రం మరిచిపోలేనిది. మినుకు మినుకుమంటున్న ఆశలు, అంతలోనే గంపెడు నిరాశలో ముంచే పరిణామాలూ ఈ పదిహేడురోజులూ ఎవరికీ కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఆ కార్మికులు బయటికిరావటం నూటికి నూరుపాళ్లూ సాధ్యమేనని మంగళవారం సాయంత్రానికిగానీ ధ్రువపడలేదు. బందీలను విడిపించటానికి భారీ యంత్రాలను వినియోగించి కొండను తొలుస్తున్న క్రమంలో ఈనెల 16న సంభవించిన భూకంపం అన్ని రకాల ప్రయత్నాలపైనా నీళ్లుజల్లింది. ఒక దశలో పైపును అమరుస్తుండగా భారీ పగుళ్ల శబ్దాలు విన బడ్డాయి. ఈలోగా 25 టన్నుల భారీయంత్రమైన అగర్ మెషీన్‌తో తవ్వుతుండగా శిథిలాల్లో ఇరుక్కున్న ఇనుప రాడ్లు తగిలి దాని బ్లేడ్లు తెగిపడ్డాయి. ఇక ర్యాట్‌హోల్ మైనింగ్ నిపుణులు రంగంలో దిగితే తప్ప ఇది పూర్తికాదని నిర్ధారించుకుని మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి వారిని రప్పించారు.

అయితే ఈ ఆనందోత్సాహాల సందడిలో అసలు విషయం మరుగున పడకూడదు. అపార ఖనిజ సంపద వున్న దేశాలన్నిటా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చటానికీ, ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేందుకూ ప్రభుత్వాలు తపిస్తున్నాయి. ఈ క్రమంలో పర్యావరణానికి కలుగుతున్న చేటు సరే, మనుగడ కోసం మరేదీ చేయలేక ప్రాణాలకు తెగించి గనుల్లో పనిచేస్తున్న బడుగు జీవులు సమిధలవుతున్నారు. చాన్నాళ్ల క్రితమే ఎన్‌జీటీ నిషేధించిన ర్యాట్ హోల్ మైనింగ్ సిల్‌క్యారాలో కార్మికుల ప్రాణాలు కాపాడటానికి దోహదపడిన మాట నిజమే అయినా...ఇప్పటికీ చట్టవిరుద్ధంగా అలాంటి మైనింగ్ సాగుతున్నదని ఈ ఎపిసోడ్ నిరూపించింది. కేవలం ఒక మనిషి పాకుకుంటూ వెళ్లగలిగేంత కంత తవ్వుకుంటూ భూగర్భం మూలల్లో వున్న బొగ్గు లేదా ఇతర ఖనిజాలనూ సేకరించటం ఈ కార్మికుల పని. ఈ క్రమంలో ఎక్కడైనా పైకప్పు కూలిందంటే వాళ్ల బతుకులు ముగిసినట్టే. గనుల పరిసర ప్రాంతాల్లో వుంటున్నవారికే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నప్పుడు నేరుగా అందులోకి ప్రవేశించి నిత్యం ఆ దుమ్మూ ధూళితో సావాసం చేసేవారికి ఎంత ముప్పు కలుగుతుందో వేరే చెప్పనవసరం లేదు. ఇక భూమి కుంగిపోవటం, భూగర్భ జలాలు కలుషితం కావటం వంటి పర్యావరణ సమస్యలకు అంతే లేదు. ఇంతా చేసి ఇలాంటి కార్మికుల శ్రమంతా భారీ యంత్రపరికరాలపై పెట్టుబడులూ, అనుమతులు, రాయల్టీ చెల్లింపులూ లేకుండా చట్టవిరుద్ధంగా దోపిడీచేసే మైనింగ్ మాఫియాల పాలవుతోంది. కార్పొరేట్ల లాభార్జనకు దోహదపడుతోంది.

హిమశిఖరాలు ఆల్ప్స్ పర్వతశ్రేణిలా పురాతనమైనవి కాదు. అవి ఆరున్నరకోట్ల సంవత్సరాలనాటివైతే, హిమశిఖరాల వయసు నాలుగుకోట్ల సంవత్సరాలు మించదు. అందువల్లే వాటి భూగర్భంలో నిరంతర చలనం, ఒత్తిడి, అధిక ఉష్ణోగ్రత కొనసాగుతున్నాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీతో సహా 51 శాతం నేల కుంగుబాటు ప్రాంతంలో వున్నదని జర్నల్ ఆఫ్ ఎర్త్ సిస్టమ్స్ పత్రిక చాన్నాళ్ల క్రితం తెలిపింది. ఇక్కడి కొండల్లో మట్టి, రాళ్లు కలిసి వుండటం వల్ల ఈ కుంగుబాటు ప్రమాదం ఎక్కువ. గత కొన్నేళ్లుగా జోషీమఠ్ కుంగుబాటు, ఇతర ప్రాంతాల్లో సైతం భూమి నెర్రెలుబారటం ప్రమాదకర సంకేతాలందిస్తోంది. చార్‌ధామ్ యాత్రికులకూ, పర్యాటకులకూ అనుకూలంగా వుంటుందని 900 కిలోమీటర్ల మేర చార్‌ధామ్ హైవే నిర్మాణం చేపట్టారు. సిల్‌క్యారా సొరంగ నిర్మాణం దానిలో భాగమే. ఇవిగాక ఎన్నో జల విద్యుత్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టులను సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సిల్‌క్యారా ఉదంతం మనల్ని హెచ్చరిస్తోంది. అప్రమత్తం కావటం మనకే మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.తదియ ప.2.06 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆరుద్ర ప.3.31 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** తె.4.19 నుండి 5.59 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.07 వరకు, **అమృత ఘడియలు:** లేవు, సంకటహర చతుర్థి.

సూర్యోదయం: 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

ఉజ్వల భవిత వైపు దిశానిర్దేశం

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

భారత్ జీ20 నాయకత్వ బాధ్యతలు స్వీకరించే నాటికి ప్రపంచం అనేక సమస్యలనెదుర్కొంటోంది. ఈ పరిస్థితి నుంచి ప్రపంచాన్ని గట్టెక్కించి, ప్రత్యామ్నాయం చూపాలని భారత్ నేతృత్వంలోని జీ20 నిశ్చయించుకుంది. ఇందులో భాగంగా జీడీపీ కేంద్రక ప్రగతి నుంచి మానవ-కేంద్రక పురోగమనం వైపు మళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. మన మధ్య విభజన తెస్తున్న కారణాన్ని కాకుండా మనల్ని ఏది ఏకం చేయగలదో దాని గురించి గుర్తుచేయడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో అంతిమంగా అంతర్జాతీయ చర్చలు పరిణామశీలమై– కొందరి స్వార్థానికి కాకుండా అందరి ఆకాంక్షలు, ప్రయోజనాలకు పెద్దపీట వేయక తప్పలేదు.

భారతదేశం జీ20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టి నేటితో 365 రోజులు పూర్తయ్యాయి. 'వసుధైవ కుటుంబకం'... అంటే– 'ఒకే భూమి–ఒకే కుటుంబం–ఒకే భవిష్యత్తు' స్ఫూర్తిని చాటేలా పునరంకితమవుతూ... పునరుజ్జీవనానికి బీజం వేసిన క్షణమది.

మనం నిరుడు ఈ బాధ్యత స్వీకరించే నాటికి యావత్ ప్రపంచం బహుముఖ సవాళ్లతో సతమతం అవుతోంది. బహుళ దేశాలు పాల్గొనే విధానం (మల్టీ లేటరలిజం) క్షీణించే తరుణంలో కోవిడ్–19 మహమ్మారి దుష్ప్రభావం నుంచి కోలుకోవడం, నానాటికీ పెరుగుతున్న వాతావరణ మార్పు సమస్యలూ, ఆర్థిక అస్థిరత, వర్ధమాన దేశాల్లో రుణభారం తదితరాలన్నీ చోటు చేసుకున్నాయి. అలాగే ఘర్షణలూ, వివాదాలూ, స్పర్థాత్మకతల మధ్య ప్రగతి సంబంధిత సహకార భావన దెబ్బతిని, పురోగమనం కుంటుపడింది.

ఈ నేపథ్యంలో జీ20 నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన భారతదేశం ఆనాటి దుస్థితి నుంచి ప్రపంచాన్ని గట్టెక్కించి, ప్రత్యామ్నాయం చూపాలని నిశ్చయించుకుంది. ఇందులో భాగంగా జీడీపీ కేంద్రక ప్రగతి నుంచి మానవ-కేంద్రక పురోగమనం వైపు మళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. మన మధ్య విభజన తెస్తున్న కారణాన్ని కాకుండా మనల్ని ఏది ఏకం చేయగలదో దాని గురించి గుర్తుచేయడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో అంతిమంగా అంతర్జాతీయ చర్చలు పరిణామశీలమై– కొందరి స్వార్థానికి కాకుండా అందరి ఆకాంక్షలు, ప్రయోజనాలకు పెద్దపీట వేయక తప్పలేదు. అయితే, ఇందుకోసం ముఖ్యంగా చేయాల్సిందల్లా బహుళ దేశాలు పాల్గొనే విధాన మూలాల నుంచి సంస్కరణలు తేవడం.

'సార్వజనీనత, ఆకాంక్షాత్మకత, కార్యాచరణాత్మకత, నిర్ణయాత్మకత' అనే నాలుగు పదాలు జీ20 అధ్యక్ష బాధ్యతల నిర్వహణలో మన విధానమేమిటో సుస్పష్టంగా నిర్వచించాయి. అటుపైన జీ20 సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించిన 'న్యూఢిల్లీ దేశాధినేతల తీర్మానం' (ఎన్డీఎల్డీ) ఈ సూత్రాల అమలులో మన నిబద్ధతను ప్రస్ఫుటం చేసింది. సార్వజనీనత అన్నది మన అధ్యక్ష పదవికి ఆత్మ వంటిది. దీనికి అనుగుణంగా ఆఫ్రికా సమాఖ్య (ఏయూ)కు జీ20లో శాశ్వత సభ్యత్వం కల్పించడం ద్వారా 55 ఆఫ్రికా దేశాలను ఈ వేదిక మీదకు చేర్చాం. దీంతో ప్రపంచ జనాభాలో 80 శాతానికి ప్రాతినిధ్యం వహించే విధంగా జీ20 విస్తరించింది. తద్వారా అంతర్జాతీయ సవాళ్లు–అవకాశాలపై మరింత సమగ్ర చర్చలను ఈ క్రియాశీల వైఖరి ప్రోత్సహించింది.

ఇక 'దక్షిణార్ధ గోళ దేశాల గళం' పేరిట భారతదేశం తొలిసారి



రెండు దఫాలుగా నిర్వహించిన శిఖరాగ్ర సదస్సు మల్టీలేటరలిజం నవోదయానికి శుభారంభం పలికింది. ఆ విధంగా దక్షిణార్ధ గోళ దేశాల సమస్యలను భారతదేశం అంతర్జాతీయ చర్చల ప్రధాన స్రవంతిలోకి తెచ్చింది. సార్వజనీనత అన్నది భారత దేశీయ విధాన ఉత్తేజాన్ని జీ20కి వ్యాపింపజేసింది. ఆ మేరకు ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి తగినట్లుగా జీ20కి భారత నాయకత్వం ప్రజా ధ్యక్షతగా రూపొందింది.

కీలకమైన 2030 ఎజెండా మధ్యలో జీ20 కార్యాచరణ ప్రణాళికను సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ)ను వేగవంతం చేయడంతోపాటు ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వం, పర్యావరణ సమతౌల్యం, పరస్పర అనుసంధానిత సమస్యల పరిష్కారం కోసం విస్తృత కార్యాచరణ–ఆధారిత విధానాన్ని భారత్ రూపొందించింది. ఈ ప్రగతి ప్రణాళిక పురోగమనానికి జనహిత మౌలిక సదుపాయాలు (డీపీఐ) అత్యంత కీలకం. ఆ మేరకు 'ఆధార్, యూపీఐ, డిజీలాకర్' వంటి డిజిటల్ ఆవిష్కరణల విప్లవాత్మక ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూసిన భారత్ తనవంతుగా నిర్ణయాత్మక సిఫారసులు చేసింది. జీ20 ద్వారా మనం జనహిత మౌలిక సదుపాయాల భాండాగారం ఏర్పాటును విజయవంతంగా పూర్తి చేశాం. దీన్ని ప్రపంచ సాంకేతిక సహకారంలో గణనీయ పురోగమనంగా పేర్కొనవచ్చు. ఈ భాండాగారంలో 16 దేశాల నుంచి 50కి పైగా దేశాల 'డీపీఐ'లున్నాయి.

మన భూగోళం కోసం తక్షణ, శాశ్వత, సమాన మార్పు సృష్టి లక్ష్యంగా ప్రతిష్ఠాత్మక, సమగ్రమైన లక్ష్యాలను అనుసరిస్తున్నాం. భూగోళ పరిరక్షణ, పేదరిక నిర్మూలన నడుమ మన ఎంపిక కకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడం ఎలాగో 'ఎన్డీఎల్డీ' నిర్దేశిత 'హరిత ప్రగతి ఒప్పందం' వివరిస్తుంది. ఇక 2030 నాటికి ప్రపంచ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రతిష్ఠాత్మక రీతిలో మూడు రెట్లు పెంచాలని కూడా జీ20 తీర్మానం పిలుపునిచ్చింది. మరోవైపు ప్రపంచ జీవ ఇంధన కూటమి ఏర్పాటూ, హరిత ఉదజని కోసం సమష్టి కృషీ... పరిశుభ్ర, హరిత ప్రపంచ నిర్మాణంపై జీ20 ఆదర్శాలు కాదనలేని నిజాలు. భారత్ అనాదిగా అనుసరిస్తున్న విలువలు ఇవే.

ఉత్తరార్ధ గోళ దేశాల నుంచి గణనీయ ఆర్థిక సహాయంతోపాటు సాంకేతిక చేయూతను కోరడం ద్వారా వాతావరణ న్యాయం–సమానత్వం విషయంలో మన నిబద్ధతను కూడా 'ఎన్డీఎల్డీ' నొక్కి చెప్పింది. కాగా, అభివృద్ధికి ఆర్థిక చేయూత పరిమాణంలో తొలిసారిగా ఆశించిన మేర రెట్టింపు పెరుగుదల నమోదైంది. ఆ మేరకు ఈ సాయం బిలియన్ల డాలర్ల స్థాయి నుంచి ట్రిలియన్ల డాలర్ల స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో వర్ధమాన దేశాలు 2030 నాటికి తమ దేశీయ ప్రగతి లక్ష్యాల (ఎన్డీసీ)ను సాధించడానికి 5.9 ట్రిలియన్ డాలర్లు అవసరమని జీ20 అంగీకరించింది.

న్యూఢిల్లీ దేశాధినేతల తీర్మానం లింగ సమానత్వానికీ పెద్దపీట వేసింది. ఆ మేరకు ఇది వచ్చే ఏడాదికల్లా మహిళా సాధికారతపై ప్రత్యేక కార్యాచరణ బృందం ఏర్పాటు అవసరాన్ని నొక్కిచెప్పింది. 'భారత మహిళా రిజర్వేషన్ బిల్లు–2023' ద్వారా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయించడం ద్వారా మహిళా చోదక ప్రగతిపై భారత్ నిబద్ధతను జీ20 ప్రతిబింబించింది. విధానపరమైన సమన్వయం, విశ్వసనీయ వాణిజ్యం, ప్రతిష్ఠాత్మక వాతావరణ కార్యాచరణపై దృష్టి సారిస్తూ ఈ కీలక ప్రాధాన్యాలన్నిటా పరస్పర సహకార స్ఫూర్తిని 'ఎన్డీఎల్డీ' చాటిచెప్పింది. మన అధ్యక్షత సమయంలో జీ20 ద్వారా 87 నిర్ణయాలు తీసుకోవడంతోపాటు 118 పత్రాలకు ఆమోదం సాధించడం గర్వించదగిన అంశం.

మన జీ20 అధ్యక్షత సమయంలో భౌగోళిక–రాజకీయాంశాలు, ఆర్థికవృద్ధి–ప్రగతిపై వాటి ప్రభావం వగైరాల పైనా చర్చలకు భారత్ నాయకత్వం వహించింది. ఉగ్రవాదం, విచక్షణ రహితంగా పౌరుల ప్రాణాలు తీయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఉగ్రవాదాన్ని తుదముట్టించడమనే విధానంతోనే ఈ బెడదను నిర్మూలించడం సాధ్యమని స్పష్టం చేసింది. మనం శత్రుత్వం స్థానంలో మానవత్వాన్ని స్వీకరించాలి. ఆ మేరకు ఇది యుద్ధ యుగం కాదనే వాస్తవాన్ని పునరుద్ఘాటించాలి.

జీ20 అధ్యక్ష బాధ్యతల సమయంలో భారత్ అసాధారణ విజయాలు సాధించడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది: ఇది మల్టీలేటరిజాన్ని పునరుజ్జీవింపజేసింది. దక్షిణార్ధ గోళ దేశాల గళాన్ని మరింతగా వినిపించింది. ప్రగతి సాధనకు ప్రాముఖ్యమిచ్చింది. అన్ని రంగాల్లోనూ మహిళా సాధికారత కోసం పోరాడింది.

ఈ నేపథ్యంలో భూగోళం పచ్చగా పరిఢవిల్లడంతోపాటు ప్రపంచ ప్రజానీకానికి శాంతి–శ్రేయస్సు దిశగా ఇప్పటివరకూ మనం సమష్టిగా చేసిన కృషి భవిష్యత్తులోనూ కొనసాగుతుందని విశ్వసిస్తూ జీ20 అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ దేశానికి అప్పగిస్తున్నాం. ✧

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్ని వంటలో!



కూరగాయలకు ఇంత అద్భుతమైన, ఇంత విస్తారమైన రుచులు, పరిమళాలను ప్రపంచంలో భారత్ తప్ప ఏదీ తేలేదు. భూమ్మీద ఉన్న ప్రతి శాకాహారీ తెలుసుకోవాల్సిన విషయం ఇది.
– కబీర్ బేడీ, నటుడు

నగరం మనిషైతే...



రాత్రి దాకా ఢిల్లీ రోజుకు 20 గట్టి సిగరెట్లు కాల్చింది. ఇవ్వాళ మోతాదు తగ్గి పదిహేనింటికి వచ్చింది. త్వరలో మరింత మోతాదు తగ్గించుకుంటుందని ఆశ. అటుపై పూర్తిగా పొగ మానేస్తే మంచిది.
– మునీశ్ భరద్వాజ్, ఫిలింమేకర్

వాళ్లకూ విస్తరిస్తే సరి!



చాలామంది వేతనదారులు పన్నులను ద్వేషించడానికి కారణం, బదులుగా వారికి ఏమీ దక్కకపోవడం. 2022-23లో కేవలం 2.24 కోట్ల మంది పన్ను చెల్లించారు. దేశ జనాభాలో ఇది 1.6 శాతం. వీళ్లను కూడా ప్రభుత్వ పథకాలకు అర్హులను చేస్తే సరి. 5 లక్షల ఆరోగ్య బీమా, 5 కిలోల ఉచిత బియ్యం, పింఛన్ల వంటివి. చాలామంది తీసుకోరు. పైగా ప్రభుత్వం తమకోసం ఏదో చేస్తోందని సంతోషపడతారు. వీళ్ల వల్ల ఆ సేవల నాణ్యత కూడా పెరుగుతుంది.
– శివమ్ శంకర్ సింగ్, రచయిత

బాగాలేదా?



నాకు ఇవ్వాళ బాగాలేదు. బాగాలేకపోవడం అనేది అంత బాగాలేని విషయం కాదు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ బాగుండరు. మీకు ఇవ్వాళ బాగాలేకపోతే మీ బాధను నేను పంచుకోగలను.
– సెరెనా విలియమ్స్, టెన్నిస్ క్రీడాకారిణి

అందరికీ వందనం



ఎవరో గుర్తుచేసేదాకా, సొరంగంలో చిక్కుకున్న వాళ్లని కాపాడినవారి మతమేంటో గమనించలేదు. ఆపత్కాలంలో ఆదుకున్నవాళ్లంతా మనకు దేవతలే. మీరు వీటిని ఎత్తిచూపడం మొదలుపెడితే– మతాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని నువ్వు ఎవరిని నిందిస్తావో వాళ్లలాంటి దోషివే అవుతావు.
– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

అదో లోకం!



సాధువులు, సన్యాసుల నేల ఇది. ఒక జత బట్టలతో మనుషులు జీవితాలు వెళ్లబుచ్చే దేశం ఇది. అలాంటిది ఒక బాలీవుడ్ కిడ్, ఇంకో బాలీవుడ్ కిడ్‌ను మెచ్చుకుంటోంది... ఎందుకు? ఒకసారి ఫంక్షన్‌కు వేసుకున్న దుస్తుల్ని మరోసారి కూడా వేసుకోవచ్చని 'సస్టెయినబిలిటీ' పాఠాలు చెప్పినందుకట! వీరు వాస్తవ పరిస్థితులకు ఎంత దూరంగా ఉంటారో!
– స్వాతీ గోయల్ శర్మ, జర్నలిస్ట్

మంచిదే మంచిది



పట్టభద్రుడిని అయ్యి, 30 ఏళ్లయిన తర్వాత నేను విద్యార్థులకు ఇవ్వగలిగే సలహా ఒక్కటే. సగటు కళాశాలలో మంచి కోర్సు, మంచి కళాశాలలో సగటు కోర్సు అనే అవకాశం ఉంటే, మంచి కళాశాలనే ఎంపిక చేసుకోండి. ఎక్కడ చదివారు అన్నదానితో పోల్చితే, ఏం చదివారు అన్నది ప్రాధాన్యం కాదు.
– జాయ్ భట్టాచార్య, క్విజ్ నిర్వాహకుడు

ఇన్ బాక్స్

కథ సుఖాంతం

ఉత్తరాఖండ్‌లో హైవే నిర్మాణంలో భాగంగా నిర్మితమౌతున్న 'సిల్‌క్యారా టన్నెల్' కూలి 41 మంది కార్మికులు చిక్కుకున్న ఉదంతం సుఖాంతం కావడం ఆనందదాయకం. 17 రోజులపాటు బాహ్య ప్రపంచానికి దూరంగా బిక్కు బిక్కుమంటూ గడిపిన వారంతా క్షేమంగా, ఆరోగ్యంగా తిరిగి రావడంలో కీలక పాత్ర వహించిన రెస్క్యూ టీమ్స్‌కు అభినందనలు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన జాతీయ విపత్తు నిర్వహణ శాఖ, సంబంధిత రాష్ట్ర శాఖ, ఇతర శాఖలు చక్కటి సమన్వయంతో పనిచేశాయి. అయితే అడుగడుగునా ఊహించని అవాంతరాలూ, యంత్ర పరికరాల వైఫల్యాలూ ఎదురయ్యాయి. ఆపరేషన్ మొదట్లోనే కార్మికులతో కమ్యూనికేషన్ ఏర్పాటు చేయగలిగి, వారికి నిరంతరాయంగా ఆహారం, నీరు సరఫరా చేయగలగడంతో సహాయ చర్యల విజయంపై ఆశలు నిలిచాయి. పలుమార్లు ఆశ నిరాశల మధ్య ఊగిసలాట, అవసరానికి అనుగుణంగా మార్చుతూ పోయే ప్రణాళికలు, వాటి విజయాలూ, వైఫల్యాలూ ఉత్కంఠభరితంగా మారాయి.

అమెరికా నుండి తెప్పించిన డ్రిల్లింగ్ యంత్రం పని పూర్తవక ముందే బ్లేడ్ విరిగి మొరాయిస్తే ప్రభుత్వం నిషేధించిన ర్యాట్ హోల్ మైనింగ్ పద్ధతి ఆఖర్లో అక్కరకు వచ్చింది. ఆ పద్ధతి ప్రకారం ఎలుక కలుగు చేసినట్టు మనుష్యులు తవ్వుతూ పోతారు. అయితే మధ్యలో మట్టి జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ఆ రిస్క్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ విధానాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇప్పుడు యంత్రం మొరాయించిన చోట ఆ విధానం అక్కరకు రావడం విశేషం. ఏదేమైనా చివరకు అంతా క్షేమంగా బయటపడడం ఆనందదాయకం. ఈ ఉదంతం ఎన్నో పాఠాల్ని నేర్పాలి. హిమాలయాల సానువుల్లో జరుపుతున్న నిర్మాణాల భద్రతపై మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. జరిగిన ప్రమాదం మూలాల్లోకి చూడాలి. ఏమైనా భద్రతా ప్రమాణాల ఉల్లంఘన జరిగి ఉంటే సరిదిద్దాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని చూపిన రెస్క్యూ టీమ్స్‌కూ, సడలని ధైర్యంతో 17 రోజులు ప్రమాదంలో గడిపిన కార్మికులకూ అభినందనలు.
– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

భద్రతా సవాళ్ల సమీక్ష లేనందునే...

సందర్భం



సి. ఉదయ్ భాస్కర్

పదిహేనేళ్ల క్రితం, 2008 నవంబరు 26న దేశ ఆర్థిక రాజధానిపై జరిగిన ఉగ్రదాడి తొలిదశలో భారత భద్రతా వ్యవస్థ దాదాపుగా అచేతనమైందంటే అతిశయోక్తి కాబోదు. నిస్సహాయులైన, నిరాయుధులైన జన సామాన్యంపై పేట్రేగిన ఉగ్రమూక వందల ప్రాణాలను బలితీసుకున్న దుర్ఘటన అది. భారతదేశ సార్వభౌమత్వం, భద్రతపై ఇంత స్థాయిలో ఎన్నడూ దాడి జరగలేదని చెప్పాలి. ఈ ఘటన జాతీయ భద్రత అంశంలోని సంస్థాగత లోపాలను ఎత్తి చూపింది. దేశం మరోసారి 26/11 లాంటి ఘటనను ఎదుర్కోరాదంటే... అంతర్గత భద్రత సవాళ్లపై సమీక్షించుకోవడం మన తక్షణ అవసరం కావాలి. ముంబై దాడుల్లో ఉగ్రవాదులు అనుసరించిన పద్ధతులు... సరిహద్దులకు అవతలి నుంచి వారికి అందిన సూచనల వంటివన్నీ మనకు అనూహ్యమైనవే. అదే సమయంలో ఢిల్లీ, ముంబైల్లోని జాతీయ స్థాయి భద్రత వ్యవస్థలు సంపూర్ణంగా విఫలమయ్యాయి.

1999 నాటి కార్గిల్ యుద్ధంలోనూ సంస్థాగతమైన నిఘా లోపాలు బయటపడ్డాయి. దివంగత కె. సుబ్రమణ్యం నేతృత్వంలోని కార్గిల్ రివ్యూ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ''ఏజెన్సీల మధ్య సమన్వయానికి, నిర్దిష్ట లక్ష్యానికి అనుగుణంగా కలిసి పనిచేసేందుకు తగిన వ్యవస్థ లేకుండా పోయింది. అలాగే ఏజెన్సీలకు పనులు చెప్పేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు, సామర్థ్యాలను పరీక్షించేందుకు, నాణ్యత ప్రమాణాలను సమీక్షించేందుకు కూడా తగిన వ్యవస్థలు లేవు. అన్ని నిఘా సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో చూసే ఏర్పాట్లు కూడా లేవు'' అని విస్పష్టంగా పేర్కొందీ కమిటీ.

ఈ రకమైన లోపాల కారణంగా భారత్ నివారించదగ్గ ఎదురుదెబ్బలు ఎన్నో చవిచూడాల్సి వస్తోంది. గల్వాన్ లోయ సంఘటన ఇక్కడ చెప్పుకోవాల్సిన ఒక అంశం. 2020లో జరిగిన ఈ ఘటనలో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సైనికులు భారతీయ సైనికులను ఒకరకంగా 'ఆశ్చర్యానికి' గురిచేస్తూ తీవ్రస్థాయి దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే.

మిలిటరీ సంస్కరణల ఫలితం?

భద్రత వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీకి ప్రాతినిధ్యం వహించే 'ద నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్' మిలిటరీ సంస్కరణలను అమలు చేసే విషయంలో దశాబ్దాల సమయం తీసుకుంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పోస్ట్‌ను సృష్టించేందుకు 1990లలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆఖరికి ఇది 2019లో నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండగా సాకారమైంది. ఈ జాప్యం చెప్పే విషయం ఏమిటి? జాతీయ భద్రత అంశాల విషయంలో సంస్కరణలు, సంస్థాగత సమీక్షలకు కొంత నిరోధం ఉందీ అని. అది కూడా స్వప్రయోజనాల కోసం పాకులాడే వారి వల్ల అని అర్థమవుతుంది.

భారతీయ నిఘా ఏజెన్సీల్లో... ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (ఆర్ అండ్ ఏడబ్ల్యూ– క్లుప్తంగా 'రా'), నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్టీఆర్ఓ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)లు ఉన్నాయి. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర హోంశాఖల కింద ఈ ఏజెన్సీలన్నీ పనిచేస్తాయి. వీటికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ప్రతి సాయుధ దళంలోనూ తమదైన ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్లు అదనం. అంతేకాదు... రెవెన్యూ, ఆర్థిక రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు, నిఘా పెట్టేందుకు ప్రత్యేకమైన విభాగాలు కూడా ఉన్నాయి. సమాచార రంగంలో వచ్చిన సరికొత్త మార్పులను పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వాలు రోజంతా తమ నిఘా కార్యక్రమాలను కొనసాగించాల్సిందే అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. చాలా ఏజెన్సీలను ఐపీఎస్‌ల నుంచి ఎంపిక చేసిన సీనియర్ స్థాయి అధికారులు నడుపుతూంటారు. సంస్కరణలు కష్టం అవుతూండేందుకు ఇది కూడా ఒక కారణం.



ముంబై 26/11 ఉగ్రదాడులకు పదిహేనేళ్లు

పాతికేళ్ల నివేదికలు...

మిలిటరీ సంస్కరణల విషయంలో దాదాపు 24 ఏళ్లుగా చాలా నివేదికలు వెలువడ్డాయి. నిశితంగా శ్రద్ధ పెట్టి సమీక్షిస్తే ఉన్నత స్థాయిలోని పోలీసు వర్గాలు, రాజకీయ నాయకులు ఇప్పుడున్న పరిస్థితినే కొనసాగించాలనే స్వార్థంతో పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది.

2024 ఎన్నికల సమయం దగ్గరపడింది. కాబట్టి వ్యవస్థాగతమైన సంస్కరణలకు ఇదేమంత మంచి సమయం కాదు. కానీ వచ్చే ప్రభుత్వం ఏదైనా ఈ విషయాన్ని కచ్చితంగా చేపట్టాల్సిందే. ఇప్పటివరకూ ఈ అంశంపై వెలువడ్డ నివేదికలన్నింటినీ కూలంకషంగా సమీక్షించి ఒక టాస్క్‌ఫోర్స్ ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రకమైన చర్యలు తీసుకోవాలో నిర్ధారించుకుని ముందడుగు వేయాలి. ఈ సంస్కరణలకు పునాదులుగా నిలిచే అంశాలు ఇరవై ఏళ్లుగా నిఘా వర్గాల్లో నైపుణ్యం సాధించిన వారి నివేదికల ఆధారంగా ఉంటాయని నమ్ముతున్నాను.

వృత్తిపరమైన నిబద్ధత, వ్యక్తిగతంగా నైతిక నియమాలున్న వారు నిఘా వ్యవస్థల్లో ఉండటం చాలా అవసరం. ఎందుకంటే ప్రజా పరిశీలనకు దూరంగా, పారదర్శకం కాని తెర వెనకాల ఈ వ్యవస్థలు పనిచేస్తూంటాయి మరి. కాబట్టి వీరి పనితీరును బహిరంగంగా సమీక్షించడం అసాధ్యమే కాదు, వాంఛనీయం కూడా కాదు. కెనడా ఇటీవలే భారతీయ నిఘా వ్యవస్థలపై కొన్ని ఆరోపణలు గుప్పించింది. అమెరికా కూడా ఈ అంశంలో తన ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్న నేపథ్యంలో ఈ రకమైన ఆరోపణలు ఏమంత మంచివి కాదు.

26/11 ఉగ్రదాడి మనలోని లోపాలు ఎన్నింటినో ఎత్తి చూపింది. వాటిని పరిష్కరించే విషయంలో ఇప్పటికే జరిగిన జాప్యం చాలు. ఈ విషయంలో వీలైనంత తొందరగా సంస్కరణల ప్రక్రియ ప్రారంభం కావడం దేశ హితం దృష్ట్యా అవసరం.

వ్యాసకర్త డైరెక్టర్, సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

దుర్గమ్మ సేవలో జస్టిస్ నాగార్జునరెడ్డి



జస్టిస్ నాగార్జునరెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. తొలుత జస్టిస్ నాగార్జునరెడ్డికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

శ్రీసిటీని సందర్శించిన మలేషియా కాన్సుల్ జనరల్



మలేషియా కాన్సుల్ జనరల్, ఇతర బృందంతో శ్రీసిటీ అధికారులు

సత్యవేడు(తిరుపతి జిల్లా): చెన్నైలోని మలేషియా కాన్సుల్ జనరల్ శరవణకుమార్ కుమారవాసంగం, ట్రేడ్ కమిషనర్ వాన్ ఆహ్మద్ తార్మిజీవాన్ ఇంద్రిస్‌తో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వారికి సాదర స్వాగతం పలికారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ శివశంకర్ పారిశ్రామిక వాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం ఆయన శ్రీసిటీ పరిసరాలను నేరుగా వీక్షించారు. మెగా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధిలో కాన్సుల్ జనరల్ పర్యటనకు ఎంతో ప్రాముఖ్యత ఉందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ రంగాల్లో భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉన్న మలేషియా కంపెనీలకు శ్రీసిటీని సిఫార్సు చేస్తానని శరవణకుమార్ కుమారవాసంగం చెప్పారు.

2 నుంచి ఏపీలో భారీ వర్షాలు



నేడు వాయుగుండంగా మారనున్న అల్పపీడనం

- నాలుగు రోజులు కుమ్మరించనున్న వానలు
- రాయలసీమ, దక్షిణ కోస్తాలపై అధిక ప్రభావం
- తుపానుకు మిచాంగ్‌గా నామకరణం

సాక్షి, విశాఖపట్నం: వాతావరణంలో శరవేగంగా చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా.. బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనే ఎక్కువగా పడనుంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. అంతకుముందు డిసెంబరు నాలుగో తేదీ నుంచి తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసినప్పటికీ డిసెంబర్ రెండో తేదీ నుంచే భారీ వర్షాలు మొదలవుతాయని తాజాగా వెల్లడించింది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ గురువారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం వాయవ్య దిశగా కదులుతూ డిసెంబర్ రెండో తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా మారనుందని ఐఎండీ బుధవారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

భారీ వర్షాలు ఎప్పుడు? ఎక్కడెక్కడ?

తుపాను ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో ఎక్కువగానూ, ఉత్తర కోస్తాలో స్వల్పంగానూ ఉండనుంది. డిసెంబర్ రెండు నుంచి ఐదో తేదీ వరకు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. డిసెంబర్ రెండున తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో, మూడున తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్, అన్నమయ్య, నాలుగున తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, గుంటూరు, పల్నాడు, వైఎస్సార్, అన్నమయ్య, నంద్యాల, ఎన్టీఆర్, ఐదున ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, పశ్చిమ గోదావరి, కోనసీమ, బాపట్ల, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయి. కాగా, తుపాను ప్రభావంతో కురిసే వర్షాలకు పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కోతలకు సిద్ధమైన వరి పంటలను సత్వరమే కోసుకోవాలని రైతులకు ఐఎండీ సూచించింది. మరోవైపు రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే ఆస్కారం ఉందని పేర్కొంది.

తుపానుకు మిచాంగ్‌గా నామకరణం

డిసెంబర్ రెండున ఏర్పడబోయే తుపానుకు మిచాంగ్‌గా నామకరణం చేయనున్నారు. ఈ పేరును మయన్మార్ దేశం సూచించింది. నిబంధనల ప్రకారం తుపానుగా మారాకే దాని పేరును అధికారికంగా ప్రకటించనున్నారు.

సీపీడబ్ల్యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై(సీపీడబ్ల్యూఎస్) స్కీం వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాయుడు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సీపీడబ్ల్యూఎస్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా చమల్లముడి ప్రసాద్ బాబు (ఉమ్మడి వెస్ట్ గోదావరి), కార్యవర్గ సభ్యులుగా చెంచు నాగగోపాల్ (ఉమ్మడి కర్నూల్), దియ్య చిన కొండయ్య (ఉమ్మడి గుంటూరు), కొర్నాల నీలాచలం (శ్రీకాకుళం), సూరెబోయిన మల్లికార్జున్ (ప్రకాశం), ఘంటసాల శ్యామ్ కృష్ణా, కుడాల శ్రీనివాస్(అనంతపురం), ఇప్పిలి కృష్ణ (విజయనగరం) ఎన్నికయ్యారు.

అంతర్జాతీయ స్థాయికి పొగాకు రైతు ఖ్యాతి

బోర్డు నూతన చైర్మన్ యశ్వంత్ కుమార్



కందుకూరు: పొగాకు ఉత్పత్తులను అంతర్జాతీయ ప్రమాణాలతో ఎగుమతి చేయడం ద్వారా పొగాకు రైతుల ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా బోర్డు కృషి చేస్తుందని పొగాకు బోర్డు నూతన చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ తెలిపారు. ఇటీవల నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరులోని పామూరు రోడ్డులో ఉన్న పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో విదేశాల్లో పొగాకు సాగు గణనీయంగా తగ్గిందని, అదే సమయంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఇక్కడి రైతులు పొగాకును భారీగా పండించారని ఆయన తెలిపారు. ఈ చర్యలే గత ఏడాది పొగాకు రైతుకు లాభించిందని, దాదాపు 172 మిలియన్ కేజీల పొగాకును కేజీ రూ.220 సగటు ధరలో విక్రయించగలిగామన్నారు. ఈ ఏడాది కూడా ఇదే మార్కెట్ ఉంటుందని ఆశిస్తున్నామని, ఇప్పటికే కర్ణాటకలో జరిగిన వేలంలో కేజీ పొగాకు రూ.240 వరకు పలుకుతోందని ఆయన చెప్పారు.

నాలుగున్నరేళ్లలో కాపులకు రూ.40 వేల కోట్ల లబ్ధి

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో కాపుల బ్యాంక్ ఖాతాల్లోకి సుమారు రూ.40 వేల కోట్లను నేరుగా వేసిందని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి తెలిపారు. చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో కాపులకు సాయం చేసిన ముఖ్యమంత్రి లేరన్నారు. కాపు నేస్తంతో పాటుగా విద్యారంగానికి సంబంధించి అనేక పథకాల ద్వారా కాపులకు మేలు చేస్తుందన్నారు. వివిధ మంత్రి పదవులతో పాటుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు తదితర రూపాల్లో కాపులను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన విషయం అందరికీ తెలిసిందేనని వివరించారు. కాపులను తప్పుదోవ పట్టించేందుకు వివిధ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.

సామాజిక న్యాయానికి ప్రభుత్వం పెద్దపీట

- బీసీల ఐక్యత–సమగ్రాభివృద్ధి సదస్సులో సజ్జల రామకృష్ణారెడ్డి
- బీసీలకు ఇప్పుడు జరుగుతున్న మేలు ఎవరూ చేయలేరు: బీసీ నేతలు



బీసీల సదస్సులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని వారికి చేసిన మేలుతో రుజువైందని తెలిపారు. విజయవాడ శ్రీరామ ఫంక్షన్ హాలులో బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల ఐక్యత–సమగ్రాభివృద్ధి అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో సజ్జల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేలు జరిగితేనే ఓటువేయండని అడిగే దమ్ము కేవలం ఒక్క జగన్‌కే ఉందన్నారు. సంక్షేమ పథకాల్లో అవినీతి కనుమరుగైందని, దాదాపు రూ. 2.40 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరిందని చెప్పారు. సామాజిక సాధికార యాత్రకు విశేష ఆదరణ వస్తోందని సజ్జల తెలిపారు. సామాజిక న్యాయానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల్లో పెద్దపీట వేశామన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు, బ్యాక్ బోన్ క్యాస్ట్ అని అన్నారు. మహిళలకు 50 శాతంపైగా రిజర్వేషన్లను అమలు చేస్తూ రాజకీయ పదవుల్లో కూర్చోబెట్టామన్నారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి అన్నారు.

జనాభా ఆధారంగా చట్టసభల్లో రిజర్వేషన్లు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నా కూడా బీసీలకు ఇప్పుడు జరుగుతున్నంత మేలు చేయరేమోనని జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బీసీలకు పటిష్టంగా రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్ర రాజధానిలో బీసీ భవన ప్రధాన కార్యాలయ నిర్మాణానికి 2 వేల గజాలు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సదస్సుకు ముందు మహాత్మా జ్యోతిరావు సావిత్రి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావు, పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు, డాక్టర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ ఆర్.నాగేశ్వరి, బీసీ నేతలు ధనలక్ష్మి, బొడ్డు కృష్ణ భగవాన్ పాల్గొన్నారు.

విద్య అమృత్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రతిభ

మొదటి, 8వ స్థానం దక్కించుకున్న ఏపీ ఉపాధ్యాయినులు



మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి



వెంకటనాగలక్ష్మి నరసమాంబ

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు నూతన బోధన పద్ధతులపై జాతీయ స్థాయిలో నిర్వహించిన 'ఇన్నోవేటివ్ పెడాగోజీ' పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రెండు అత్యుత్తమ స్థానాలను దక్కించుకుంది. విద్యా అమృత్ మహోత్సవ్ 2022–23లో భాగంగా విద్యా మంత్రిత్వ శాఖ, కేంద్ర సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా 'ఇన్నోవేటివ్ పెడాగోజీ' అంశంపై పోటీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 5.99 లక్షల ప్రాజెక్టులు రాగా, 63 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. వీటి నుంచి జాతీయ స్థాయి జ్యూరీ టాప్–10 విద్యా అమృత్ మహోత్సవ్ ప్రాజెక్టులను ప్రకటించింది. వాటిల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్సార్ కడప జిల్లా మొర్రాయపల్లి ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మైనపురెడ్డి నాగలక్ష్మీ దేవి రూపొందించిన ప్రాజెక్టు మొదటి స్థానంలో నిలవగా, రాజమహేంద్రవరం గ్రామీణ మండలం కొత్త కొలమూరు ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయిని కొల్లూరు వెంకటనాగలక్ష్మి నరసమాంబ ప్రాజెక్టు ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. కాగా దేశంలో సమర్పించిన ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచే అత్యధిక ప్రాజెక్టులు అందినట్టు ఎస్పీడీ తెలిపారు.

బహుజనుల సంక్షేమానికి బాబు తూట్లు

1,158వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: బహుజనులు తనకు ఓట్లేయలేదనే అక్కసుతో కక్షగట్టి తప్పుడు కేసులు వేయించి వారికి అందాల్సిన సంక్షేమ పథకాలకు చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. పేదల హక్కులు హరిస్తున్న బాబును వెంటనే జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,158వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. బాబుకు వత్తాసు పలుకుతూ ఇటీవల రాజధాని ఉద్యమాల్లో తిరిగిన దళిత దళారులు, అమ్ముడుపోయేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల ముసుగులో ఎల్లో మీడియాలో విషం చిమ్ముతూ బహుజన హక్కులను కాలరాస్తున్న వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. న్యాయస్థానాల్లో ప్రతి రోజూ చంద్రబాబు ఆయన అనుయాయులు వేసిన కేసుల గొడవలకే సమయం సరిపోతుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు చేసిన అవినీతి అంతా ఇంతా కాదని, న్యాయస్థానాలే విస్తుబోయేలా ఉన్న అవినీతి కేసుల్లో బెయిల్ తెచ్చుకునేందుకు రూ.వందల కోట్లు వెచ్చించడం సిగ్గుచేటని చెప్పారు. ఎన్ని కుయుక్తులు పన్నినా బాబును ప్రజలు నమ్మే పరిస్థితి ఎప్పటికీ ఉండదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, కొలకలూరి లోకేష్, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గవర్నర్లకు గైడ్‌లైన్స్
అవసరమైతే జారీ చేస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు విభేదాలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ ధోరణికి అడ్డుకట్ట వేసే చర్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిమిత్తం పంపే బిల్లులను గవర్నర్లు ఎలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పరిశీలనకు నివేదించవచ్చన్న అంశంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించే విషయమై ఆలోచిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తెలిపారు. బిల్లుల ఆమోదం విషయమై కేరళ ప్రభుత్వం, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మధ్య నెలకొన్న వివాదంపై విచారణ సందర్భంగా బుధవారం ఆయన ఈ మేరకు వెల్లడించారు. సదరు బిల్లుల విషయమై సీఎం పినరయి విజయన్‌తో చర్చించాల్సిందిగా గవర్నర్‌కు సీజేఐ ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. సమస్య పరిష్కారానికి ఇది దోహద పడగలదని ఆశాభావం వెలిబుచ్చింది. ''లేదంటే న్యాయస్థానమే దీనిపై స్పష్టమైన చట్టం రూపొందించే అంశాన్ని పరిశీలిస్తాం'' అని సీజేఐ స్పష్టం చేశారు. 8 బిల్లుల్లో ఏడింటిని రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ నివేదించడం, కేరళ సర్కారు దాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయడం తెలిసిందే.

కేంద్రానికి ఆ అధికారముంది
ఢిల్లీ సీఎస్ పదవీకాలం పొడిగింపుపై సుప్రీం

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. దీంట్లో చట్టవిరుద్ధమైన అంశాలేవీ తమకు కన్పించడం లేదని పేర్కొంది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. దాంతో అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. నవంబర్ 30తో ముగియనున్న నరేశ్‌కుమార్ పదవీకాలాన్ని ఆర్నెల్లు పొడిగిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆప్ సర్కారు తీవ్రంగా తప్పుబడుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

సిరియన్ గోలాన్‌పై ఐరాస తీర్మానానికి భారత్ మద్దతు

ఐరాస: వాయవ్య సిరియాలోని సిరియన్ గోలాన్ ప్రాంతం నుంచి ఇజ్రాయెల్ వెనక్కు వెళ్లకపోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మంగళవారం ఆమోదించిన తీర్మానానికి మద్దతు తెలిపింది. దీన్ని ఈజిప్ట్ ప్రతిపాదించగా భారత్‌తో పాటు మొత్తం 91 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. 8 దేశాలు వ్యతిరేకించగా 62 దేశాలు దూరంగా ఉన్నాయి. ఆ ప్రాంతం 1967 నుంచి ఇజ్రాయెల్ ఆక్రమణలోనే ఉంది. పైగా 1981 నాటి ఐరాస తీర్మానానికి విరుద్ధంగా ఆ ప్రాంతంలో సెటిల్మెంట్లు తదితరాలను నిర్మిస్తూ వస్తోంది.

ప్రిడేటర్ ఒప్పందం ప్రయోజనకరం: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికాతో కుదుర్చుకున్న ఎంక్యూ9బి పైలట్‌రహిత విమానాలు, ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందం భారత్‌కు ఎంతో ప్రయోజనకరమని రక్షణ శాఖ పేర్కొంది. ఈ విషయంలో అమెరికా తాలూకు సాంకేతిక, క్షేత్రస్థాయి నైపుణ్యంతో మన సైనిక దళాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది. ఈ సాంకేతికత మనకు అందుబాటులో లేకపోవడం వల్లే అమెరికా నుంచి తీసుకుంటున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ''అంతర్జాతీయంగా కుదిరిన ఇలాంటి ఒప్పందాలన్నింట్లోనూ ఇది అత్యంత మేలురకమైనదే గాక అతి చవకైనది. ఒప్పందంలో భాగంగా మనకు విమానాలతో పాటు సెన్సర్లు, ఆయుధాలు, గ్రౌండ్‌కంట్రోల్ స్టేషన్లు, శాటిలైట్ అండ్ సి బ్యాండ్ గ్రౌండ్ డేటా టెర్మినళ్లు, తదితరాలన్నీ అందనున్నాయి. బ్రిటన్ కుదుర్చుకున్న ఇలాంటి ఒప్పందంలో భాగంగా దానికి కేవలం విమానాలు మాత్రమే అందనున్నాయి. పైగా మనతో పోలిస్తే ఖరీదైనది కూడా'' అని వివరించింది.

కుటుంబీకులనే కాల్చేశాడు
అమెరికాలో గుజరాతీ యువకుని అరెస్టు

న్యూయార్క్: అమెరికాలో ఓం బ్రహ్మభట్ అనే ఓ 23 ఏళ్ల గుజరాతీ ఘోరానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్‌లో హ్యాండ్‌గన్ కొనుగోలు చేసి మరీ సొంత తాతయ్య, నాయనమ్మ, బాబాయిలను కాల్చి చంపాడు! న్యూజెర్సీలోని సౌత్ ప్లెయిన్‌ఫీల్డ్ ప్రాంతంలో సోమవారం ఈ దారుణం జరిగింది. వాళ్ల ఇంటినుంచి పేలుళ్లు వినిపిస్తున్నాయంటూ సోమవారం ఉదయం పొరుగువాళ్లు ఫిర్యాదు చేశారు. దిలీప్‌కుమార్ బ్రహ్మభట్ (72), బిందూ బ్రహ్మభట్ (72) దంపతులతో పాటు వారి కుమారుడు యశ్‌కుమార్ బ్రహ్మభట్ (38) తూటా గాయాలతో కుప్పకూలి కనిపించినట్టు పోలీసులు తెలిపారు. దంపతులిద్దరూ అప్పటికే మరణించగా తీవ్రగా గాయపడ్డ యశ్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచినట్టు చెప్పారు. ఓంను అరెస్టు చేశారు.

దంపతుల పోట్లాట దెబ్బకు... దారి మళ్లిన విమానం!


న్యూఢిల్లీ: భార్యాభర్తల గొడవలంటే ఏ స్థాయిలో ఉంటాయో చెప్పనక్కర్లేదు. అయితే ఆ గొడవ దెబ్బకు బుధవారం ఏకంగా ఓ అంతర్జాతీయ విమానాన్నే దారి మళ్లించాల్సి వచ్చింది! మ్యూనిచ్ నుంచి బ్యాంకాక్ వెళ్తున్న జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం ఈ ఘటనకు వేదికైంది. విమానం మ్యూనిచ్ నుంచి బయల్దేరిన కాసేపటికే అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు గొడవ పడ్డారు. భర్తది జర్మనీ కాగా భార్యది థాయ్‌లాండ్. భార్య ఫిర్యాదుతో విమానాన్ని పైలట్ ఢిల్లీ మళ్లించి భర్తను పోలీసులకు అప్పగించారు. అయితే, క్షమాపణలు చెప్పడంతో అతన్ని మరో విమానంలో బ్యాంకాక్ పంపడం కొసమెరుపు!

పీడకల... అగ్నిపరీక్ష

సిల్‌క్యారా సొరంగం అనుభవాలను మీడియాతో పంచుకున్న కార్మికులు

- మొదట ప్రాణాలపై పూర్తిగా ఆశలు వదులుకున్నాం..
- అయినా ధైర్యం కూడదీసుకున్నాం
- రాళ్ల సందుల నుంచి జారిన నీటి చుక్కలు చప్పరించాం.
- బొరుగులతో కడుపు నింపుకున్నాం. అర్ధాకలితో గడిపాం..
- కాలక్షేపం కోసం పేకాట ఆడాం.. కాగితాలు చింపి విసురుకున్నాం
- సాక్సులను బంతులుగా చేసి, చోర్-సిపాయి ఆట ఆడాం, పాటలు పాడుకున్నాం
- భగవంతుడు ఎట్టకేలకు మా ప్రార్థనలు ఆలకించాడు..

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకొని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికిన 41 మంది కార్మికులు 17 రోజుల తర్వాత మంగళవారం రాత్రి క్షేమంగా బయటకు వచ్చారు. సొరంగంలో తమకు ఎదురైన భయానక అనుభవాలు, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ప్రాణాలు నిలబెట్టుకున్న తీరును పలువురు కార్మికులు బుధవారం మీడియాతో పంచుకున్నారు. సొరంగంలో తామంతా కష్టసుఖాలు కలబోసుకున్నామని, మిత్రులుగా మారామని చెప్పారు. ఆడిన ఆటలు, పాడుకున్న పాటల గురించి తెలియజేశారు. సొరంగంలో చిక్కుకున్నప్పుడు ప్రాణాలపై ఆశలు వదులుకున్నామని జార్ఖండ్‌లోని ఖిరాబేడా గ్రామానికి చెందిన అనిల్ బేడియా(22) అనే కార్మికుడు వెల్లడించాడు. ''నవంబర్ 12న సొరంగంలో మేము పనిలో ఉండగా, హఠాత్తుగా కొంత భాగం కూలిపోయింది. భారీ శబ్దాలు వినిపించాయి. మేమంతా లోపలే ఉండిపోయాం. బయటకు వచ్చే దారి కనిపించలేదు. ఎటు చూసినా చిమ్మచీకటి. అక్కడే సమాధి కావడం తథ్యమని అనుకున్నాం. మొదటి రెండు రోజులపాటు బతుకుతామన్న ఆశ లేకుండాపోయింది. క్రమంగా ధైర్యం కూడదీసుకున్నాం. బయట పడడానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ముందు ఎలాగైనా ప్రాణాలు రక్షించుకోవాలని నిర్ణయించుకున్నాం. నిజంగా అదొక పీడకల, అగ్ని పరీక్ష. సొరంగం పైభాగంలోని రాళ్ల సందుల నుంచి పడుతున్న ఒక్కో చుక్క నీటిని ఒడిసిపట్టుకొని చప్పరించాం. మా దగ్గరున్న బొరుగులతో 10 రోజులపాటు కడుపు నింపుకున్నాం. అర్ధాకలితో గడిపాం. ఆ తర్వాత అధికారులు పైపు గుండా పండ్లు, భోజనం, నీళ్ల సీసాలు మాకు అందించారు. ప్రమాదం జరిగాక 70 గంటల తర్వాత అధికారులు మాతో మాట్లాడారు. అప్పుడే ప్రాణాలపై మాలో ఆశలు మొదలయ్యాయి. మేమంతా కలిసి నిత్యం దేవుడిని ప్రార్థించేవాళ్లం. చివరకు దేవుడు మా ప్రార్థనలు ఆలకించాడు.



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖీంపూర్ ఖేరీ జిల్లా ఖైరాంపూర్‌కు చెందిన 25 ఏళ్ల మంజీత్ చౌహాన్ సిల్‌క్యారా టన్నెల్‌లో చిక్కుకొని, 17 రోజుల తర్వాత బయటకు వచ్చాడు. అతడి రాకతో స్వగ్రామంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. మంజీత్ తల్లిదండ్రులు ఖైరాంపూర్‌లో ఉంటున్నారు. అతడి సోదరుడు గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తల్లిదండ్రుల ఫొటో మంజీత్ వద్ద ఉంది. ఆ ఫొటో చూస్తూ ధైర్యం తెచ్చుకొని సొరంగంలో కాలం గడిపానని, ఒత్తిడిని అధిగమించానని చెప్పాడు. ''సొరంగం లోపలిభాగం కూలిన సమయంలో అక్కడికి కేవలం 15 మీటర్ల దూరంలోనే పని చేస్తున్నాను. తొలుత అసలేం జరిగిందో అర్థం కాలేదు. క్రమంగా అది పీడ కలగా మారింది. ప్రమాదం జరిగాక మొదటి 24 గంటలు చాలా కష్టంగా గడిచాయి. మేమంతా భయందోళనకు గురయ్యాం. ఆకలి, దాహం, నీరసం, నిరాశ వంటివి అన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి. నాలుగు అంగుళాల పైపు గుండా అధికారులు ఆహారం, నీరు పంపించిన తర్వాత మా మానసిక స్థితి మారింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలియడంతో మాలో మనోధైర్యం పెరిగింది. కుటుంబ సభ్యులతో మాట్లాడగలిగాం. అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని నాన్నకు చెప్పా. ఫోన్ వాల్‌పేపర్‌లో నా తల్లిదండ్రుల ఫొటో చూస్తూ ఉండిపోయేవాడిని. ప్రాణాలపై ఆశ కోల్పోకుండా అది ఉపయోగపడింది. సొరంగంలో అటూ ఇటూ నడుస్తూ ఉండేవాళ్లం. పైపు గుండా అధికారులు పంపించిన పప్పు నాకెంతో నచ్చింది. సొరంగంలో చిక్కుకున్న మేమంతా ఒకరికొకరం మంచి మిత్రులుగా మారిపోయాం. మా కష్ట సుఖాలు తెలియజేసుకున్నాం. క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ చూడలేకపోవడం పట్ల విచారంగా ఉంది. ఇంటికెళ్లిన తర్వాత మ్యాచ్ హైలైట్స్ చూస్తా'' అని మంజీత్ చౌహాన్ ఉత్సాహంగా చెప్పాడు.

తల్లిదండ్రుల ఫొటో చూస్తూ కాలం గడిపా..

కార్మికుల గ్రామాల్లో సంబరాలు

ఖిరాబేడా గ్రామం నుంచి మొత్తం 13 మంది యువకులు సొరంగం పనుల కోసం ఉత్తరకాశీకి చేరుకున్నారు. అదృష్టం ఏమిటంటే వారిలో ముగ్గురు మాత్రమే సొరంగంలో చిక్కుకున్నారు. బాధితులుగా మారిన మొత్తం 41 మంది కార్మికుల్లో 15 మంది జార్ఖండ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారే కావడం గమనార్హం. ఖిరాబేడాలో అనిల్ బేడియా తల్లి 17 రోజులపాటు తల్లడిల్లిపోయింది. కుమారుడు జాడ తెలియక ఆందోళనకు గురైంది. ఇంట్లో వంట చేసింది లేదు. ఇరుగు పొరుగు అందించిన భోజనంతో కడుపు నింపుకుంది. ఎట్టకేలకు కుమారుడు అనిల్ బేడియా సొరంగం నుంచి బయటకు రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇదే గ్రామానికి చెందిన శ్రవణ్ బేడియా(55)కు పక్షవాతం. ఏకైక కుమారుడు రాజేంద్ర సొరంగం నుంచి బయట పడడంతో అతని ఇంట సంబరాలు అంబరాన్ని తాకాయి.



మొదట్లో కష్టంగా గడిచింది


సొరంగంలో తాము చిక్కుకున్నట్లు తెలియగానే ఆందోళనకు గురయ్యామని ఉత్తరాఖండ్‌లోని చంపావత్ గ్రామానికి చెందిన పుష్కర్‌సింగ్ ఐరే అనే కార్మికుడు చెప్పాడు. మొదట్లో చాలా కష్టంగా గడిచిందని, చనిపోతామని అనుకున్నామని, క్రమంగా అక్కడి పరిస్థితులకు అలవాటు పడ్డామని తెలిపాడు. తొలుత సరైన ఆహారం లేదు, బయటున్నవారితో మాట్లాడే వీలు లేదని అన్నాడు. ఒంటిపై ఉన్న బట్టలతోనే 17 రోజులపాటు ఉండాల్సి వచ్చిందని, స్నానం చేయలేదని, సొరంగం లోపలంతా అపరిశుభ్రంగా మారిందని తెలియజేశాడు. ప్లాస్టిక్ షీట్లపై నిద్రించామని పేర్కొన్నాడు. ఆహారం, నీరు అందిన తర్వాత ఊపిరి పీల్చుకున్నామని చెప్పాడు. కాలక్షేపం కోసం పేకాడామని, కాగితాలను క్రమపద్ధతిలో చింపుతూ ఉండేవాళ్లమని వివరించాడు. సాక్సులతో బంతులు చేసి, చోర్-సిపాయి ఆట ఆడామని, పాటలు పాడుకున్నాం తెలిపాడు.

నిత్యం యోగా, వాకింగ్ చేశాం..

సొరంగం నుంచి బయటకు వచ్చిన 41 మంది కార్మికులతో మంగళవారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్ ద్వారా మాట్లాడారు. వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. సొరంగంలో ఉన్నప్పుడు నిత్యం యోగా, వాకింగ్ చేశామని, తద్వారా మనోస్థైర్యం సడలకుండా జాగ్రత్తపడ్డామని, ఆత్మవిశ్వాసం పెంచుకున్నామని ప్రధానమంత్రికి కార్మికులు తెలియజేశారు. విదేశాల్లో ఉన్న భారతీయులు ప్రమాదాల్లో చిక్కుకుంటే మన ప్రభుత్వం కాపాడిందని, స్వదేశంలోనే ఉన్న తామెందుకు భయపడాలని భావించామని అన్నారు.

రిషికేశ్ ఎయిమ్స్‌కు కార్మికుల తరలింపు

సిల్‌క్యారా టన్నెల్ నుంచి బయటకు వచ్చిన కార్మికులను బుధవారం రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు హెలికాప్టర్‌లో తరలించారు. డిజాస్టర్ వార్డులో చేర్చి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మానసిక పరిస్థితి కూడా పరీక్షిస్తామని, అవసరమైన వారికి తగిన చికిత్స అందిస్తామని ఎయిమ్స్ వైద్యులు చెప్పారు. ఆరోగ్యం కుదుటపడిన వారిని ఇళ్లకు పంపిస్తామని వెల్లడించారు. కార్మికుల కుటుంబ సభ్యులు, బంధులను కూడా సిల్‌క్యారా నుంచి బస్సుల్లో ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు.



సొరంగం పనులు కొనసాగుతాయి

ఉత్తరాఖండ్‌లో 4.5 కిలోమీటర్ల పొడవైన సిల్‌క్యారా సొరంగం పనులు కొనసాగుతాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. కూలిపోయిన ప్రాంతంలో మరమ్మతులు, సేఫ్టీ ఆడిట్ ముగిసిన తర్వాత పనులు యథావిధిగా కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 900 కిలోమీటర్ల 'చార్‌ధామ్ యాత్ర ఆల్ వెదర్ రోడ్' ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా టన్నెల్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చార్‌ధామ్‌లో భాగమైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్రాలను అనుసంధానించడానికి కేంద్రం రూ.12,000 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో నాలుగు క్షేత్రాలను చుట్టిరావడానికి వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2016 డిసెంబర్ 27న శంకుస్థాపన చేశారు. వాస్తవానికి 2020 మార్చిలోగా ప్రాజెక్టు పూర్తికావాలి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జాప్యం జరుగుతోంది.

కేబినెట్ భేటీలో మోదీ భావోద్వేగం

సిల్‌క్యారా సొరంగంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినెట్ మంగళవారం రాత్రి సమావేశమైంది. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను తలచుకొని ప్రధానమంత్రి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారని కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం చెప్పారు. కార్మికులను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. సహాయక చర్యలపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు స్వయంగా ఆరా తీశారని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. దేశ విదేశాల్లోని భారతీయులను కాపాడడం ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు.

ప్రశంసలందుకున్న నాగపూర్ నిపుణుల సేవలు

సిల్‌క్యారా సొరంగంలో సహాయక చర్యల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు పాల్గొన్నాయి. నిపుణులు తమవంతు సేవలందించారు. కార్మికులకు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది లేకుండా, కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరగకుండా వీరు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ డబ్ల్యూసీఎల్‌కు నిపుణులు సొరంగం వద్దే మకాం వేశారు. భారీ యంత్రాలతో తవ్వకం పనులు చేపట్టడంతో సొరంగం లోపల కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరుగుతుండేవి. ప్రమాదకర స్థాయికి చేరగానే యంత్రాలను ఆపించేవారు. వారి సేవలు ప్రశంసలందుకున్నాయి.

సొరంగంలో కార్మికులు భుజాలపై ఎత్తుకున్నారు

ర్యాట్ హోల్ మైనింగ్ నిపుణుల్లో ఢిల్లీకి చెందిన ఫిరోజ్ ఖురేషీ, యూపీకి చెందిన మోను కుమార్ తొలుత సొరంగంలోని కార్మికుల వద్దకు చేరుకున్నారు. తమను చూడగానే కార్మికులు ఆనందంతో భుజాలపై ఎత్తుకున్నారని ఫిరోజ్ వెల్లడించాడు. ''మాకు పండ్లిచ్చారు. పేర్లు అడిగారు. అరగంట పాటు సొరంగంలో ఉన్నాం'' అని మోను కుమార్ చెప్పాడు. తాము కార్మికుల వద్దకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం వచ్చారని పేర్కొన్నాడు. కార్మికులను కాపాడినందుకు తాము డబ్బులేమీ తీసుకోలేదని తెలియజేశాడు.



కార్మికులను క్షేమంగా బయటికి తీసుకొచ్చిన ర్యాట్ హోల్ మైనింగ్ నిపుణులు వీరే

అమెరికాలోనే హెచ్-1బీ వీసాల రెన్యూవల్

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బీ వీసాలతో ఉద్యోగాలు చేసుకుంటున్న విదేశీయులకు అమెరికా స్టేట్ ఫర్ వీసా సర్వీసెస్ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీ జూలీ స్టఫ్ట్ శుభవార్త చెప్పారు. హెచ్-1బీ వీసాల రెన్యూవల్ (స్టాంపింగ్) కోసం స్వదేశానికి వెళ్లాల్సిన అవసరం లేదని, అమెరికాలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ నుంచి మూడు నెలలపాటు ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కొన్ని కేటగిరీల్లో హెచ్-1బీ వీసాలకు డొమెస్టిక్ రెన్యూవల్ ప్రక్రియ డిసెంబర్ నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అమెరికాలో పెద్ద సంఖ్యలో భారత ఐటీ నిపుణులు హెచ్-1బీ వీసాలతో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. తాజా నిర్ణయంతో వీరికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వ్యయ ప్రయాసలు తప్పుతాయి. అయితే, తొలి దశలో 20,000 మందికే ఈ వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత దశల వారీగా మరికొంతమందికి అవకాశం కల్పిస్తారు. డిసెంబర్ నుంచి మూడు నెలల్లోగా హెచ్-1బీ వీసా గడువు ముగిసేవారు వీసా రెన్యూవల్ (స్టాంపింగ్)ను అమెరికాలోనే చేసుకోవచ్చు. అమెరికా వీసాలకు భారత్‌లో భారీ డిమాండ్ ఉందని జూలీ స్టఫ్ట్ గుర్తుచేశారు. వీసా కోసం కొన్ని సందర్భాల్లో ఏడాదిపాటు ఎదురుచూడాల్సి వస్తోందని చెప్పారు. భారతీయులకు సాధ్యమైనంత త్వరగా వీసా అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని భావిస్తున్నామని వివరించారు. ఇందులో ఒక మార్గంగా డొమెస్టిక్ వీసా రెన్యూవల్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. దీనివల్ల భారతీయ టెకీలకు లబ్ధి కలుగుతుందన్నారు



మనవారికి 1.4 లక్షల వీసాలు

2022లో భారత విద్యార్థులకు రికార్డు స్థాయిలో 1.4 లక్షలకుపైగా వీసాలు జారీ చేసినట్లు స్టఫ్ట్ వెల్లడించారు. అమెరికా వర్సిటీల్లో తరగతుల ప్రారంభానికి ముందే భారత్‌లో స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలు పూర్తి చేయడానికి సిబ్బంది కొన్నిసార్లు వారమంతా పనిచేస్తున్నారని తెలిపారు.

వామ్మో.. తెలుగు అనువాదం!

తెలంగాణలో తన ప్రసంగాలపై రాహుల్ గాంధీ హాస్యోక్తులు

కోజికోడ్: తెలంగాణలో ఎన్నికల ప్రచార సభల్లో తన ప్రసంగాల అనువాదం సందర్భంగా చిత్రమైన సమస్యలు ఎదుర్కొన్నట్టు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. తెలంగాణలో నెల రోజులకు పైగా హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెర పడటం తెలిసిందే. బుధవారం కేరళలోని కోజికోడ్‌లో రాహుల్ ఓ పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. ఆయన ప్రసంగాన్ని ప్రముఖ ఉపన్యాసకుడు, ఐయూఎంఎల్ ఎంపీ అబుస్సమద్ సమాధానీ మలయాళంలోకి అనువదించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో తనకెదురైన అనుభవాలను రాహుల్ గుర్తు చేసుకున్నారు. ''ఒక ప్రచార సభలో నా ప్రసంగాన్ని అనువదిస్తున్న వ్యక్తి ఎందుకోగానీ చాలాసార్లు ఇబ్బంది పడ్డాడు. నేనొకటి చెబుతుంటే ఆయన మరొకటి చెప్పసాగాడు. ఇక అలా కాదని నేను మాట్లాడిన పదాలు లెక్కబెట్టడం మొదలు పెట్టా. నేను హిందీలో ఐదు పదాలు మాట్లాడినప్పుడు తెలుగులో ఏడెనిమిది పదాలతో ముగిస్తాడని చూశా. కానీ ఆయన ఏకంగా 20 నుంచి 30 పదాలు మాట్లాడాడు. పైగా నేను బోరు కొట్టే విషయాలు మాట్లాడినప్పుడేమో జనం పరమోత్సాహంతో గట్టిగా చప్పట్లు కొట్టారు. మాంచి ఉత్సాహపూరితమైన ముచ్చట్లు చెప్పినప్పుడేమో అందరూ పూర్తి నిశ్శబ్దంగా ఉన్నారు. అంతా అనువాద మహిమ!'' అంటూ వాపోయారు. ''అంతా అలా ఉల్టాపల్టాగా నడిచింది. అయినా సరే, నేను ఎవరిపైనా కోపగించుకోలేని పరిస్థితి! పైగా ప్రసంగం సాగినంతసేపూ నిండుగా నవ్వుతూనే ఉండాలి'' అని చెప్పుకొచ్చారు. బహుశా తన ప్రసంగాలకు అనువాదకునిగా ఉండటం ప్రమాదకరమైన పనేనంటూ రాహుల్ చమత్కరించడంతో అంతా నవ్వుకున్నారు.



చిరిగిన దుస్తుల మాటున సంపద దాస్తున్న నేతలు

రాజకీయ నాయకుల నిరాడంబర వస్త్రశైలిని బట్టి వారిని అంచనా వేయకూడదని రాహుల్ అభిప్రాయపడ్డారు. నేటి నాయకులు తాము చూపించదలచింది మాత్రమే ప్రజలకు చూపిస్తుంటారని అన్నారు. ''నన్ను కలవడానికి ఎందరో నాయకులు వస్తుంటారు. సాదాసీదా బట్టలు, చిరిగిన బూట్లతో కనిపిస్తారు. కానీ వాళ్లింటికి వెళ్తే పోర్టికోలో ఖరీదైన బీఎండబ్ల్యూ కార్లుంటాయి. వాళ్ల పిల్లలు అతి ఖరీదైన జీవితం గడుపుతూ కన్పిస్తారు. కనుక ఒక రాజకీయ నాయకుని ఆర్థిక స్థితిని సరిగా అంచనా వేయాలంటే అతని పిల్లలను గమనిస్తే చాలు. 18 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను కనిపెట్టిన తిరుగులేని సూత్రమిది'' అని చెప్పారు.



బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే జీవిత చరిత్రను ఆవిష్కరిస్తున్న పార్టీ అగ్ర నేత సోనియాగాంధీ

'సీఏఏ అమలు ఖాయం'

కోల్‌కతా: దేశంలో పౌరసత్వ (సవరణ) చట్టం-సీఏఏ అమలును ఎవరూ అడ్డుకోలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన కోల్‌కతాలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన భారీ ర్యాలీలో మాట్లాడారు. సీఏఏను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం తెలిసిందే. బెంగాల్లోకి విదేశీయుల చొరబాట్లకు మమత దన్నుగా ఉండటమే అందుకు కారణమని షా ఆరోపించారు. రాష్ట్రాన్ని తృణమూల్ సర్కారు సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. ''ప్రభుత్వం నిండా అవినీతిలో మునిగిపోయింది. మమత హయాంలో రాష్ట్రంలో రాజకీయ హింస, ముస్లిం సంతుష్టీకరణ చర్యలు పరాకాష్టకు చేరాయి'' అని ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మమత సర్కారును సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ''2024 లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్లో బీజేపీకి అత్యధిక సీట్లు కట్టబెట్టి మమత సర్కారు పతనానికి రంగం సిద్ధం చేయండి. మోదీ కూడా బెంగాల్ ప్రజల వల్లే నేను మూడోసారి ప్రధాని అయ్యాను అని చెప్పుకునే స్థాయిలో రాష్ట్రంలో బీజేపీని ఘనంగా గెలిపించండి'' అని కోరారు.

ఉచిత రేషన్ మరో ఐదేళ్లు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపించిన వేళ కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 81.35 కోట్ల మంది పేదలకు నెలకు 5 కిలోల మేరకు ఉచిత రేషన్ అందిస్తున్న ఆహార ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)ను మరో ఐదేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే దేశవ్యాప్తంగా 15 వేల మహిళా స్వయం సహాయ బృందాలకు డ్రోన్లు అందజేయాలని కూడా నిర్ణయించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తాలూకు ప్రయోజనాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే దీని లక్ష్యమని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఈ పథకాన్ని రెండేళ్ల పాటు కొనసాగిస్తాం. మహిళా సంఘాలకు డ్రోన్ల కొనుగోలు వ్యయంలో 80 శాతం దాకా ఆర్థిక సాయం అందిస్తాం. ఇందుకు ఏటా రూ.1,261 కోట్లు కేటాయిస్తున్నాం. మిగతా మొత్తాన్ని రుణంగా తీసుకునే అవకాశం కల్పిస్తాం. ఈ డ్రోన్లను వ్యవసాయ సేవల నిమిత్తం రైతులకు మహిళా సంఘాలు అద్దెకిస్తాయి. తద్వారా ఒక్కో సంఘం ఏటా కనీసం రూ.లక్షకు పైగా ఆదాయం పొందవచ్చు'' అని వివరించారు. మహిళా సంఘాలకు డ్రోన్లు అందజేస్తామని ఆగస్టు 15 ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించడం తెలిసిందే. ఇక పీఎంజీకేఏవైను మరో ఐదేళ్లు కొనసాగించేందుకు రూ.11.8 లక్షల కోట్లు అవసరమని మంత్రి వివరించారు. కరోనా నేపథ్యంలో 2020లో కేంద్రం ఈ పథకాన్ని మొదలు పెట్టడం తెలిసిందే. 2026 నుంచి ఐదేళ్ల పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ శాతం తదితరాలపై సలహాలు, సూచనలకు ఏర్పాటు చేయనున్న 16వ ఆర్థిక సంఘం తాలూకు విధి విధానాలకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కమిషన్ 2025 అక్టోబర్ అంతానికల్లా నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌కు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 10.45 కోట్లు గిరిజన జనాభా ఉంది. అందులో 18 రాష్ట్రాలు, అండమాన్ నికోబార్‌లోని 75 గిరిజన సమూహాలను ప్రమాదంలో ఉన్నవిగా గుర్తించారు. దేశవ్యాప్తంగా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాన్ని మూడేళ్లు కొనసాగించేందుకు కూడా కేబినెట్ నిర్ణయించింది.

మణిపూర్లో శాంతి ఒప్పందం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో వేర్పాటువాద హింసకు అడ్డుకట్ట వేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ మిలిటెంట్ సంస్థ యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్‌ఎల్‌ఎఫ్) బుధవారం కేంద్రంతో చరిత్రాత్మక శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం కింద యూఎన్‌ఎల్‌ఎఫ్‌పై కేంద్రం నిషేధం విధించిన కొద్ది రోజులకే ఈ పరిణామం జరగడం విశేషం. ఒప్పందం ప్రకారం దేశ చట్టాలను గౌరవించేందుకు, జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు యూఎన్‌ఎల్‌ఎఫ్ నేతలు అంగీకరించారు. మణిపూర్‌కు చెందిన ఒక సాయుధ వేర్పాటువాద సంస్థ కేంద్రంతో ఇలాంటి ఒప్పందానికి రావడం ఇదే తొలిసారి. దీన్ని చరిత్రాత్మక మైలురాయిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించారు. ఈశాన్యంతో శాశ్వత శాంతి స్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న నిరంతర కృషికి ఇది ఫలితమన్నారు. యూఎన్‌ఎల్‌ఎఫ్‌ను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ఇతర సాయుధ సంస్థలు కూడా యూఎన్‌ఎల్‌ఎఫ్ బాటను అనుసరిస్తాయని భావిస్తున్నారు. జాతుల హింసతో కొన్ని నెలలుగా మణిపూర్ అట్టుడుకుతుండటం తెలిసిందే.

సాక్షి విజయవాడ సిటీ


ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 30 । నవంబర్ । 2023



దుర్గమ్మ సేవలో నైనా జైస్వాల్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.70 అడుగుల వద్ద ఉంది.



ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం

విజయవాడ పటమట సీహెచ్‌ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో ఏడు రోజుల పాటు జరిగే జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌ను కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం ప్రారంభించారు. -8లో▸

న్యూస్‌రీల్

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్లు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర రాష్ట్ర స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు టి.చెంగలరాయుడు, జి.చక్రవర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామన్నారు. డిసెంబర్ మూడు నుంచి పదో తేదీ వరకు పంజాబ్‌లోని లుధియానాలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ జట్లకు హెడ్ కోచ్‌లుగా వి.ఆర్.రుద్ర, పి.శ్రీనివాసరావు, కోచ్‌లుగా ఎస్.వెంకటకృష్ణ, పి.సుకన్య, మేనేజర్లుగా ఎస్.టి.కృష్ణారెడ్డి, టి.ఎస్.ఆర్.పి.ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కేవీఆర్ విద్యార్థి సత్తా



నందిగామ: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పట్టణంలోని కేవీఆర్ కళాశాలకు చెందిన క్రీడాకారుడు తరుణ్ ఆదిత్య బంగారు పతకాన్ని సాధించాడు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూల్ లో ఈనెల 23 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పాల్గొన్న కె.వి.ఆర్ కళాశాల క్రీడాకారుడు తరుణ్ ఆదిత్య 73 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో తరుణ్‌ను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు బాబురావు, గోపాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ పులగం రాయప్ప, పీడీ వాసిరెడ్డి నాగేశ్వరరావు అభినందించారు.

ఒకటో తేదీ నుంచి 'ఇగ్నో' పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే డిసెంబర్- 2023 టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ మొదటి తేదీ నుంచి జరగనున్నాయని ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె. సుమలత తెలిపారు. జనవరి తొమ్మిదో తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు. విజయవాడ ప్రాంతీయకేంద్రం పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, ఆదోని, అనంతపురం ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టికెట్స్‌ను ఇగ్నో వెబ్ సైట్ నందు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమతమ అధ్యయన కేంద్రాలను థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 లో సంప్రదించవచ్చన్నారు.

రేషన్ పంపిణీపై అపోహలొద్దు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎండీయూ వాహనాలతో సరుకులను కార్డుదారుల ఇంటి వద్దనే డెలివరీ చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి సరుకుల డెలివరీ చేయాలని సూచించారు. బుధవారం అంబేద్కర్ భవన్‌లో ఎండీయూ ఆపరేటర్లు, చౌక ధరల దుకాణ డీలర్లు, పౌరసరఫరాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ ఆపరేటర్లు పాటించాల్సిన సూచనలు, డోర్ డెలివరీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలో 5 నుంచి 10 అనువుగా ఉండే ప్రదేశాలను గుర్తించాలన్నారు. గుర్తించిన ప్రదేశాలలోనే పంపిణీ చేపట్టాలన్నారు. ఈ విషయాన్ని వలంటీర్లు ముందుగా కార్డుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు సరుకులను నిర్ణీత సమయములో కచ్చితమైన తూకంతో పంపిణీ చేయాలన్నారు. సరుకుల పంపిణీపై ఎలాంటి అపోహలు లేకుండా చూడాలన్నారు.

సామాజిక జయోత్సాహం

సామాజిక సాధికార యాత్రకు జన నీరాజనం

ఎన్నికలప్పుడు హామీలివ్వడం.. ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టాక విస్మరించడం పరిపాటిగా మారిన రాజకీయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్రకు పునాది వేశారు. సమాజంలో చిన్నచూపుతో, పాలకుల నుంచి చేయూత లభించక ఇబ్బంది పడిన బడుగు, బలహీన వర్గాలకు అగ్రతాంబూలమిచ్చి అందలమెక్కించారు. లెక్కకుమించిన సంక్షేమ పథకాలతో ఆర్థిక తోడ్పాటునిచ్చి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. రాజకీయ, సామాజిక, విద్య, వైద్య వంటి అనేక రంగాల్లో హద్దులు లేకుండా అవకాశాలిచ్చి ప్రోత్సహించారు. ఈ క్రమంలో ఆ మేలులను మరోసారి వివరించేందుకు బందరులో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రభంజనమై కదిలింది. జై జగన్ నినాదాలతో కోనేరు సెంటర్ మార్మోగింది.

- కిక్కిరిసిన బందరు కోనేరు సెంటర్
- జై జగన్ నినాదాలతో మార్మోగిన ప్రాంగణం
- నాయకుల ప్రసంగాలకు విశేష స్పందన



జనహోరు.. కోనేరు సెంటర్‌లో సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

చిలకలపూడి(మచిలీపట్నం): సామాజిక సాధికార యాత్రకు మచిలీపట్నం నగరంలో జనం నీరాజనాలు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరి శ్రేయస్సు కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిన అద్భుత విజయాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర బుధవారం మచిలీపట్నంలో జరిగింది. ఈ యాత్రకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. వేలాది మంది జనం తరలిరావటంతో మచిలీపట్నం నగరంలో మునిసిపల్ కార్యాలయం నుంచి కోనేరు సెంటర్ వరకు జన సంద్రంగా మారింది. సభాస్థలి వద్ద నాయకుల ప్రసంగాలు చేసే సమయంలో జనాలు జేజేలు పలకటం, జై జగన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ యాత్ర యువతలో నూతనోత్సాహాన్ని నింపింది.

హోరెత్తిన సభ..

నగరంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ నేతల ప్రసంగాలతో దద్దరిల్లింది. మునిసిపల్ కార్యాలయం నుంచి కోనేరుసెంటరు వరకు రెండువైపులా జనాలు కిక్కిరిసి నాయకుల ప్రసంగాలను ఆలకించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అబ్దుల్ హాఫీజ్‌ఖాన్‌లు గత ప్రభుత్వ పనితీరు, నేడు జగనన్న ప్రభుత్వం చేస్తున్న పనితీరుపై చేసిన ప్రసంగాలు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేశాయి. స్థానిక శాసనసభ్యులు



స్ఫూర్తిదాయక ప్రసంగం.. సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్

పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో సర్పంచుల నుంచి మంత్రుల వరకు అలాగే పార్లమెంట్, రాజ్యసభ స్థానాలకు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా సమన్యాయం చేసి అందలం ఎక్కించారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ పోతుల సునీత, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడ



ఘన నివాళి.. వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే అనిల్

పాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగడ్డ రమేష్‌నాయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈటీటీసీ, రైల్వే హాస్పిటల్‌కు ఫైవ్ స్టార్ రేటింగ్



సత్యనారాయణపురంలోని ఈటీటీసీ భవనం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని ఈటీటీసీ (ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రెనింగ్ సెంటర్), రైల్వే హాస్పిటల్‌లో మెరుగైన విద్యుత్ ఆదా ప్రమాణాలను పాటించడంతో 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ'(బీఈఈ) ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రకటించింది. ఈ రేటింగ్ రానున్న మూడేళ్లపాటు అమలులో ఉంటుంది. ఈటీటీసీ, రైల్వే హాస్పిటల్‌లో రోజువారీ విధుల్లో స్టాండర్డ్ విద్యుత్ ఉపకరణాల వినియోగం, సోలార్, ఇతర ఇంధన పద్ధతుల వాడకం ద్వారా ప్రతిష్ఠాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించినట్లు విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. సంస్థల్లో వార్షిక ఇంధనం ఆదాపై ఏటా బీఈఈ రేటింగ్ ఇస్తుంది. విజయవాడ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ సెంటర్‌లో అనుసరిస్తున్న వివిధ చర్యల కారణంగా భారీగా విద్యుత్‌ను ఆదా చేయడంతో ఈ రేటింగ్ సాధించింది. 2020లో నిర్మించిన రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనం పూర్తిగా ఐజీబీసీ (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) నిబంధనల ప్రకారం ఉండడంతో ఐజీబీసీ ప్లాటినం రేటింగ్ కూడా సాధించింది. భారతీయ రైల్వేలోనే ప్లాటినం రేటింగ్ సాధించిన మొదటిదిగా విజయవాడ డివిజన్‌గా చరిత్ర సృష్టించింది. డివిజన్‌లో పర్యావరణ అనుకూల పద్ధతులను ఉపయోగించడంతోనే డివిజన్‌కు అవార్డులు, రేటింగ్‌లు వచ్చాయని అందుకు కృషిచేసిన అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

జనవరి 30 నాటికి గృహాలు సిద్ధం

అధికారులకు ఆదేశించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే ఏడాది జనవరి 30 నాటికి జిల్లాలో 19,489 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణం, ఆడుదాం ఆంధ్ర, తుది ఓటర్ల జాబితా, ప్రాధాన్య భవన నిర్మాణాలు తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలలో ప్రగతి చూపాలన్నారు. నిర్మాణ కాంట్రాక్టర్లతోను, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని నిర్మాణాల వేగం పెంచాలన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించాలి..

ప్రత్యేక్ష సంక్షిప్త సవరణ-2024లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల నాటి నుంచి నమోదవుతున్న అభ్యంతరాలు, క్లయిమ్స్‌కు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

డిసెంబర్ 2, 3 శని ఆదివారాలలో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ రోజులలో పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ జాబితాతో సిద్ధంగా ఉండి అభ్యంతరాలు, క్లయిమ్స్ స్వీకరించాలన్నారు. డిసెంబర్ 26వ తేదీ లోపు పెండింగ్ లేకుండా అన్ని దరఖాస్తులకు పరిష్కారం చూపాలన్నారు.

క్రీడాకారుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

ఆడుదాం ఆంధ్ర క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయ స్థాయిలో వేగవంతం చేయాలన్నారు. ఐదు విభాగాలలో నిర్వహించే ఈ క్రీడలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్రతి క్రీడాకారునికి పాతినిధ్యం కల్పించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ పి. సంపత్ కుమార్, డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం మచిలీపట్నం రానున్న నేపథ్యంలో సుమ కన్వెన్షన్ హాలులో ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం రాత్రి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమానికి గవర్నర్ హాజరుకానున్నారన్నారు. ఇందుకోసం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, రాకపోకలకు ఇబ్బంది లేకుండా గట్టి పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ గౌరవవందనం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రదర్శించే వాహనం తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. పర్యటనకు హాజరయ్యే అధికారులకు, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్‌తో లబ్ధిదారులు ముఖాముఖి మాట్లాడేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏఎస్పీలు శ్రీహరిరావు, ఎస్‌వీడీ ప్రసాద్, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగేశ్వరనాయక్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి. గీతాబాయి, డీఎస్‌వో వి. పార్వతి, డీఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

విరమణలను విజయవంతం చేద్దాం

అధికారులతో దుర్గగుడి ఈవో రామారావు




అధికారులతో మాట్లాడుతున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణల సందర్భంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసే భవానీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అధికారులను ఆదేశించారు. దుర్గగుడి ముఖ్య విభాగాల అధికారులతో ఈవో రామారావు బుధవారం సమావేశమయ్యారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ దీక్ష విరమణలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివచ్చే అవకాశం ఉందని, భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. దసరా ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు, ఆలయ అధికారులు సమన్వయంతో దిగ్విజయంగా పూర్తి చేశామో, దీక్ష విరమణలకు కూడా అదే ప్రణాళికలతో దిగ్విజయం చేయాలన్నారు. భక్తులకు కల్పించే సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, యజ్ఞనారాయణ, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, ఈఈ కోటేశ్వరరావు, లింగం రమాదేవి పాల్గొన్నారు.

పశువైద్యం బలోపేతం కావాలి

పద్మశ్రీ డాక్టర్ సోసమ్మ

ఉంగుటూరు: వైవిధ్యం, సమానత్వం, సమగ్రతతో పశువైద్య వృత్తిని బలోపేతం చేసేందుకు సదస్సులు దోహదపడతాయని పద్మశ్రీ డాక్టర్ సోసమ్మ ఐ.పే అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, జాతీయ మహిళా పశువైద్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల నేతృత్వంలో 17వ జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోసమ్మ పాల్గొని ప్రసంగించారు. పశువైద్య రంగంలో జరుగుతున్న వివిధ పరిశోధనలను తెలుసుకోవాలని సూచించారు. జాతీయ మహిళా పశువైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మధుస్వామి మాట్లాడుతూ దేశంలోనే మహిళలు పశువైద్య రంగంలో పలు ఉన్నత స్థానాల్లో పనిచేయడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. పాండిచ్చేరి పశువైద్య శాఖ డైరెక్టర్ డాక్టర్ లతామంగేష్కర్ వివిధ రకాల పశువైద్య కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం జాతీయ స్థాయిలో పశువైద్య రంగంలో గణనీయమైన సేవలు అందించినవారికి జీవిత సాఫల్య పురస్కారం, అభ్యుదయ మహిళా రైతులను సత్కరించారు. ఎస్.వి.వి.యు డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, ఆంధ్ర సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు పొందిన మహిళా పశువైద్యులు

సైన్స్ కాంగ్రెస్‌లో ఏడు ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టులు

విజయవాడరూరల్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఎన్టీఆర్ జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రజెంట్ చేశారని జిల్లా సైన్స్ అధికారి, కోఆర్డినేటర్ డాక్టర్ మైనం హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆంధ్ర రాష్ట్రంలో అప్కాస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కేఎల్ యూనివర్సిటీలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జరిగిందని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థులు వ్యవసాయ రంగానికి, పరిశ్రమ రంగం, ఆరోగ్యం, పండ్ల శుభ్రతకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారని వివరించారు.

క్లుప్తంగా

పార్టుటైమ్ ఉద్యోగం పేరుతో మోసం

పెనమలూరు: పార్టుటైమ్ ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్లు మహిళలను మోసగించి రూ.80 వేలు స్వాహా చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప టీచర్స్ కాలనీ మూడవ లైన్‌కు చెందిన ఈడ విజయలక్ష్మికి కొద్ది రోజుల క్రితం అమెజాన్‌లో పార్టుటైమ్ ఉద్యోగం ఉందని వాట్సాప్‌కు లింకు వచ్చింది. లింకు పంపిన వారితో మాట్లాడగా టాస్కు పూర్తి చేస్తే అదనపు సొమ్ము ఇస్తామని నమ్మబలికారు. మోసగాళ్ల మాటలు నమ్మిన విజయలక్ష్మి పలు దఫాలుగా రూ.80 వేలు సొమ్ము బదిలీ చేసింది. ఆ తరువాత సైబర్ నేరగాళ్లు స్పందించక పోవటంతో తాను మోసపోయానని గుర్తించి బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో ఏడాది జైలుశిక్ష

విజయవాడస్పోర్ట్స్: కత్తితో దాడి చేసి ఓ వ్యక్తిని గాయపర్చిన ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఒకటో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.కరిముల్లా బుధవారం తీర్పు చెప్పారు. విజయవాడ మాచవరం ప్రాంతానికి చెందిన గ్లోరికి అదే ప్రాంతానికి చెందిన నూకల తిరుపాల్‌తో వివాహమైంది. కొన్నాళ్ల తరువాత వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో తిరుపాల్ అతని భార్య గ్లోరిపై దాడి చేశాడు. ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు వచ్చిన ఆమె మేనమామ పైనా నిందితుడు తిరుపాల్‌తో పాటు అతని సోదరుడు నూకల కోటయ్య కత్తితో దాడి చేసి గాయపర్చారు. 2020 ఏప్రిల్ 30వ తేదీన జరిగిన ఈ ఘటనపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఉమాపతి కోర్టు లో వాదనలు వినిపించారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు తిరుపాల్, కోటయ్యలకు ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ముగ్గురు దొంగలకు కఠిన కారాగార శిక్ష

గన్నవరం: సెల్‌ఫోన్ చోరీ యత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన సమాచారం మేరకు...2020 అక్టోబర్ 6న మండలంలోని కొత్తగూడెం వద్ద పోలవరం కట్టపై వెళ్తున్న మందపాటి అర్జునరావు జేబులోని సెల్‌ఫోన్‌ను బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు లాక్కుని పరారయ్యారు. వేగంగా వెళ్తున్న వారి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ముగ్గురు యువకులను స్థానికుల సహాయంతో అర్జునరావు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులైన గుణదలకు చెందిన కొక్కిలగడ్డ సందీప్, మాచర్ల కరుణ కుమార్, నరసింహశెట్టి సాయికుమార్‌పై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేయగా 12వ ఏఎంఎం కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితులకు కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో ముగ్గురికి నెల రోజుల పాటు జైలుశిక్ష అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న తెలిపారు.

వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జగన్

- సామాజిక రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, చిత్రంలో మరో కోఆర్డినేటర్ అయోధ్యరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్సీ సునీత, ఎమ్మెల్యేలు అనిల్, నాని

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో పలు వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్లు మర్రి రాజశేఖర్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. మచిలీపట్నం ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లను ఉపయోగించుకున్నాయే తప్ప వారి అభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయా వర్గాలకు సామాజిక, రాజకీయ రంగాల్లో అధిక ప్రాధాన్యం లభిస్తోందని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల్లో ఈ వర్గాలకు జరిగిన అభివృద్ధిని వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వర్గాలకు చెందిన వారిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా, జెడ్పీ చైర్‌పర్సన్లుగా, నలుగురిని రాజ్యసభ సభ్యులుగా నియమించారని గుర్తుచేశారు. రూ.2.50 లక్షల కోట్ల మేర సంక్షేమ పథకాలకు ఖర్చు జరగ్గా, దీనిలో రూ.1.70 లక్షల కోట్లు ఈ వర్గాలకే అందిందని వివరించారు. రాష్ట్రంలో 25 మంది మంత్రులు ఉంటే 17 మంది ఈ వర్గాలకు చెందిన వారేనన్నారు. 13 జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో తొమ్మిది ఈ వర్గాలకే దక్కాయన్నారు. రాష్ట్రంలో రూ.13.50 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో గతంలో ఆరు పోర్టులు ఉండగా ప్రస్తుతం మరో నాలుగు నూతన పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మూడు పారిశ్రామిక కారిడార్‌లను నిర్మిస్తున్నామన్నారు. సీఎం జగన్ తోడ్పాటుతో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) నేతృత్వంలో అభి వృద్ధి పరుగులు పెడుతోందన్నారు. మచిలీపట్నంలో రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.5,500 కోట్లతో బందరు పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు.

వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం

పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల సీఎం జగన్ పాలనలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యే పేర్ని నాని, వైఎస్సార్ సీపీ నాయకురాలు దేవరపల్లి గీత పాల్గొన్నారు.

21న ఆర్చ్ లేబొరేటరీలో రసాయన విపత్తు మాక్ డ్రిల్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ): జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, ముఖ్యంగా రసాయన పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రసాయన విపత్తు సంభవిస్తే నష్టాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికను పరీక్షించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్డీఎంఏ), ఏపీ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఏపీఎస్‌ఎంఏ) నిర్వహించనున్న మాక్ డ్రిల్ సన్నద్ధతపై ఆయా సంస్థల ఉన్నతాధికారులు బుధవారం 11 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, రసాయన పరిశ్రమల యాజమాన్యాలతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మాక్ డ్రిల్ నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు మార్గనిర్దేశనం చేసిన తర్వాత కలెక్టర్ ఢిల్లీరావు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ డిసెంబర్ 19న టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ జరగనుందని వెల్లడించారు. రసాయన విపత్తు జరిగిన స్వల్ప సమయంలోనే భారీ నష్టం జరిగేందుకు అవకాశముంటుందని, అందువల్ల పటిష్టమైన ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 21న రాష్ట్రస్థాయి మాక్ డ్రిల్ జరగనుందని, ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని ఆర్చ్ లేబొరేటరీలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమలకు వచ్చిన నవ వధువు మృతి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి ఓ నవవధువు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. తిరుమల వన్ టౌన్ ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. విజయవాడ చెందిన రమేష్, సుధా దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సంతోషికి ఈనెల 23న హైదరాబాద్‌కు చెందిన యువకుడితో వివాహమైంది. నూతన వధూవరులు శ్రీవారి దర్శనార్థం ఈ నెల 28న తిరుమలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నవదంపతులు, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సంతోషి కళ్లు తిరిగి కింద పడింది. సమీపంలో ఉన్న టీటీడీ భద్రతా సిబ్బంది అంబులెన్స్‌లో ఆమెను అశ్విని ఆసుపత్రిలోని అపోలో ఎమెర్జెన్సీ క్లినిక్‌కు తరలించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు నీరు మున్నీరయ్యేలా రోదించారు.

విజయవాడ డివిజన్‌లో రైల్వే టికెట్ తనిఖీలు

ప్రయాణికుల నుంచి రూ.10.61 లక్షల జరిమానా వసూళ్లు



విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో కమర్షియల్ విభాగం అధికారులు, సిబ్బంది బుధవారం టికెట్ తనిఖీలు నిర్వహించి టికెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.10.61 లక్షలు జరిమానా వసూలు చేశారు. డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్ పి.భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో స్క్వాడ్ టీటీఐలు, టీసీలు, స్టేషన్ సిబ్బంది, కమర్షియల్ క్లర్క్‌లు ఒక్క రోజులోనే విజయవాడ సెక్షన్‌లోని 61 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు, ప్రధాన రైల్వే స్టేషన్‌లలో ఈ తనిఖీలు చేపట్టారు. టికెట్ లేని ప్రయాణికులు, సరైన టికెట్ లేకుండా రైలులో ప్రయాణిస్తున్న 1573 మందిపై కేసులు నమోదు చేయడం ద్వారా ఒక రోజులోనే రికార్డు స్థాయిలో ఆదాయం పొందినట్లు డెప్యూటీ సీసీఎం పి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో 45 మంది టికెట్ చెకింగ్ సిబ్బంది, 10 మంది ఆర్‌పీఎఫ్ పోలీసులు అన్ని ప్లాట్‌ఫాంలు, ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు చేపట్టారు. టికెట్ లేకుండా ప్లాట్‌ఫాంలపై ప్రవేశించరాదని, రైలు పట్టాలను దాటరాదని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించాలని భాస్కర్‌రెడ్డి ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛత ఉద్యమి యోజన
క్లీనింగ్ యంత్రాలు ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం కింద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా 20 మంది లబ్ధిదారులకు మురుగు శుద్ధి వాహనాలు మంజూరయ్యాయి. ఈ వాహనాలను బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మురుగునీరు, చెత్త నిర్మూలనకు మురుగుశుద్ధి వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. స్వచ్ఛత ఉద్యమి యోజనలో భాగంగా ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సహాయంతో రాష్ట్ర షెడ్యూలు కులాల ఆర్థిక సంస్థ ఈ వాహనాలను లబ్ధిదారులకు కేటాయించిందని, 3 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఒక్కో వాహనం విలువ రూ.31.67 లక్షలుకాగా, సబ్సిడీ కింద రూ.15.06 లక్షలు, ఎన్ఎస్‌కేఎఫ్ డీసీ రుణం కింద రూ.16.61 లక్షలు మంజూరు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రలీల పాల్గొన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం



టేబుల్ టెన్నిస్ జాతీయ ర్యాంకింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడ స్పోర్ట్స్: జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విజయవాడ పటమట సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో ఏడు రోజుల పాటు జరిగే జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌ను కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా పేరుతో డిసెంబర్ 15 నుంచి ప్రతిష్టాత్మక క్రీడా పోటీలు నిర్వహించనుందని తెలిపారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు బహుమతిని అందజేస్తుందన్నారు. అనంతరం టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి కమలేష్ మెహతాతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు టేబుల్ టెన్నిస్ ఆడారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గుణాశన్, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.ఎస్.ప్రకాష్, విశ్వనాథరావు, ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

కృష్ణా తరంగ్-2023కు ఏర్పాట్లు పూర్తి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న కృష్ణా తరంగ్ -2023 పోటీలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10.45 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, వర్సిటీ వీసీ జి.జ్ఞానమణి, పోర్టు ట్రస్ట్ ఎండీ మేకతోటి దయాసాగర్ హాజరుకానున్నారు.

కోడలి మృతి కేసులో మామకు ఐదేళ్ల జైలు

పెనమలూరు: కోడలి మరణానికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు జడ్జి ఐ.శైలజాదేవి బుధవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాల్లోకి వెళితే పెనమలూరుకు చెందిన మల్లంపాటి ఫణిశ్రీ (28) 2007లో మల్లంపాటి కిరణ్‌ను వివాహం చేసుకుంది. వీరికి బాబు పుట్టాడు. ఫణిశ్రీ పోరంకి కామినేని ఆస్పత్రిలో వైద్యురాలికి కోఆర్డినేటర్‌గా పనిచేస్తోంది. ఫణిశ్రీ మామ మల్లంపాటి నాగేశ్వరరావు కోడలిపై కన్నేశాడు. తనతో అక్రమ సంబంధం పెట్టుకోవాలని వేధించసాగాడు. ఈ విషయం భర్తకు చెప్పగా తాను మాట్లాడతానని చెప్పాడు. కాగా 2016వ సంవత్సరం డిసెంబర్ 28న మామ నాగేశ్వరరావు మద్యం తాగి వచ్చి ఫణిశ్రీని లైంగికంగా వేధించాడు. మామ ఆగడాలు భరించలేక ఫణిశ్రీ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏపీపీ చంద్రగిరి విష్ణువర్ధన్ 12 మంది సాక్షులను కోర్టులో విచారించారు. ఈ కేసు విచారించిన విజయవాడ మహిళా సెషన్స్‌కోర్టు జడ్జి ఐ.శైలజాదేవి సాక్ష్యాలు రుజువు కావటంతో నిందితుడు నాగేశ్వరరావుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చారు. సాక్షులను ప్రాసిక్యూషన్ వారి ఎదుట హాజరుపరిచి నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన సీఐ టీవీవీ రామారావును జిల్లా ఎస్పీ జాషువా అభినందించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి



పెనమలూరు: కానూరులో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శ్రీ భవిష్య కాలేజీలో కర్నూలుకు చెందిన సామా నిఖిల్‌సాయి (18) నీట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. నిఖిల్‌సాయి బుధవారం ఉదయం 7 గంటలకు వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. సహచర విద్యార్థులు వెళ్లి చూడగా నిఖిల్‌సాయి కిందపడిపోయి ఉన్నాడు. అతనిని కానూరులో ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకు వెళ్లగా మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED::KRISHNA

Regd.Office: D.No.20/132/B, Hamna Residency, Near Zilla Parishath Center, Kobbari Thota, MACHILIPATNAM - 521001

NOTIFICATION FOR RECRUITMENT

No.P.Admn/Recruitment/Accts/2023 Dt. 25.11.2023.

The AP State Civil Supplies Corporation Ltd., Krishna district will be requiring the services 01 (one) Chartered Accountant on contract basis having the qualification of CA, 01 (one) Accountant Gr-III on contract basis having the qualification either with B.Com. + MBA (Finance), (2) Accountant Gr-III post on contract basis having qualification M.Com and (1) Data Entry Operator on outsourcing basis for a period of (01) one year only. The selection will be made through District Selection Committee headed by the Joint Collector & E.O.E.D., APSCSCL, Krishna. Applications are invited from interested and eligible local candidates for the posts for following posts.

Sl No	Post	No. of Post	Eligibility Criteria	Monthly consolidated remuneration
1	Chartered Accountant (Contract basis)	1	Chartered Accountant passed Final.	Rs.60,000/-
2	Accountant Gr-III (Contract basis)	1	Chartered Accountant Inter Passed/ B.Com. + MBA (Finance).	Rs.30,000/-
3	Accountant Gr-III (Contract basis)	2	M. Com.	Rs.27,000/-
4	Data Entry Operator (Outsourcing basis)	1	Any Degree with proficiency in MS Office applications.	Rs.18,500/-

Weightage:75 Marks/Points :
(i) Merit of basic Academic Qualification
(ii) Experience in Private, Semi-Govt., & Govt. Department with certificates - (5 points per each year) – Preference shall be given to the serving candidates in the CS Corporation
(iii) Additional qualifications : 20 Points (Certificate courses in Computer & Diploma etc., are not added additional qualifications)
iv) Maximum age Limit : (a) General: 35 years (b) Reserved: 40 years
(v) Non-local candidates will be selected when local candidates are not available

No interviews will be held for selection of candidates and recruitment will be strictly on the basis of merit duly following roaster points.

The legibly filled in applications should be submitted to the District Civil Supplies Manager, AP State Civil Supplies Corporation Ltd., Regd.Office: D.No.20/132/B, Hamna Residency, Near Zilla Parishath Center, Kobbari Thota, Machilipatnam-521001 along with the copies of relevant certificates should be submitted by 08.12.2023 up to 5.00 P.M. and verification of Original Certificates will be on 13 th and 14 th December'2023.

JOINT COLLECTOR & E.O.E.D.,
APSCSCL :: KRISHNA

వై.యస్.ఆర్. తాడేగడప పురపాలక సంఘం వారి ప్రకటన

R.O.C. No. 5170/G1/2023 తేది : 29-11-2023

ఈ దిగువ తెలిపిన స్థల యజమానుల నుండి పట్టణములోని ప్రధాన రహదారులను ప్రజల ఉపయోగార్థం వెడల్పు చేయుటలో భాగంగా కానూరు జోనల్ డెవలప్‌మెంట్ ప్లాను మరియు రోడ్డు డెవలప్‌మెంట్ ప్లానుల మేర స్థలమును సేకరించడం జరిగినది. స్థల యజమానులకు నష్ట పరిహారముగా ప్రభుత్వం వారి ఉత్తర్వులు జి.ఓ.యం.యస్. 223, యం.ఏ., తేది : 09.07.2018 మేరకు టి.డి.ఆర్. బాండ్లు జారీ చేయవలసి ఉన్నది.

క్ర. నెం.	యజమాని పేరు	సర్వే నెం. / గ్రామము	రోడ్డు విస్తరణలో కోల్పోయిన విస్తీర్ణం	రోడ్డు పేరు
1.	శ్రీ ఇంద్ల [illegible]	222/1సి. కానూరు	122.90 Sqy.	120 అడుగుల వెడల్పు బందరు రోడ్డు.
2.	శ్రీ [illegible]	80/8. కానూరు	126.18 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
3.	శ్రీ [illegible]	89/7,8, కానూరు	126.13 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
4.	శ్రీ [illegible]	93/4సి. కానూరు	135.86 Sqy.	100 అడుగుల వెడల్పు మహానాడు రోడ్డు
5.	శ్రీ లావు సిద్ధార్థ	275/2. కానూరు	44.62 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
6.	శ్రీ డి. మధుసూధనరావు	275/2, కానూరు	180.90 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
7.	శ్రీ డి. అనిల్ కుమార్	275/2, కానూరు	187.46 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
8.	శ్రీ డి. మధుసూదనరావు	275/2. కానూరు	101.76 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
9.	శ్రీ లావు సిద్ధార్థ	275/2. కానూరు	24.44 Sqy.	100 అడుగుల వెడల్పు కామినేని హాస్పిటల్ రోడ్డు
10.	శ్రీమతి [illegible]	11/1. కానూరు	152.88 Sqy.	80 అడుగుల వెడల్పు [illegible]
11.	శ్రీ [illegible]	262/2. కానూరు	125.86 Sqy.	40 అడుగుల వెడల్పు [illegible] రోడ్డు (అమరావతి కాలనీ)
12.	శ్రీ [illegible]	262/3, కానూరు	907.77 Sqy.	40 అడుగుల వెడల్పు [illegible] రోడ్డు (అమరావతి కాలనీ)

పై తెలిపిన విషయంలో ఏమైనా సూచనలు, అభ్యంతరములు వున్న యెడల 15 దినములలోగా వై.యస్.ఆర్. తాడేగడప మునిసిపాలిటీ వారికి తెలియజేయగలరు.

కమీషనర్, వై.యస్.ఆర్. తాడేగడప పురపాలక సంఘం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

లబ్బీపేట బ్రాంచ్ (03431), డి.నెం.39-10-5, వి.ఎస్.ఆర్ టవర్స్, లబ్బీపేట, విజయవాడ, ఆంధ్ర-520010.
ఫోన్ : 0866-2475821, ఇ-మెయిల్ : ubin0803430@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు

[illegible] తేది.29.12.2023న [illegible] తేది.31.08.2022 నాటికి రూ.11,96,856.80 పై [illegible] + 01.09.2022 నుండి వడ్డీ [illegible] : 1) శ్రీ [illegible] (ఋణగ్రహీత), నెం.36-10-111, కొత్త గిరిపురం, ఈ-సేవా కేంద్రం ప్రక్కన, స్టేడియం రోడ్డు, లబ్బీపేట, విజయవాడ. 2) శ్రీమతి [illegible] గంగా భవాని (ఋణగ్రహీత), నెం.36-10-111, కొత్త గిరిపురం, ఈ-సేవా కేంద్రం ప్రక్కన, స్టేడియం రోడ్డు, లబ్బీపేట, విజయవాడ.

వేలం తేది మరియు సమయం: 29.12.2023, ఉదయం 11.00 గం॥ నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు (10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

స్థిరాస్తి వివరములు

విజయవాడ, ఈ-సేవా ప్రక్కన, కొత్త గిరిపురం, స్టేడియం రోడ్డు, [illegible] 23177/ఏ/1, కొత్త అసెస్‌మెంట్ నెం.190014 వద్ద 80 చ॥గ॥ల విస్తీర్ణం గల ఇంటి స్థలము మరియు అందు డి.నెం.35-10-111లో [illegible] హద్దులు : ఉత్తరం : ప్లాట్ నెం.4 యొక్క ఆస్తి, దక్షిణం : ప్లాట్ నెం.3 యొక్క ఆస్తి, తూర్పు : ప్లాట్ నెం.28 యొక్క ఆస్తి, పడమర : రోడ్డు.

రిజర్వు ధర : రూ.45,19,000/- | ధరావత్తు : రూ.4,51,900/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

[illegible] www.unionbankofindia.co.in, www.mstcecommerce.com, www.ibapi.in ను సందర్శించగలరు. [illegible] శ్రీ [illegible] మొబైల్ నెం.94400 30202, ఇ-మెయిల్ : ubin0803430@unionbankofindia.bank

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) / రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు
[illegible] 2002లోని రూల్ 8(6) / రూల్ 9(1) ల క్రింద పైన తెలిపిన తేదీన వేలం ద్వారా అమ్మకం [illegible]

తేది : 24.11.2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లబ్బీపేట బ్రాంచ్ (03431)

Union Bank of India — విజయవాడ బ్రాంచి

ఆర్.ఆర్ అప్పారావు వీధి, విజయవాడ-520001, ఫోన్ : 8928406061
Email: ubin0806064@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

[illegible] "ఎక్కడ ఏది ఎలా వున్నదో అది", "ఎలా వున్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" [illegible] తేది.16-12-2023 [illegible]

[illegible] : 1) [illegible] : రాజా నరసింహారావు, డి.నెం.21-2-10/3ఎ, [illegible] రోడ్, ముత్యాలంపాడు, విజయవాడ-520011 (ఋణగ్రహీత). 2) [illegible] : రాజా నరసింహారావు, డి.నెం.21-2-10/3ఎ, [illegible] రోడ్, ముత్యాలంపాడు, విజయవాడ-520011 (సహ ఋణగ్రహీత).

బకాయి మొత్తం : ది.31-03-2021 నాటికి రూ.43,86,358.52 పై [illegible]

స్థిరాస్తుల వివరములు : [illegible]

రిజర్వుధర : రూ.38,66,000/- | ధరావత్తు సొమ్ము : రూ.3,86,600/-

[illegible] ఇండియా వెబ్‌సైట్ : www.unionbankofindia.co.in & www.ibapi.in నందు చూడగలరు. [illegible] మొబైల్ : 8790931715 మరియు 8928406061, Mail ID : ubin0806064@unionbankofindia.bank [illegible]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు నోటీసు
[illegible]

ప్రదేశం : విజయవాడ, తేది : 29-11-2023
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ బ్రాంచి.

క్లుప్తంగా

త్రిశక్తి పీఠంలో హుండీల ఆదాయం రూ.11.72 లక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఆగస్టు 9 నుంచి ఈ నెల 29వ తేదీ వరకు 110 రోజులకు హుండీలు లెక్కించగా రూ.11,72,554లు ఆదాయం లభించింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.అనురాధ పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీల కానుకలు లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు పి.విజయ్, జి.సత్యనారాయణ, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు క్విజ్

లబ్బీపేట(విజయవాడతూరు): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో బిషప్ అజరయ్య పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో కేఎస్ఆర్ జిల్లా పరిషత్ స్కూల్, ఎస్‌కేపీవీపీ హైస్కూల్, బోయపాటి శివరామకృష్ణయ్య స్కూల్, గాంధీ మున్సిపల్ హైస్కూళ్ల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కేబీసీ జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, బోయపాటి శివరామకృష్ణయ్య స్కూల్ విద్యార్థులు ద్వితీయ, బిషప్ అజరయ్య స్కూల్ విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. వీరికి డిసెంబర్ 1న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందచేస్తామని పోటీలను పర్యవేక్షించిన రవిశంకర్ తెలిపారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



పటమట(విజయవాడతూర్పు): అంతర్జాతీయంగా గుర్తింపు కలిగిన సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 26న జరిగిన 20వ జాతీయ సిప్ అబాకస్ అండ్ మెంటల్ అర్థమేటిక్ కాంటెస్ట్‌లో పటమట విద్యార్థులు ఉత్తమ ప్రతిమ కనబరిచి ట్రోఫీ సాధించారు. బుధవారం పటమట బ్రాంచిలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి హెడ్ మానస మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పోటీలో వివిధ రాష్ట్రాలకు చెందిన 4,700 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా పటమట బ్రాంచి అబాకస్‌కు చెందిన 9 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చూపి ట్రోఫీని సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిప్ అబాకస్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ అభినందించారని తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులన్నారు. పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో డిసెంబర్ 1 తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 98499 53533 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

అలరించిన భక్తి గీతాలు



విజయవాడకల్చరల్: కార్తీక మాసం సందర్భంగా రమణ కోకిల ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై బుధవారం నిర్వహించిన భక్తి గీతాల కార్యక్రమం అలరించింది. గాయకుడు రమణ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, రూపాశ్రీ సయ్యద్ ఆలీ, మారేపల్లి జోషి, రేష్మ శివభక్తి గీతాలతో పాటు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ.. నూతన గాయనీ గాయకులను ప్రోత్సహించాలని వారికి వేదిక కల్పించాల్సిన అవసముందన్నారు. గాయకులకు సీనియర్ గాయకుల పాటలను అధ్యయనం చేయాలని సూచించారు. నిర్వాహకుడు రమణ మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే కార్యక్రమంలో నూతన గాయకులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీలోనే కాపులకు ప్రాధాన్యం

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీలోనే కాపు కులంతో పాటు అన్ని కులాలకు ప్రాధాన్యం లభిస్తోందని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. నగరంలో మూడు నియోజకవర్గాల్లో కాపులకు అత్యధికంగా కార్పొరేటర్ సీట్లు కేటాయించి సముచిత స్థానం కల్పించిందన్నారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయం నందు బుధవారం కార్పొరేటర్లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. పచ్చ పత్రికలు పార్టీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. వైఎస్సార్ సీపీపై విమర్శలు చేస్తున్న టీడీపీ నేతలు ఆ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు కాపు జాతికి ఏం చేసిందో చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రి వర్గంలో చోటు దక్కని బోండా ఉమా టీడీపీ కాపుల గొంతు కోసిందని మాట్లాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో కాపులకు పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే విమర్శలు

సీనియర్ కార్పొరేటర్ యలకల చలపతిరావు మాట్లాడుతూ.. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే కాపులకు మంచి జరిగిందన్నారు. వంగవీటి మోహన రంగాను హత్య చేసిన తెలుగుదేశం పార్టీలో ఉండి కాపులమంటూ మాట్లాడే నేతలు దొంగ కాపులని విమర్శించారు. కార్పొరేటర్‌గా పనిచేసిన బాలస్వామి టీడీపీ హయంలో ఒక వీధికి కానీ, ఒక సెంటర్‌కు కానీ కాపు నేతల పేర్లు పెట్టగలిగారా అని నిలదీశారు. ఈ ప్రభుత్వంలో విద్యాధరపురంలోని సితార సెంటర్‌కు వంగవీటి మోహన రంగ జంక్షన్‌గా నామకరణం చేశామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్ని సామాజికవర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు కాపులు సిద్ధంగా ఉన్నారన్నారు. కాపు హాకర్స్ రక్తాన్ని జలగల్లా పీల్చిన వ్యక్తులు బాలస్వామి, బోండా ఉమా అని విమర్శించారు. బోండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన పిల్లలు ఎన్ని అఘాయిత్యాలు చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్ మాట్లాడుతూ రైతుబజార్ల వద్ద చిల్లర దండుకునే నెలిబండ్ల బాల తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు మాట్లాడుతూ జగనన్న హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారన్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి ముద్రగడ పద్మనాభంను ఇబ్బందులు పెట్టినపుడు టీడీపీ కాపులు ఏం చేస్తున్నారని నిలదీశారు. కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, మైలవరపు మాధురి లావణ్య, అత్తలూరి పెద్ద బాబు, నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, పదిలం రాజశేఖర్, వెన్నం రజిని కుమార్, విశ్వనాథ రవి, యశోధర్, బొమ్ము మధు, వాస బాబు, జవ్వాజి వెంకట్రావు, ముత్తా వాసు పాల్గొన్నారు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ మాధురి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం వంటిదని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ మాధురి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యాన డాక్టర్ డీఎస్‌వీఎస్ బాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఓటరు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు కావటంతో పాటు ఇతరులు కూడా ఓటరుగా నమోదు చేయించుకునేలా పోత్సహించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సుకుమార్ డాక్టర్ ఎం.పద్మనాభం, డాక్టర్ కె.రమేష్, శ్రీ చరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి మరింత కృషి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ నందిపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తపేట వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన పౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా శ్రీనివాసరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రావూరి శ్రీనివాసరావు కుటుంబం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకోగా, ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, కండవల్లి త్రినాథ చార్యులు, పరాశరం పవన్‌కుమార్‌లు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి సేవ చేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా మరింత కృషి చేస్తానన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ 48వ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, దుక్కా హరి భాస్కర్, ఉభయదాతలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వీరభద్రశాస్త్రి సాహిత్య సేవలు వెలకట్టలేనివి



వీరభద్రశాస్త్రిని సత్కరిస్తున్న కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

విజయవాడకల్చరల్: సాహితీవేత్త కాలనాథభట్ల వీరభద్రశాస్త్రి సాహిత్యసేవలు వెలకట్టలేనివని కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక సంఘ సభ్యుడు కాలనాథ వీరభద్ర శాస్త్రి అమెరికా సాహితీ ప్రయాణం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వీరభద్రశాస్త్రి కార్యాలయంలో రచయితల సంఘం ప్రతినిధులు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ.. కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా ఆయన వందలాది కార్యక్రమాలు విజయవంతం నిర్వహించారని ఎందరో యువ కవులకు ఆదర్శంగా నిలిచారన్నారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ.. ఆయన పర్యవేక్షణలో రచయితల సంఘం విజయవంతమైన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సంఘ సభ్యురాలు కొరెడ్ల సుశీల పాల్గొన్నారు. నిర్వాహకులు వీరభద్ర శాస్త్రిని ఆత్మీయంగా సత్కరించారు.

డ్వాక్రా మహిళలకు వైద్య పరీక్షలు



డ్వాక్రా మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

పటమట(విజజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ, మెప్మా, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. వన్ టౌన్, న్యూ జైన్ టెంపుల్ ఎదురుగా ఉన్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ బ్రాంచ్‌లో జరిగిన ఈ వైద్య శిబిరంలో పలువురు డ్వాక్రా మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ పరీక్షలకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ షేక్ షహనాజ్ మహిళలకు ఈసీజీ గుండె స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షహనాజ్ మాట్లాడుతూ మహిళల్లో కూడా గుండె జబ్బులు సంఖ్య పెరుగుతుందన్నారు. గుండె జబ్బుల పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనంత వరకు రక్తపోటు, మధుమేహం కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలన్నారు. అధునాతన వైద్య పరీక్షల ద్వారా దాగి ఉన్న గుండె జబ్బులను కనుగొనే టెక్నాలజీ అందుబాటులోనికి వచ్చిందని బి.పి, సుగర్, వంశ పారంపర్యంగా గుండె జబ్బులు ఉన్నవారు ఆ పరీక్ష చేయించుకోవడం ద్వారా దాగినున్న గుండె జబ్బును ముందే గుర్తించి వైద్యం చేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ (జనరల్) కె.శకుంతల హాజరై మాట్లాడుతూ.. పేద మహిళలకు ఉచితంగా ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబుకు, హాస్పిటల్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీడీవో దుర్గాప్రసాద్, మెప్మా అధికారి ఫణి కుమార్, డీఎంసీ మహాలక్ష్మి, సోషల్ వర్కర్ తేజస్వర్, రాజేష్, నాగమణి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి సన్నిధిలో చండీహోమం



విశేష అలంకరణలో అమ్మ వారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన చతుర్ధ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం భక్తిశ్రద్ధలతో హోమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం విశేష హోమాలు, పూజా కార్యాక్రమాలను చేపట్టారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉదయం విశేష చండీహోమం, సాయంత్రం రుద్రహోమం, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నుదురుపాటి ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ్‌లతో పాటు ఇతర అర్చకులు హోమాధి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. అంతకు ముందు కలశ పూజ, విశేష మండప పూజలను జరిపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నేడు లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ

గురువారం మహాలక్ష్మి అమ్మవారిని లక్ష పసుపు కొమ్ములతో విశేష అలంకరణ, సారె సమర్పణ, లక్ష కుంకుమార్చన, కలువ పుష్పాలతో అర్చన జరుగుతుంది. అనంతరం మహా పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

వైఎస్సార్ బీమా అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు చనిపోయిన పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆసరాగా నిలుస్తుందని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్ పరిధిలోని జొన్నలగడ్డ మస్తాన్ వీధిలో నివాసం ఉంటున్న బిట్రా ప్రవీణ్(26) భవానీపురంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పనిలోకి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో మృతి చెందాడు. దీంతో మట్టి ఖర్చులకు రూ.10 వేలను నామినీ అయిన బిట్రా లక్ష్మికి కార్పొరేటర్ గోదావరి గంగ గురువారం అందజేశారు. మిగతా నగదును త్వరలో లక్ష్మి బ్యాంక్ ఖాతాలో డివిజన్ ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, తక్షణ పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన వెబినార్ జరిగింది. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన కెఐ టీ జర్మనీకి చెందిన డి.రామ్మోహన్‌రావు ది క్రానికల్ ఆఫ్ నోబెల్ అవార్డ్స్ అనే అంశంపై చర్చించారు. ఈస్ట్ ఆఫ్రికా యూనివర్సిటీ ఆఫ్ డోడోమ ప్రొఫెసర్ సురేంద్రబాబు కంప్యూటేషనల్ క్వాంటం కెమిస్ట్రీ అనే అంశంపై చర్చించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి నోబుల్ లారెన్స్ పరిశోధనా దృక్పథం, వ్యాక్సిన్ ప్రిపరేషన్, డ్రగ్ డిజైనింగ్‌లో కంప్యూటేషనల్ క్వాంటం కెమిస్ట్రీ ప్రాధాన్యతను వివరించారు. వెబినార్‌లో 400 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో పీబీ సిద్ధార్థ జట్ల సత్తా



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో పీబీ సిద్ధార్థ స్త్రీ, పురుషుల జట్లు సత్తా చాటాయి. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో పురుషుల జట్టు చాంపియన్‌గా నిలవగా, మహిళల జట్టు తృతీయ స్థానాన్ని సాధించింది. మహిళల జట్టులోని టి.లక్ష్మీసాయిదుర్గ యూనివర్సిటీ జట్టులో చోటు దక్కించుకుంది. కళాశాలలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరు జట్ల క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, వ్యాయామ విద్య విభాగాధిపతి ఎ.చినబాబు అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.

ముగ్గురి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: మాచవరం, కృష్ణలంక ప్రాంతాలకు చెందిన మాదిరి అరుణ్‌కుమార్ అలియాస్ పెద్దరాజు, మాదిరి వరుణ్‌కుమార్ అలియాస్ చిన్నరాజు, షేక్ కరీముల్లాల నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు నిందితులు గతంలో పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లారు. జైలు జీవితం అనుభవించిన తరువాత కూడా వీరి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజాజీవనానికి భంగం కలిగిస్తూ పలు అల్లర్లకు పాల్పడుతున్న నేపథ్యంలో వీరి బహిష్కరణను పొడిగించామని సీపీ రాణా పేర్కొన్నారు.

ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెల్ల రేషన్ కార్డ్ కలిగి ఉండి ఇప్పటి వరకు గ్యాస్ కనెక్షన్ లేనివారికి ఉజ్వల పథకం కింద ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్నట్లు శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు తెలిపారు. విద్యాధరపురంలోని శ్రీభవానీ గ్యాస్ కంపెనీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉజ్వల పథకం లబ్ధిదారులకు వంట గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. అనంతరం శ్రీహరిబాబు మాట్లాడుతూ వంట గ్యాస్ కనెక్షన్ లేకుండా ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో నిరుపేద వర్గాల ప్రజల కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల పథకంలో భాగంగా ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్నామన్నారు. సమావేశంలో భారత్ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ మంకేష్ షా, శ్రీభవానీ గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి 'ఆర్టీఐ' దోహదం

మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



సమాచార చట్టంపై ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అవినీతిరహిత సమాజ నిర్మాణానికి సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) దోహదపడుతుందని సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. 'జనం' మాస పత్రిక ముద్రించిన సమాచార హక్కు చట్టం ప్రత్యేక సంచికను మొగల్రాజపురంలోని మీడియా అకాడమీ కార్యాలయంలో కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. కొమ్మినేని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంగా అమలు చేస్తోందన్నారు. సిఫార్సులతో నిమిత్తం లేకుండా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. అందుకు ఆర్టీఐ చట్టం సహాయకారిగా నిలుస్తోందన్నారు. ఆర్టీఐ చట్టం సహాయంతో ప్రశ్నించేతత్వాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు.

ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో ఏం జరుగుతుందో తెలుకునే హక్కు ప్రతి పౌరుడికి దక్కిందన్నారు. ఆర్టీఐ చట్టం దరఖాస్తులు, అప్పీళ్లు చేసే విధానం, కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్లు, న్యాయస్థానాల తీర్పులు, దరఖాస్తుదారుల విజయాలు మొదలైన విషయాలను ఈ ప్రత్యేక సంచికలో పొందుపరచడం అభినందనీయమన్నారు. మీడియా అకాడమీ సెక్రటరీ ఎం.బాల గంగాధర్ తిలక్, జనం మాసపత్రిక అసోసియేట్ ఎడిటర్ వెంకటరమణ, ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త షేక్ నజీర్ పాల్గొన్నారు.

2 నుంచి స్పెషల్ క్యాంపెయిన్

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రత్యేక సంక్షిప్త ఓటరు సవరణలో భాగంగా వచ్చే నెల 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాంపెయిన్‌లో భాగంగా బీఎల్వోలు ఆ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి నమోదవుతున్న అభ్యంతరాలు, క్లయిమ్స్ పరిష్కరిస్తామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన నాటి నుంచి అభ్యంతరాలు, క్లయిమ్స్, కొత్త ఓటర్లకు సంబంధించిన ఫారాలు స్వీకరిస్తున్నామన్నారు. పారదర్శకతతో కూడిన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన



సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం సహస్ర లింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు జరిపించిన అనంతరం విశేషంగా అలంకరించారు. స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

సాయంత్రం అమ్మవారి పంచ హారతుల అనంతరం స్వామి వారికి హారతుల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవ, దీపార్చన సేవ నిర్వహించారు. దీపార్చనలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి



స్కూల్ విద్యార్థులతో పీబీ సిద్ధార్థ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని దాత రౌతు శ్రీనివాస్ సూచించారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో బుధవారం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన విద్యార్థులకు వర్క్‌బుక్స్, జామెంట్రీ బాక్సులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమం సమన్వయకర్త పెదపూడి సుభాకర్, పూర్వ విద్యార్థి అనిల్ మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని సూర్యప్రభ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరెడ్డి, ఎల్.విజయలక్ష్మి, కె.రాణి, టి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు తెలంగాణలో ఎన్నికలు

- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం మొదలుకానుంది. ఈ మేరకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. వామపక్ష తీవ్రవాద ప్రభావమున్న 13 స్థానాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. మిగతా 106 చోట్ల ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను ప్రకటిస్తారు. మిగతా ప్రక్రియల పూర్తి అనంతరం డిసెంబర్ 5తో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. రాష్ట్రంలో 1,63,01,705 మంది మహిళలు, 1,62,98,418 మంది పురుషులు, 2,676 మంది మూడో జెండర్ ఓటర్లు కలిపి మొత్తంగా 3,26,18,205 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో కలిపి 2,067 మంది పురుష అభ్యర్థులు, 222 మంది మహిళా అభ్యర్థులు, మూడో జెండర్ అభ్యర్థి ఒకరు కలిపి మొత్తం 2,290 మంది ఎన్నికల్లో పోటీపడుతున్నారు.

తెలంగాణలో ఓటున్న ఉద్యోగులకు నేడు సెలవు

సీఈవో ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: తెలంగాణలో ఓటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా గురువారం వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ప్రకటించారు. ఇందుకోసం ఆయా ఉద్యోగులు తమ ఓటరు గుర్తింపు కార్డును సమర్పించి ఈ సెలవు పొందాలని ఉత్తర్వుల్లో మీనా స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖేశ్ కుమార్ మీనా ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ ఎన్నికలకు 5,190 మంది ఏపీ పోలీసులు

సాక్షి, అమరావతి: తెలంగాణ ఎన్నికల బందోబస్తు కోసం ఆంధ్రప్రదేశ్ పోలీసు బలగాలు భారీగా తరలివెళ్లాయి. దాంతోపాటు అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే వెళ్లేందుకు రిజర్వ్ బలగాలను కూడా సిద్ధంగా ఉంచారు. తెలంగాణ శాసనసభకు గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 5,190మంది పోలీసు అధికారులు, సిబ్బందిని తెలంగాణ ఎన్నికల విధుల కోసం కేటాయించారు. వారిలో అసిస్టెంట్ కమాండెంట్లు– ఇద్దరు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు–10 మంది, రిజర్వ్ ఎస్‌ఐలు–8మంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్‌ఐలు 118మంది, హెడ్ కానిస్టేబుళ్లు 842మంది, కానిస్టేబుళ్లు 2,208 మంది, హోమ్‌గార్డులు 1,998మంది, సబ్ ఆర్డినేట్ సర్వీస్ ఉద్యోగులు నలుగురు ఉన్నారు.

ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోండి

ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల రూపకల్పనలో అక్రమాలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాను కోరారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, బొండా ఉమా, పయ్యావుల కేశవ్‌లు ఆయన్ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కుట్ర పూరితంగా అర్హుల ఓట్లు తొలగించి, దొంగ ఓట్లు నమోదు చేయిస్తోందని తెలిపారు. వీటిపై తాము ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే త్వరలో రాష్ట్రానికి రానున్న కేంద్ర ఎన్నికల బృందానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

భక్తుల రక్షణకు ఏం చర్యలు తీసుకున్నారు?

- వారం రోజుల్లో బాలిక కుటుంబానికి పరిహారం చెల్లించాలి
- టీటీడీని ఆదేశించిన హైకోర్టు


సాక్షి, అమరావతి: తిరుమల నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి భక్తులకు రక్షణ కల్పించే విషయంలో వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని హైకోర్టు టీటీడీని ఆదేశించింది. చిరుత దాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి నిర్దిష్టమైన పరిహారం చెల్లించాలంటూ తాము ఇచ్చిన ఆదేశాలను ఇప్పటివరకు టీటీడీ అమలు చేయకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. వారంలోపు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వన్యప్రాణుల సంచారం భక్తులకు ప్రమాదంగా మారుతున్న నేపథ్యంలో అలిపిరి నుంచి తిరుమల వరకు నడక దారి వెంట ఇనుప కంచె ఏర్పాటు చేసేలా టీటీడీ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తిరుపతికి చెందిన బీజేపీ నేత గుడిపల్లి భానుప్రకాశ్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అటవీ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది ఖాసిం సాహెబ్, పిటిషనర్ తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

అప్పులపై ఎల్లో బ్యాచ్‌ది తప్పుడు ప్రచారమే

రాష్ట్రాల అప్పులపై నివేదిక విడుదల చేసిన ఆర్బీఐ

- అప్పుల్లో మొదటి స్థానంలో ఉన్న తమిళనాడు
- ఆ తర్వాత స్థానాల్లో యూపీ, మహారాష్ట్ర, బెంగాల్, కర్ణాటక
- ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- 2023 మార్చికి రాష్ట్ర అప్పులు రూ.4,42,442 కోట్లు
- చంద్రబాబు హయాం (2018–19)లో అప్పుల వృద్ధి 15.3 శాతం
- 2022–23లో అప్పుల వృద్ధి 12.4 శాతం మాత్రమే

2022-23 మార్చి నాటికి వివిధ రాష్ట్రాల మొత్తం అప్పులు ఇలా..



సాక్షి, అమరావతి: అప్పులతో రాష్ట్రం మరో శ్రీలంక లాగ అయిపోతోందని కొండంత రాగాలు తీస్తున్న ఎల్లో బ్యాచ్‌కు షాక్ తగిలింది. తెలుగుదేశం పార్టీ నేతలు, ఎల్లో మీడియా నిత్యం చేస్తున్న ప్రచారాలన్నీ పచ్చి అబద్ధాలని ఆర్బీఐ నివేదిక ద్వారా స్పష్టమైంది. 2022–23 ఆర్థిక సంవత్సరం మార్చి నాటికి దేశంలోని ఏ రాష్ట్రానికి ఎన్ని అప్పులున్నాయి, ఎంత మేర అప్పులు పెరుగుతున్నాయి, ప్రభుత్వ గ్యారెంటీ అప్పుల ఎన్ని? అనే వివరాలతో కూడిన నివేదికను ఆర్బీఐ బుధవారం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు వాస్తవాలను చెప్పినప్పటికీ కూడా టీడీపీ, ఎల్లో మీడియా మాత్రం రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిపోయిందంటూ పదే పదే దుష్ప్రచారం చేయడం తెలిసిందే. ఇప్పుడు స్వయంగా ఆర్బీఐనే రాష్ట్రాల అప్పుల వివరాలు వెల్లడించడంతో వాస్తవాలు ప్రజలు తెలుసుకుని, ఎల్లో బ్యాచ్‌ది తప్పుడు ప్రచారం అని అర్థం చేసుకునే అవకాశం కలిగింది.

ప్రభుత్వ గ్యారెంటీ అప్పులపైనా తప్పుడు రాతలే..

ప్రభుత్వ గ్యారెంటీ ద్వారా వివిధ సంస్థలు తీసుకున్న అప్పులపై కూడా విపక్ష నేతలు దుష్ప్రచారం చేయడమే కాకుండా, ఎల్లో మీడియా తప్పుడు వార్తలు ప్రచురిస్తోంది. అప్పులను దాచేస్తున్నారంటూ వింత పోకడలు పోతున్నారు. ప్రభుత్వాల అప్పులు దాచడానికి అవకాశం ఉండదనే కనీస జ్ఞానం లేకుండా ఎల్లో మీడియా వార్తలు రాస్తోందని నిపుణులు మండిపడుతున్నారు. నిజానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీల ద్వారా వివిధ సంస్థలు తీసుకున్న అప్పులు రూ.1,17,503 కోట్లు మాత్రమేనని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది. అలాగే పొరుగు రాష్ట్రమైన తెలంగాణ ప్రభుత్వం గ్యారెంటీ ద్వారా వివిధ సంస్థలు చేసిన అప్పులు రూ.1,35,282 కోట్లుగా ఆ నివేదిక పేర్కొంది.

'అప్పు'డే ఎక్కువ

రాష్ట్రాల అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉందని ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. ఇక అప్పుల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా.. ఆ తరువాత వరుస స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అప్పులు ఎక్కువ చేస్తోందంటూ టీడీపీ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆర్బీఐ నివేదిక ద్వారా స్పష్టమైంది. అంతేకాదు.. చంద్రబాబు హయాంలో అప్పుల వృద్ధి ఎక్కువ ఉందని స్పష్టమైంది. 2018–19లో చంద్రబాబు హయాంలో అప్పుల వృద్ధి 15.3 శాతంగా ఉందని ఆర్బీఐ నివేదిక పేర్కొంది. ఆ తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అది క్రమంగా తగ్గుతూ వస్తోందని, అప్పుల వృద్ధి 2020–21లో 14.7 శాతం, 2021–22లో 11.5 శాతం, 2022–23లో 12.4 శాతం ఉందని ఆర్బీఐ నివేదిక పేర్కొంది. 2018–19లో చంద్రబాబు ప్రభుత్వంలో అప్పుల వృద్ధి కన్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పులు వృద్ధి తక్కువగా ఉందంటే అప్పులు తక్కువగా చేస్తున్నట్టేనని స్పష్టం అవుతోందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

చెప్పేవన్నీ అబద్ధాలే..

రాష్ట్ర అప్పు 10 లక్షల కోట్లు అని ఓసారి, 11 లక్షల కోట్లు అని మరోసారి రోజుకో మాట మారుస్తూ టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమైంది. 2022–23 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.4,42,442 కోట్లు మాత్రమేనని ఆర్బీఐ నివేదిక తెలిపింది. ఇకనైనా టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వాస్తవాలను తెలుసుకుంటే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

ఎంపీ నందిగం సురేష్‌పై దాడికి యత్నం

అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంటిపైకి వెళ్లి మహిళలను బూతులు తిడుతూ అసభ్య ప్రవర్తన

తాడికొండ: బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌పై మద్యం మత్తులో మంగళగిరికి చెందిన ఓ యువకుడు దాడికి యత్నించాడు. నివాసంలోకి చొరబడేందుకు యత్నించి అడ్డుకున్న సెక్యూరిటీ గార్డును తోసేసి అసభ్యంగా ప్రవర్తించాడు. మంగళగిరి బాప్టిస్టు పేటకు చెందిన మేరిబాబు అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఎంపీ నందిగం సురేష్ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించాడు. మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. అడ్డుకున్న గార్డును అసభ్య పదజాలంతో దూషిస్తూ నానా హంగామా చేశాడు. ఎంపీ ఇంట్లో లేకపోవడంతో సిబ్బంది ఎంపీ ఇంట్లో లేరని చెప్పడంతో.. మహిళలను బూతులు తిట్టాడు. ఎంపీ సోదరుడు రాగా, 'నిన్ను, నీ తమ్ముడిని ఇద్దరినీ లేపేస్తా.. దమ్ముంటే రండిరా.. నాకు టీడీపీ మద్దతు ఉంది.. మీరెంతరా..' అంటూ మహిళలపై దాడికి దిగాడు. ఇతని వలన ఎంపీ నందిగం సురేష్‌కు ప్రాణహాని ఉందని ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంపేస్తామంటూ టీడీపీ నేతల ఫోన్

ఇదిలా ఉండగా, ఎంపీ నందిగం సురేష్‌ను చంపేస్తామంటూ టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగి అసభ్య వాయిస్, టెక్ట్స్ మెసేజ్‌లు పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించడంతో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచి విడుదల చేసిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న రాత్రి 9:20 గంటల సమయంలో 8247535833 నంబరు నుంచి రవికాంత్ అనే వ్యక్తి ఎంపీకి ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. ఎందుకు తిడుతున్నావ్ బ్రదర్.. అని అడిగేలోగా నిన్ను చంపేస్తామంటూ బెదిరించారు. అనంతరం రవికాంత్ తన స్నేహితులు కొడాలి రామరాజు, వినయ్, నాగబాబు, రాజు అనే వారికి ఫోన్ ఇచ్చి బూతులు తిట్టించాడు. వివాదం ఎందుకులే అని భావించి ఎంపీ ఫోన్ కట్ చేశారు. మళ్లీ అదే నంబర్ నుంచి అసభ్య వాయిస్, టెక్ట్స్ మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఎంపీ సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రవికాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే అక్రమ అరెస్టు అంటూ టీడీపీ వర్గీయులు మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆ అధికారుల సంగతి తేలుస్తాం

- చంద్రబాబును ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టబోం
- ముమ్మిడివరం సభలో నారా లోకేశ్ వ్యాఖ్యలు


మాట్లాడుతున్న లోకేశ్


ముమ్మిడివరం/తాళ్లరేవు: చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించిందని, దీనికి సహకరించిన అధికారులపై తమ ప్రభుత్వం వచ్చిన తరువాత జ్యుడీషియల్ విచారణ జరిపి బాధ్యులైన అధికారుల సంగతి తేలుస్తానని టీడీపీ నేత నారా లోకేశ్ హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని మార్కెట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ప్రభుత్వం చూసిందని, తీరా వారిని ఎన్నికల విధుల్లో పాల్గొనవచ్చని ఈసీ చెప్పడంతో ప్రభుత్వం మరింతగా ఉపాధ్యాయులపై కక్ష సాధిస్తోందని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లో ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, బహిరంగ సభలో ప్రభుత్వంపై లోకేశ్ అర్థరహిత ఆరోపణలు చేయడంతో ప్రజల్లో అసహనం వ్యక్తమైంది. దీంతో లోకేశ్ మాట్లాడుతుండగానే జనం వెనుతిరిగారు. షెడ్యూల్ ప్రకారం స్థానిక డ్వాక్రా మహిళలతోనూ, పల్లిపాలెంలో దళిత యువకులతో లోకేశ్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని టీడీపీ ఏర్పాటు చేసింది. అయితే దీనికి మహిళలు, యువకులు హాజరుకాకపోవడంతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేశారు. పాదయాత్ర ముమ్మిడివరం నుంచి పల్లిపాలెం, నడిమిల్లంక, కొమానపల్లి, అన్నంపల్లి మీదుగా మురమళ్ల చేరుకుంది.

జనసేన కార్యకర్తల్లో నిరాశ

లోకేశ్ బస చేసిన టీటీఆర్ నగర్ లేఅవుట్‌లో ఆయనను ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణతో పాటు జనసేన నేతలు, కార్యకర్తలు కలిశారు. పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో కష్టపడి పనిచేస్తున్నానని చెప్పుకొంటూ తమకు న్యాయం చేయాలని కోరారు. లోకేశ్ పెద్దగా స్పందించకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

తహసీల్దార్, బీఎల్‌వోలపై టీడీపీ నేతల దాష్టీకం

- టీడీపీ సానుభూతిపరుల డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించొద్దంటూ దౌర్జన్యం
- వైఎస్సార్‌సీపీ అభిమానుల ఓట్లు తీసివేయాలంటూ కుప్పలు తెప్పలుగా దరఖాస్తు
- తహసీల్దార్ షేక్ జాన్‌సైదులుపై మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు బెదిరింపు



బొల్లా పేరయ్యకు గుంటూరు, వేల్పూరులో ఓటు ఉన్నట్లు చూపుతున్న ఎపిక్ నంబర్లు


తహసీల్దార్‌పై దౌర్జన్యం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

సాక్షి, నరసరావుపేట/శావల్యాపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించేందుకు నోటీసులు ఇచ్చిన శావల్యాపురం తహసీల్దార్‌పై పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. టీడీపీ సానుభూతిపరులు డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగిస్తే న్యాయపరంగా చిక్కులు ఎదుర్కొంటారంటూ తహసీల్దార్, బీఎల్‌వోలను బెదిరించారు. పదుల సంఖ్యలో కార్యకర్తలను వెంటబెట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి తహసీల్దార్ షేక్ జాన్ సైదులుపై అసభ్య పదాలతో దూషణలకు దిగారు. వైఎస్సార్‌సీపీ అభిమానుల ఓట్లు తీసివేయాలని భారీగా ఫారం–7లను దరఖాస్తు చేసి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ దరఖాస్తు చేసిన ఫారం–7 దరఖాస్తులు దురుద్దేశంతో చేసినవని అధికారులు నిర్ధారణకు వచ్చిన తర్వాత తగిన అధారాలతో తిరస్కరించినట్టు సమాచారం ఇచ్చారు. అయితే.. వాటిని తొలగించాల్సిందేనని జీవీ ఆంజనేయులు పట్టుబట్టారు. గట్టిగా కేకలు వేస్తూ తహసీల్దార్‌పై జులుం ప్రదర్శించారు.

పోలింగ్ కేంద్రం మార్పుడంపైనా రాజకీయం

మండలంలోని గుంటుపాలెంలో 141 పోలింగ్ కేంద్రం గతంలో ప్రాథమిక పాఠశాలలో ఉండేది. పాఠశాల గదులు పాడవడం, శ్లాబు పెచ్చులు ఊడిపోతుండటం, కనీస వసతులు లేకపోవడంతో పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అదే గ్రామంలో అన్ని సౌకర్యాలున్న సచివాలయంలోకి మార్చారు. దీనిపైనా జీవీ ఆంజనేయులు రాద్ధాంతం చేశారు. మరోవైపు టీడీపీ నేతలు పలువురికి వినుకొండ నియోజకవర్గంతో పాటు గుంటూరు, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి చోట్ల ఓట్లు ఉంటున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం నుంచి వచ్చిన సమాచారం మేరకు సదరు ఓటర్లకు స్థానిక అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులు ఇవ్వడంపై జీవీ ఆంజనేయులు తహసీల్దార్‌పై విరుచుకుపడ్డారు. డబుల్ ఎంట్రీలు తొలగిస్తే చూస్తు ఊరుకోనంటూ ఊగిపోయారు. కాగా.. విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులపై దుర్భాషలాడటం, బెదిరించడం సరికాదని జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఇలాంటి దాడులను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అసభ్య పదజాలంతో దూషించటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఇష్టానుసారంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓట్లు తొలగింపు, మార్పులు చేర్పులన్నీ సమగ్ర ఆధారాలతో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్నాయన్నారు.

'కొట్టు'పై పిల్ కొట్టివేత

టీడీపీ నేత మల్లికార్జునరావుకు రూ.50వేల కాస్ట్

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను లక్ష్యంగా చేసుకుంటూ టీడీపీ నేత వలవల మల్లికార్జునరావు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యాజ్యాన్ని రాజకీయ ప్రేరిత వ్యాజ్యంగా హైకోర్టు అభివర్ణించింది. ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన మల్లికార్జునరావుకు రూ.50 వేలను కాస్ట్ (ఖర్చులు) కింద విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, కడకట్ల రెవిన్యూ గ్రామ పరిధిలో గణేష్ నగర్ నుంచి జాతీయ రహదారి వరకు కొత్త రోడ్ వేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. దీనిపై పలు అభ్యంతరాలు తెలుపుతూ స్థానిక టీడీపీ నేత వలవల మల్లికార్జునరావు అధికారులకు వినతిపత్రమిచ్చారు. అధికారులు తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ మల్లికార్జునరావు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సోమరాజు వాదనలు వినిపించారు. ధర్మాసనం స్పందిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా కూడా రోడ్డు వేస్తున్నారంటే అది అభివృద్ధిలో భాగమే అవుతుందని వ్యాఖ్యానించింది. రోడ్డు సమీపంలో మంత్రి కుటుంబ సభ్యులకు భూములున్నాయని సోమరాజు తెలిపారు. కొట్టు కోసం రోడ్డు వేస్తున్నారనేందుకు ఆధారాలు ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ ఎవరని ప్రశ్నించింది. మాజీ కౌన్సిలర్ అని సోమరాజు చెప్పగా, అయితే ఇది కచ్చితంగా రాజకీయ ప్రేరిత వ్యాజ్యమని ధర్మాసనం తేల్చింది. ఈ వ్యాజ్యాన్ని కాస్ట్‌తో కొట్టేస్తామని పేర్కొంటూ ఆ మేరకు ఉత్తర్వులిచ్చింది.

సుప్రీం తీర్పును ఎందుకు అమలు చేయడం లేదు?: హైకోర్టు

సాక్షి, అమరావతి: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ప్రకారం పౌరులు సమాచారం తెలుసుకునేందుకు ఆర్‌టీఐ వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడంలేదని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వెబ్‌పోర్టల్ ఏర్పాటుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని, ఈ విషయంలో స్థాయీ నివేదిక ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. వెబ్‌పోర్టల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ హైకోర్టు న్యాయవాది వీవీఎస్ఎస్ శ్రీకాంత్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

నోటీసులు అందని వారికి మీరే అందజేయండి

- చంద్రబాబు 'స్కిల్' కేసులో ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు హైకోర్టు వెసులుబాటు
- విచారణ డిసెంబర్ 13కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో నోటీసులు అందని వారికి వాటిని ఆయనే అందజేయవచ్చని హైకోర్టు వెసులుబాటునిచ్చింది. నోటీసులు అందుకున్న రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలనుకుంటే దాఖలు చేయవచ్చని తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు హయాంలో జరిగిన ఈ కుంభకోణంలో అనేక క్లిష్టమైన అంశాలు ఉన్నందున సీబీఐ దర్యాప్తు చేయడమే సబబుగా ఉంటుందంటూ ఉండవల్లి అరుణ్ కుమార్ ఇటీవల హైకోర్టులో దాఖలు చేసిన ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. సరైన చిరునామాలు లేకపోవడం వల్ల పలువురికి నోటీసులు అందలేదని ధర్మాసనం తెలిపింది. ఉండవల్లి తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి స్పందిస్తూ.. సీఐడీ వద్ద అందరి చిరునామాలు ఉంటాయని, అందువల్ల నోటీసులు అప్పగించే బాధ్యతను సీఐడీకి అప్పగించాలని కోరారు. మీరు చేయాల్సిన పనిని వారికి అప్పగించడం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. అలా అయితే ప్రతివాదులకు వ్యక్తిగతంగా నోటీసులు అందచేసే వెసులుబాటును తమకు ఇవ్వాలని కృష్ణమూర్తి కోరగా ధర్మాసనం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. తమకు నోటీసులు అందినందున కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. సీబీఐ తరఫు న్యాయవాది యజ్ఞదత్ స్పందిస్తూ.. తాము కౌంటర్ దాఖలు చేయబోమని, కోర్టు ఏం ఆదేశాలు ఇస్తే వాటికి అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. ఈ వ్యాజ్యంలో చంద్రబాబు తరఫున గింజుపల్లి సుబ్బారావు వకాలత్ దాఖలు చేశారని న్యాయవాది రాహుల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

బౌద్ధ మత ఆనవాళ్లు తేల్చండి

ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం భీమునిపట్నం మండలం తొట్లకొండ వద్ద గల బౌద్ధక్షేత్రం పరిధిలో ప్రభుత్వం డీ–నోటిఫై చేసిన భూమిలో సర్వే చేయాలని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)ను హైకోర్టు ఆదేశించింది. ఆ భూమిలో బౌద్ధ మతానికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయేమో తేల్చాలని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొట్లకొండ బౌద్ధ క్షేత్రం పరిధిని తగ్గిస్తూ ప్రభుత్వం 2021లో జీవో 131 జారీ చేసిందని, ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ పర్యావరణవేత్త ఎల్.రాజశర్మ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. తొట్లకొండ బౌద్ధ క్షేత్రానికి చారిత్రక ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో సర్వే చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరిస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఒకరికి ఒక చోటే ఓటుండాలి

- కొందరికి రెండు, మూడుచోట్ల ఉండటాన్ని గుర్తించాం
- తెలంగాణ, ఇతర దేశాల్లో ఉన్న వారికీ ఏపీలో ఓట్లు ఉన్నాయి
- ఆధార్ కార్డు ఎక్కడుంటే అక్కడే ఓటు ఉండటం న్యాయం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వైఎస్సార్‌సీపీ బృందం ఫిర్యాదు
- ఎన్నికల్లో ఓడిపోతామనే దొంగ ఓట్లు అంటూ పచ్చ పత్రికలు రాస్తున్నాయన్న మంత్రులు జోగి రమేష్, మేరుగు నాగార్జున
- ఒక రోజు లక్షల ఓట్లు చేర్పించామంటారని.. మరో రోజు తొలగించారంటారని ఎద్దేవా
- వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఉరికెత్తించి ఓడిస్తామని వెల్లడి


ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న మంత్రులు జోగి రమేష్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యంలో ఒకరికి ఒక చోట మాత్రమే ఓటు ఉండాలని.. ఇది వైఎస్సార్‌సీపీ సిద్ధాంతమని మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్ స్పష్టం చేశారు. ఓటర్ల ముసాయిదా జాబితాలో కొందరికి రెండు, మూడుచోట్ల ఓట్లు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణతో పాటు విదేశాల్లో ఉన్న వారికి సైతం ఇక్కడ ఓట్లు ఉన్నాయన్నారు. వాస్తవానికి ఆధార్ కార్డు ఎక్కడ ఉంటే.. అక్కడే ఓటు హక్కు ఉండటం న్యాయమని స్పష్టం చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అవకతవకలు, డూప్లికేట్ ఓట్లు, డీ రిజిస్ట్రేషన్ (తెలంగాణ), ఓటర్ల రీఎన్‌రోల్‌మెంట్ (ఆంధ్రప్రదేశ్) అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కూడిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖేష్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

తొలగించారని ఒకరోజు.. చేర్పించారని మరో రోజు: మంత్రి రమేష్

ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని.. కానీ.. ఒకే వ్యక్తికి రెండు, మూడుచోట్ల ఓట్లు ఉన్నట్టు తమ పార్టీ గుర్తించిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రెండుచోట్ల కొందరికి ఓట్లు ఉన్నట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. ఇలాంటివి కొన్ని తాము గుర్తించామని.. వాటి గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయలేని టీడీపీ నేతలు కొందరు తమ పార్టీపై రోజూ ఎల్లో మీడియాలో వార్తలు రాయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సిబ్బంది లక్షల ఓట్లు తొలగించారని ఒక రోజు.. లక్షల ఓట్లు చేర్పించారని ఇంకో రోజు రాస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎలాగూ ఓడిపోతామని తెలిసే టీడీపీ అనుకూల పచ్చమీడియా అలాంటి రాతలు రాస్తోందన్నారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత 70 రోజులు పత్తా లేకుండా పారిపోయిన లోకేశ్, మంత్రులకు భయం చూపెడతానంటున్నాడని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమన్నారు.

పీపుల్స్ యాక్ట్ ప్రకారం చర్యలు కోరాం: మంత్రి మేరుగు నాగార్జున

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. గత నెలలో ఎన్నికల సంఘానికి వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు చోట్ల 16 లక్షలకు పైగా ఓటర్లుగా నమోదయ్యారన్నారు. అలాంటి వాటిని తొలగించాలని కోరామన్నారు. 1950 పీపుల్స్ యాక్ట్ సెక్షన్–17 ప్రకారం ఏ నియోజకవర్గంలో అయినా ఒక వ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్నారు. దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరామన్నారు. తెలంగాణలో ఈ నెల 30న ఎన్నికలు జరుగుతున్నాయని, అక్కడ ఓటు హక్కు వినియోగించుకుని, అక్కడ ఓట్లు క్యాన్సిల్ చేయించుకుని ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకునేలా కొందరు చూస్తున్నారన్నారు. పక్క రాష్ట్రాల్లో ఇప్పుడు ఓటు వేసి.. ఆ తర్వాత మన రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయడానికి వచ్చే వారిపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని కోరినట్టు వివరించారు. ఈ మేరకు అధికారులకు క్లియర్‌గా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అనేది తమ నినాదమన్నారు. యుద్ధానికి రాకుండానే.. అస్త్ర సన్యాసం చేసే సన్నాసులు ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు, పవన్ కళ్యాణే అని మేరుగ ఎద్దేవా చేశారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


శ్రీకాకుళం జిల్లా బూరగాంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు


కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాకాడులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మయ్య, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి


పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డు ఆవిష్కరిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


విజయనగరం జిల్లా పేరిపి కిల్తాలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, పార్టీ నాయకులు


చిత్తూరులోని సాంబయ్య కండ్రిగలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద


గుంటూరు జిల్లా మంగళగిరిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత గంజి చిరంజీవి, నాయకులు


వైఎస్సార్ జిల్లా బద్వేలు సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ


ఒంగోలు నగరంలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు


ఎన్టీఆర్ జిల్లా దుందిరాలపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి తదితరులు

జలసిరుల సీమ

అత్యాధునిక పరిజ్ఞానంతో అవుకు రెండో సొరంగం పూర్తి.. నేడు జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

- గాలేరు-నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులు తరలించేందుకు లైన్ క్లియర్
- కేవలం 15 రోజుల్లోనే గండికోట రిజర్వాయర్ నింపేందుకు మార్గం సుగమం
- రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- 640 గ్రామాల్లో 20 లక్షల మంది తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- వరద రోజుల్లోనే గాలేరు-నగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా ప్రణాళిక
- వరద కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కులకు పెంపు పనులు వేగవంతం
- అవుకు వద్ద పూర్తి కావస్తున్న మూడో సొరంగం.. ఇక మిగిలింది కేవలం 1.275 కి.మీ పనులే
- శరవేగంగా గాలేరు-నగరి రెండో దశ
- గండికోట నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో పునరావాసం
- 2019 నుంచి నాలుగేళ్లుగా గండికోటలో 26.85 టీఎంసీల నిల్వ
- పైడిపాలెం, వామికొండ, సర్వారాయసాగర్, చిత్రావతి రిజర్వాయర్లలోనూ పూర్తి స్థాయిలో నీటి నిల్వ
- నాడు ఎన్నికల భయంతో రెండుసార్లు గాలేరు-నగరికి చంద్రబాబు పునాదిరాయి
- తొమ్మిదేళ్లు తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా పురిటిగడ్డకు ద్రోహం చేసిన బాబు
- అవుకు సొరంగాల్లో ఫాల్ట్ జోన్‌లో పనులు చేయలేక చేతులెత్తేసిన వైనం

సాక్షి, అమరావతి: దుర్భిక్ష రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో సాగునీటిని పారించి సుభిక్షం చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేశారు. గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగం (టన్నెల్) ఫాల్ట్ జోన్‌లో పనులు అసాధ్యమని నాడు చంద్రబాబు చేతులెత్తేయగా నేడు ముఖ్యమంత్రి జగన్ దాన్ని సుసాధ్యం చేస్తూ అత్యాధునిక పరి/ాానంతో పూర్తి చేశారు. గాలేరు-నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్‌ను ముఖ్యమంత్రి జగన్ గురువారం జాతికి అంకితం చేయనున్నారు. తద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు-నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు మార్గం సుగమం చేశారు. అవుకు సొరంగాల పనులకు వైఎస్సార్ హయాంలో రూ.340.53 కోట్లు వెచ్చించి సింహభాగం పూర్తి చేయగా 2014–19 మధ్య చంద్రబాబు సర్కారు రూ.81.55 కోట్లు మాత్రమే వ్యయం చేసి ఫాల్ట్ జోన్‌లో పనులు చేయకుండా చేతులెత్తేసింది. ముఖ్యమంత్రి జగన్ రూ.145.86 కోట్లు ఖర్చు చేసి టన్నెల్ 2 పనులను దిగ్విజయంగా పూర్తి చేశారు. మరోవైపు టన్నెల్ 3 పనుల కోసం ఇప్పటివరకు మరో రూ.934 కోట్లు వెచ్చించి దాదాపు తుదిదశకు తెచ్చారు. అవుకు వద్ద చేపట్టిన మూడో సొరంగం పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మొత్తం 5.801 కి.మీ. పొడవైన మూడో టన్నెల్‌లో ఇప్పటికే 4.526 కి.మీ. పొడవైన పనులను పూర్తి చేయడం గమనార్హం. ఇక కేవలం 1.275 కి.మీ పనులు మాత్రమే మిగిలాయి. మొత్తం మూడు టన్నెళ్ల కోసం ఇప్పటిదాకా రూ.1,501.94 కోట్లు వ్యయం చేయగా వీటి ద్వారా 30 వేల క్యూసెక్కుల నీటిని తరలించే వెసులుబాటు కలగనుంది. పెన్నా డెల్టాకు జీవనాడులైన నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను ఇప్పటికే పూర్తి చేసి గతేడాది సెప్టెంబరు 6న జాతికి అంకితం చేయగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పశ్చిమ మండలాలకు తాగు, సాగునీటిని అందించే లక్ష్యంతో హంద్రీ-నీవా నుంచి 77 చెరువులను నింపే ఎత్తిపోతలను పూర్తి చేసి సెప్టెంబరు 19న సీఎం జగన్ జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే.

2.60 లక్షలకు సాగునీరు.. 20 లక్షల మందికి తాగునీరు

శ్రీశైలానికి వరద వచ్చే సమయంలో రోజుకు 20 వేల క్యూసెక్కుల చొప్పున 30 రోజుల్లో 38 టీఎంసీలను తరలించి ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 20 లక్షల మందికి తాగునీటిని అందించే దివంగత వైఎస్సార్ 2005లో గాలేరు-నగరి సుజల స్రవంతిని చేపట్టారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 57.7 కి.మీ. పొడవున వరద కాలువ, దీనికి కొనసాగింపుగా అవుకు రిజర్వాయర్ వద్ద కొండలో 5.7 కి.మీ. పొడవున 16 మీటర్ల వ్యాసంతో ఒక సొరంగం తవ్వకం పనులు చేపట్టారు. మట్టి పొరలు బలహీనంగా ఉన్నందున పెద్ద సొరంగం తవ్వితే కుప్పకూలే ప్రమాదం ఉందని కేంద్ర భూగర్భ శాస్త్రవేత్తలు నాడు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో ఒక సొరంగం స్థానంలో 11 మీటర్ల వ్యాసంతో 5.7 కి.మీ. పొడవున, పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో రెండు చిన్న సొరంగాల తవ్వకం పనులు చేపట్టారు. వైఎస్సార్ హయాంలోనే వరద కాలువ తవ్వకంతోపాటు రెండు సొరంగాలలో చాలా వరకు పనులు పూర్తయ్యాయి.

పక్షం రోజుల్లోనే గండికోట దాహార్తి తీర్చేలా

హిమాలయాలలో రహదారులు, సైనికుల అవసరాల కోసం సొరంగాల తవ్వకాలకు అనుసరిస్తున్న పాలీ యురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ విధానాన్ని అధ్యయనం చేసిన జలవనరుల శాఖ అధికారులు ఆ నిపుణులను రాష్ట్రానికి రప్పించారు. అవుకు రెండో సొరంగంలో 165 మీటర్ల ఫాల్ట్ జోన్‌లో తవ్వకం పనులు చేపట్టి పాలీయురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ విధానంలో విజయవంతంగా పూర్తి చేశారు. ఇప్పటికే పూర్తైన మొదటి సొరంగం ద్వారా పది వేల క్యూసెక్కులు, తాజాగా పూర్తయిన రెండో సొరంగం ద్వారా మరో పది వేల క్యూసెక్కులు కలిపి ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను గాలేరు-నగరి వరద కాలువ ద్వారా తరలించేలా మార్గం సుగమం చేశారు. దీంతో శ్రీశైలానికి వరద వచ్చే 15 రోజుల్లోనే గండికోట జలాశయాన్ని నింపవచ్చునని అధికారులు చెబుతున్నారు.

చేతులెత్తేసిన చంద్రబాబు సర్కారు..

అవుకులో 2010 నాటికి ఎడమ వైపు సొరంగంలో 350 మీటర్లు, కుడి వైపు సొరంగంలో 180 మీటర్ల పొడవున ఫాల్ట్ జోన్‌లో పనులు మాత్రమే మిగిలాయి. ఫాల్ట్ జోన్‌లో పనులు చేయలేక టీడీపీ సర్కార్ చేతులెత్తేసింది. కుడి వైపు సొరంగంలో ఫాల్ట్ జోన్ ప్రాంతంలో తవ్వకుండా దానికి ఒక వైపు 7 మీటర్ల వ్యాసం, 5 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 394 మీటర్ల మేర ఒక లూప్‌ను 2017లో, 507 మీటర్ల పొడవున మరో లూప్‌ను 2018లో తవ్వి కుడి సొరంగంతో అనుసంధానం చేశారు. వాటి ద్వారా ఐదారు వేల క్యూసెక్కులు తరలించి చేతులు దులుపుకొన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఫాల్ట్ జోన్‌లో పనులు అత్యాధునిక పద్ధతుల ద్వారా చేపట్టి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు.

సీమకు చంద్రబాబు ద్రోహం

గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం రాయలసీమ, నెల్లూరు ప్రజల చిరకాల స్వప్నం. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 1996లోలోక్‌సభ ఎన్నికల గండం గట్టెక్కేందుకు గండికోట వద్ద గాలేరు-నగరికి శంకుస్థాపన చేశారు. తరువాత తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. 1999 సార్వత్రిక ఎన్నికలకు ముందు వామికొండ వద్ద గాలేరు-నగరికి రెండో సారి శంకుస్థాపన చేశారు. అధికారంలోకి వచ్చాక ఎలాంటి పనులు చేపట్టలేదు. 1995 నుంచి 2004 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు సీమ ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లు స్పష్టమవుతోంది. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గాలేరు-నగరిలో మిగిలిన పనులను పూర్తి చేయకుండా పాత కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేశారు. జీవో 22, జీవో 63లను వర్తింపజేసి మిగతా పనుల అంచనా వ్యయాన్ని పెంచి సీఎం రమేష్ నేతృత్వంలోని కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకున్నారు. వైఎస్సార్ హయాంలో పూర్తయిన గండికోట రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా 2019 ఎన్నికలకు ముందు నాలుగైదు టీఎంసీలు నిల్వ చేసి తానే గాలేరు-నగరిని పూర్తి చేసినట్లు నమ్మించేందుకు ప్రయత్నించారు. దీన్ని గుర్తించిన ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పారు.

సుభిక్షం చేసిన వైఎస్సార్

దివంగత వైఎస్సార్ కృష్ణా జలాలను రాయలసీమకు మళ్లించి సుభిక్షం చేసేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 9 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచడంతోపాటు గాలేరు-నగరిని చేపట్టారు. తెలుగుగంగ పనులను వేగవంతం చేశారు. హంద్రీ-నీవాను చేపట్టారు. గాలేరు-నగరి పనులకు రూ.4,982.69 కోట్లు ఖర్చు చేసి వరద కాలువతోపాటు గండికోట, వామికొండ, సర్వారాయసాగర్, పైడిపాలెం రిజర్వాయర్ల పనులను చాలావరకు పూర్తి చేశారు.


పూర్తయిన అవుకు టన్నెల్స్

చిత్తశుద్ధితో సీఎం జగన్ అడుగులు

శ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లోనే గాలేరు-నగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచే పనులను సీఎం జగన్ చేపట్టారు. ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గాలేరు-నగరిలో మిగిలిన పనులను కూడా పూర్తి చేసి సీమను సస్యశ్యామలం చేసే దిశగా చిత్తశుద్ధితో వేగంగా అడుగులు వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో పునరావాసం కల్పించడం ద్వారా గండికోటలో 2019లోనే 26.85 టీఎంసీలను నిల్వ చేయడం గమనార్హం. వరుసగా 2020, 2021, 2022లోనూ 26.85 టీఎంసీల చొప్పున గండికోటలో నిల్వ చేశారు. వామికొండ, సర్వారాయసాగర్, పైడిపాలెం రిజర్వాయర్లలోనూ పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. నాడు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల పది టీఎంసీలకుగానూ నాలుగు టీఎంసీలను మాత్రమే టీడీపీ సర్కారు నిల్వ చేసింది. సీఎం జగన్ రూ.250 కోట్లు వెచ్చించి నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 2019 నుంచి నాలుగేళ్లుగా పదికి పది టీఎంసీలను నిల్వ చేసి ఆయకట్టుకు నీళ్లందిస్తూ వస్తున్నారు.

- బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ ఉన్న లింక్ కెనాల్, వెలిగోడు నుంచి బ్రహ్మంసాగర్ వరకు తెలుగుగంగ కెనాల్‌కు లైనింగ్ చేయకపోవడం వల్ల సామర్థ్యం మేరకు నీరు ప్రవహించడం లేదు. దాంతో వెలిగోడు, బ్రహ్మంసాగర్‌కు సకాలంలో నీళ్లు చేరక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గుర్తించిన సీఎం జగన్ రూ.500 కోట్లతో ఆ కాలువలకు లైనింగ్ చేయించారు. ఫలితంగా 2019 నుంచి ఏటా వెలిగోడు రిజర్వాయర్‌ను సకాలంలో నింపుతున్నారు.
- బ్రహ్మంసాగర్ మట్టికట్ట లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడం వల్ల 17.74 టీఎంసీలకుగానూ 2018 వరకూ నాలుగు టీఎంసీలను మాత్రమే నిల్వ చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వంద కోట్లతో డయాఫ్రమ్ వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేశారు. దీంతో 2020 నుంచి 17.74 టీఎంసీలను నిల్వ చేస్తూ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తున్నారు.

సీమ చరిత్రలో మేలిమలుపు



ముఖ్యమంత్రి జగన్ మార్గ నిర్దేశాల మేరకు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ అత్యాధునిక పరిజ్ఞానంతో అవుకు రెండో సొరంగాన్ని పూర్తి చేశాం. ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు-నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులు తరలించేందుకు మార్గం సుగమమైంది. దీంతో గాలేరు-నగరి తొలి దశ పూర్తైంది. శ్రీశైలానికి వరద రాగానే గండికోట, వామికొండ, సర్వారాయసాగర్, పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లను సత్వరమే నింపి సకాలంలో ఆయకట్టుకు నీటిని అందించి రైతులకు లబ్ధి చేకూర్చేలా అన్ని అడ్డంకులను సీఎం జగన్ తొలగించారు. సీమ చరిత్రలో ఇదో మేలిమలుపు.
– శశిభూషణ్‌కుమార్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి

ప్రణాళికాబద్ధంగా పూర్తి



సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ సీఎం జగన్ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపారు. ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళిక మేరకు సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను పూర్తి చేసి సీఎం జగన్ జాతికి అంకితం చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో హంద్రీ-నీవా నుంచి 77 చెరువులను నింపే ఎత్తిపోతలను పూర్తి చేసి ప్రారంభించారు. ఇప్పుడు గాలేరు-నగరిలో అత్యంత కీలకమైన అవుకు సొరంగాన్ని జాతికి అంకితం చేస్తున్నారు.
– సి.నారాయణరెడ్డి, ఇంజనీర్-ఇన్-చీఫ్, జలవనరుల శాఖ

అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు



దివంగత వైఎస్సార్ అవుకు చెరువును రిజర్వాయర్‌గా మార్చారు. 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు రెండు టన్నెళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మట్టి వదులుగా ఉండటంతో పనులకు ఆటంకం కలిగింది. ఆ తరువాత టీడీపీ పాలకులు విఫలం కావటంతో పనులు నిలిచిపోయాయి. సీఎం జగన్ పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తున్నారు. అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసి చూపించారు.
– అరవ రామభూపాల్ రైతు శింగనపల్లి

ఏటా రెండు పంటలు..



గతంలో నీరు సరిగా అందక ఏడాదికి ఒక్క పంట మాత్రమే పండించాం. సీఎం జగన్ పుణ్యమా అని రెండో టన్నెల్ పనులు పూర్తి కావడంతో అవుకు రిజర్వాయర్ నీటితో కళకళలాడనుంది. భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా పెరుగుతాయి. ఇక ఏటా రెండు పంటలు పండించుకుంటాం. ఒక ఏడాది వర్షాలు పడకపోయినా అవుకు రిజర్వాయర్ ద్వారా పంటలు పండించుకునే అవకాశం ఉంది. సీఎం జగన్‌కు రైతులంతా రుణపడి ఉంటారు.
– దొర్నిపాటి నాగరాజు, రైతు, అవుకు

కల నెరవేరింది



రెండో టన్నెల్ నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీళ్లు రావడం కలగానే మిగిలిపోతుందనుకున్నాం. సీఎం జగన్ అవుకు టన్నెళ్లు పూర్తి చేసి 20 వేల క్యూసెక్కుల నీటిని వదలనుండటం ఎంతో సంతోషంగా ఉంది. రైతుల కల నెరవేరుతోంది.
– వెలుగు సీతారామయ్య రైతు, అవుకు

క్లుప్తంగా...

మహిళా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ డిగ్రీ

లాంఛనంగా ప్రారంభించిన వీసీ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గణాంక శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ సెంటర్(ఐఎస్‌పీఎస్) సహకారంతో బీఎస్సీ స్టాటిస్టిక్స్ ఆనర్స్ డిగ్రీ కోర్సును బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వచ్చిన వర్సిటీ వీసీ డి భారతి మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి బీఎస్సీ స్టాటిస్టిక్స్ ఆనర్స్ డిగ్రీని వర్సిటీలో కొత్తగా ప్రవేశపెట్టడం శుభపరిణామమన్నారు. గణాంఖ శాస్త్ర ఉపయోగాలు, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఉపయోగాల గురించి ఆమె వివరించారు. ఐఎస్‌పీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గణితం, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో డేటా సైన్స్ అనేది కీలక ప్రాత పోషిస్తోందన్నారు. తిరుపతిలోని ఐఎస్‌పీఎస్ డేటా సైన్స్ సెంటర్ ద్వారా బీఎస్సీ స్టాటిస్టిక్స్ కోర్సును దత్తత తీసుకుని విద్యార్థులకు అందిస్తామని వివరించారు. 2024 ఫిబ్రవరిలో జరగనున్న డాటా సైన్స్‌లో యాదృచ్ఛిక నమూనాలపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌నకు సంబంధించిన బ్రోచర్‌ను ముఖ్యఅతిథులు విడుదల చేశారు.

55 మంది వైద్యులు డిస్మిస్

ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లోని 55 మంది అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి గరిష్టంగా ఏడేళ్లుగా వీరందరూ విధులకు హాజరవ్వడం లేదు. దీంతో ఆస్పత్రుల్లో రోగులకు సేవల కల్పనలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో వీరందరికీ ఈ ఏడాది జూలై నెలలో నోటీసులు జారీ చేసి విధులకు దూరంగా ఉండటానికి గల కారణాలపై వివరణ ఇచ్చి తిరిగి ఉద్యోగాల్లో కొనసాగడం కోసం ఆగస్టు నెల 10వ తేదీ వరకూ సమయం ఇచ్చారు. అయినప్పటికీ ఈ 55 మంది నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో 1996 సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లోని నిబంధనల ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగించారు.

3 నెలల్లోగా ప్రాధాన్య భవనాలు అందుబాటులోకి..

వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంజూరు చేసిన గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు తదితర ప్రాధాన్య భవనాల నిర్మాణాలను 3 నెలల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కెఎస్.జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు ప్రకారం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. సమావేశంలో ఉన్నతాధికారులు బి.రాజశేఖర్, ఎం.టి.కృష్ణబాబు, డా.కేవీవీ సత్యనారాయణ, జె.నివాస్, సూర్యకుమారి, బి.బాలు నాయక్, ఆర్వీ కృష్ణారెడ్డి, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత బీటెక్ రవికి బెయిల్

కడప అర్బన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు, వైఎస్సార్ జిల్లా పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవికి బుధవారం కడప కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈనెల 14న వల్లూరు పీఎస్ కేసులో అరెస్టయిన తరువాత కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఆయనకు రూ.25 వేల పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. రెండు నెలల వ్యవధిలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య వల్లూరు పీఎస్‌లో హాజరు కావాలని మేజిస్ట్రేట్ తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోర్టు షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు అవకాశం ఉంటుందని జడ్జి పేర్కొన్నారు.

ఏయూ వీసీ నియామకంపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- విచారణ 8 వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి:ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (వీసీ) నియామక ప్రక్రియను నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమంది. విశ్వవిద్యాలయం వీసీగా ప్రసాద్‌రెడ్డి పనిచేసిన కాలంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై ఛాన్సలర్ (గవర్నర్) తగిన నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసాద్‌రెడ్డి వీసీగా ఉన్న సమయంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఆయన తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పూర్వ విద్యార్థుల సంఘం హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. పిటిషనర్ తరపున న్యాయవాది పిచ్చయ్య వాదనలు వినిపిస్తూ.. ప్రసాద్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టారన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా.. ప్రకటన జారీ చేయకుండా ఏకపక్షంగా నియామకాలు చేశారన్నారు. అడ్డగోలుగా చెట్లను నరికేయించారని తెలిపారు. తిరిగి ప్రసాద్‌రెడ్డినే వీసీగా నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రసాద్‌రెడ్డి తీరుపై ఛాన్సలర్‌కు ఈ నెల 1న ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటివరకు ఛాన్సలర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నవంబర్ 1న ఫిర్యాదు చేసి, స్పందించేందుకు తగిన సమయం ఇవ్వకుండా నవంబర్ 10న ఎలా పిల్ దాఖలు చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. స్పందించేందుకు సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందంది. ప్రసాద్‌రెడ్డినే తిరిగి వీసీగా నియమిస్తున్నారా? అని విశ్వవిద్యాలయం తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. తాను తెలుసుకుని పూర్తి వివరాలు కోర్టు ముందుంచుతానని విశ్వవిద్యాలయం న్యాయవాది వి.సాయికుమార్ తెలిపారు. వీసీగా ప్రసాద్‌రెడ్డి కాల పరిమితి 24తో ముగిసిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఫిర్యాదుపై తగిన నిర్ణయం తీసుకునేందుకు ఛాన్సలర్‌కు తగిన సమయం ఇద్దామని తెలిపింది. విచారణను 8 వారాలకు వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. ఈ సమయంలో పిచ్చయ్య స్పందిస్తూ.. వీసీ నియామక ప్రక్రియను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం సీజే ధర్మాసనం తేల్చిచెప్పింది.



చంద్రబాబు పిటీ వారెంట్‌పై విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుపై పిటీ వారెంట్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు డిసెంబర్ 5కు వాయిదా వేసింది. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలకు పాల్పడటం ద్వారా భారీ భూ దోపిడీకి పాల్పడిన కుంభకోణంపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణతోపాటు పలువురిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేయగా కోర్టు తదుపరి విచారణను పై తేదీకి వాయిదా వేసింది.



'అథ్లెటిక్స్‌ను మరింత మార్కెటింగ్ చేయాలి'

భారత్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లను మరింత ఆకర్షణీయంగా మార్చాల్సిన అవసరం ఉందని స్టార్ అథ్లెట్, ఒలింపిక్ స్వర్ణపతక విజేత నీరజ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఎక్కువ మంది అభిమానులకు చేరువయ్యేందుకు తగినంత మార్కెటింగ్ కూడా చేయాలని అతను అన్నాడు. 'డైమండ్ లీగ్, కాంటినెంటల్ టూర్స్, వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ వంటి పెద్ద ఈవెంట్లను భారత్‌లో ప్రసారం చేయాలి. ప్రస్తుతం హైలైట్స్ మాత్రమే మనకు అందుబాటులో ఉంటున్నాయి. రాత్రి 1–2 వరకు మేల్కొని అభిమానులు అథ్లెటిక్స్ చూసేందుకు సిద్ధమైనా, వారికి ఆ అవకాశం ఉండటం లేదు' అని నీరజ్ అన్నాడు. కెన్యా, గ్రెనడాలాంటి దేశాలు కూడా ప్రపంచ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తుండగా మనం ఎందుకు చేయలేమని నీరజ్ వ్యాఖ్యానించాడు. 'నేను వరల్డ్ అథ్లెటిక్స్ అధికారులను ఎప్పుడు కలిసినా వారు భారత్‌లో ఇలాంటి ఈవెంట్ నిర్వహించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అదే జరిగితే ఎక్కువ మంది అథ్లెటిక్స్‌ను చూసి ఆకర్షితులవుతారనేది నా నమ్మకం' అని నీరజ్ చెప్పాడు.

కేన్ విలియమ్సన్ సెంచరీ

న్యూజిలాండ్ 266/8



సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (104; 11 ఫోర్లు) సెంచరీతో కదం తొక్కాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. ఓపెనర్లు లాథమ్ (21; 3 ఫోర్లు), కాన్వే (12) విఫలమవగా, ఆతిథ్య బంగ్లా బౌలర్లు పట్టు బిగించడంతో కివీస్ వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. ఈ దశలో విలియమ్సన్... డరైల్ మిచెల్ (41; 3 ఫోర్లు, 1 సిక్స్), గ్లెన్ ఫిలిప్స్ (42; 5 ఫోర్లు, 1 సిక్స్)లతో జట్టును నడిపించాడు. ఈ క్రమంలో అతను టెస్టు కెరీర్‌లో 29వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం పూర్తయిన కాసేపటికే విలియమ్సన్‌ను తైజుల్ ఇస్లామ్ బౌల్డ్ చేయడంతో 262 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా నిష్క్రమించాడు. ఆట ముగిసే సమయానికి జేమీసన్ (7 బ్యాటింగ్), కెప్టెన్ టిమ్ సౌతీ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 4 వికెట్లు పడగొట్టాడు. షోరిఫుల్, మెహదీహసన్ మిరాజ్, నయీమ్ హసన్, మొమినుల్ తలా ఒక వికెట్ తీశారు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులకు ఆలౌటైంది.

క్వార్టర్‌ఫైనల్లో శివథాపా



షిల్లాంగ్: జాతీయ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్లు శివ థాపా, అమిత్ పంఘాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన 63.5 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ శివథాపా 5–0తో సంతోష్ (కర్ణాటక)పై ఏకపక్ష విజయం సాధించాడు. సర్వీసెస్ బాక్సర్ అమిత్ 4–1తో పంజాబ్‌కు చెందిన జైసందీప్ సింగ్‌ను ఓడించాడు. గురువారం జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో శివ... ఢిల్లీ బాక్సర్ శశాంక్ ప్రధాన్‌తో, పంఘాల్... మొహమ్మద్ ఆరిఫ్ (జమ్మూకశ్మీర్)తో తలపడతారు. మిగతా ప్రిక్వార్టర్స్ పోటీల్లో 2021 ఆసియా చాంపియన్ సంజీత్ (92 కేజీలు) 5–0తో సావన్ గిల్ (చండీగఢ్)పై, ఆశిష్ కుమార్ (హిమాచల్ ప్రదేశ్; 80 కేజీలు) 5–0తో నితీశ్ కుమార్ (చండీగఢ్)పై గెలుపొందారు.

ద్రవిడ్ బృందానికే జై

- హెడ్ కోచ్‌గా కొనసాగనున్న రాహుల్ ద్రవిడ్
- ఇతర సహాయక సిబ్బందికీ మళ్లీ అవకాశం
- బీసీసీఐ అధికారిక ప్రకటన



ముంబై: వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టుకు వరుస విజయాలతో ఫైనల్ వరకు చేర్చిన శిక్షణా బృందంపై బీసీసీఐ నమ్మకముంచింది. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సహా ఇతర ముగ్గురు కోచ్‌ల కాంట్రాక్ట్‌ను పొడిగిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పారస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌లకు కూడా మళ్లీ అవకాశం దక్కింది. వీరందరి కాంట్రాక్ట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. పొడిగింపుపై అప్పటి వరకు బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే బృందాన్ని మరి కొంత కాలం కొనసాగించడమే సరైందిగా బోర్డు భావించింది. ముందుగా దీనికి సంబంధించి ద్రవిడ్‌కు సమాచారం అందించింది. ద్రవిడ్ అంగీకరించకపోతే మరో ప్రత్యామ్నాయం వైపు బోర్డు చూసే ఆలోచనలో ఉండగా...ద్రవిడ్ కోచ్‌గా కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేశాడు. వీరి కాంట్రాక్ట్ ఎప్పటి వరకు అనే విషయంపై ఇంకా స్పష్టత లేకపోయినా... వచ్చే ఏడాది జూన్–జూలైలో జరిగే టి20 ప్రపంచ కప్ వరకు ఉండే అవకాశం ఉంది. మరో వైపు వన్డే, టి20లకు మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా పేరుపై కూడా చర్చ జరిగినా...నెహ్రా విముఖత చూపడంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టినట్లు సమాచారం.

అందుకే కొనసాగింపు...

గత రెండేళ్లుగా ద్రవిడ్, అతని సహచర కోచింగ్ బృందం భారత జట్టులో తీసుకొచ్చిన మార్పులు, ఏర్పరచిన మంచి వాతావరణం మున్ముందూ కొనసాగించాలని బీసీసీఐ అనుకుంది. కొత్తగా వచ్చే కోచ్‌తో ఇవన్నీ ఒక్కసారి మారిపోతే కష్టమని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. కోచ్ మారితే అతనితో పాటు ఇతర సహాయక సిబ్బంది కూడా కొత్తగా వచ్చే అవకాశం ఉంటుంది. ద్రవిడ్ బృందం భవిష్యత్తులో ఎప్పటి వరకు కొనసాగుతుందో ఇప్పుడే చెప్పలేకపోయినా... ఇదే జట్టు సహకారంతో కనీసం మరో ఐసీసీ టోర్నీలో జట్టు పాల్గొనడమే సరైందని వారు భావించారు. 'రాహుల్ ద్రవిడ్‌కు బోర్డు అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. మూడు ఫార్మాట్‌లలో భారత జట్టు అద్భుతంగా ఆడుతూ అగ్రస్థానంలో ఉంది. ద్రవిడ్ దూరదృష్టి, ఆలోచన, ప్రణాళిక అందుకు కారణం. వరల్డ్ కప్‌లో ఫైనల్‌కు ముందు వరుసగా పది మ్యాచ్‌లు గెలవడం అసాధారణ ప్రదర్శన. అందుకు హెడ్‌కోచ్‌ను తప్పకుండా అభినందించాలి. మున్ముందు మరిన్ని విజయాలు సాధించేందుకు వారికి అన్ని విధాలా సహకారం అందిస్తాం' అని బీసీసీఐ కార్యదర్శి జై షా అన్నారు. తనకు కొనసాగింపు లభించడం పట్ల ద్రవిడ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'భారత జట్టుతో నా ప్రయాణంలో ఎన్నో మధుర క్షణాలు ఉన్నాయి. ఇందులో ఎన్నో విజయాలు, పరాజయాలతో ఎత్తుపల్లాలు చవిచూశాం. ఆటగాళ్లు, మా శిక్షణా బృందం మధ్య మంచి అనుబంధం ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లో మేం నెలకొల్పిన మంచి సంస్కృతి పట్ల గర్వంగా ఉన్నాం. అద్భుతమైన ప్రతిభ ఉన్న మా జట్టుకు సరైన మార్గనిర్దేశనం చేసి మంచి ఫలితాలు సాధించేలా చేయడంలో సఫలమయ్యాం. నాపై నమ్మకం ఉంచి మళ్లీ అవకాశం కల్పించిన బోర్డుకు కృతజ్ఞతలు. ప్రపంచకప్ తర్వాత రాబోయే కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ద్రవిడ్ తన స్పందనను తెలియజేశాడు.

రికార్డు ఇలా...

రాహుల్ ద్రవిడ్ 2021 నవంబర్ 17నుంచి తొలి సారి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. రెండేళ్ల పదవీ కాలాన్ని అతనికి బోర్డు నిర్దేశించింది. వ్యక్తిగత సాన్నిహిత్యం ఉన్న సీనియర్ ఆటగాళ్లతో పాటు అంతకు ముందు వరకు ద్రవిడ్ కోచింగ్‌లో అండర్–19, భారత్ 'ఎ' జట్లకు ఆడిన ఆటగాళ్లు చాలా మంది జట్టులో ఉండటంతో కోచింగ్‌లో ద్రవిడ్ పని సులువైంది. అతను కోచ్‌గా ఉన్న సమయంలోనే భారత జట్టు టెస్టు, వన్డే, టి20ల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. అయితే మూడు అవకాశాలు లభించినా ఒక్క సారి కూడా ఐసీసీ టోర్నీని మాత్రం గెలవలేకపోయింది. 2022 టి20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్, 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ ఓటమిపాలైంది. అయితే ఫైనల్‌కు ముందు వరుసగా పది మ్యాచ్‌లలో సంపూర్ణ ఆధిపత్యంతో విజయం సాధించింది. ఈ ఏడాది ఆసియా కప్‌లో భారత్ విజేతగా నిలిచింది. రెండో సారి కోచ్‌గా ఇప్పుడు ద్రవిడ్ బాధ్యతలు డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనతో మొదలవుతాయి. ఈ టూర్‌లో 3 టి20లు, 3 వన్డేలతో పాటు 2 టెస్టులు ఆడుతుంది. సఫారీ గడ్డపై ఇప్పటి వరకు టెస్టు సిరీస్ నెగ్గని రికార్డు భారత్‌కు ఉంది. అనంతరం స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడుతుంది.

శ్రీకాంత్ మరో పరాజయం

- మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి జోడీ ముందంజ
- సయ్యద్ మోడి ఓపెన్ బ్యాడ్మింటన్



లక్నో: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. మాజీ ప్రపంచ నంబర్‌వన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ ఈ ఏడాది తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోతున్నాడు. సొంతగడ్డపై జరుగుతోన్న సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ టోర్నీలోనూ శ్రీకాంత్ ఆటకు మొదటి రౌండ్లోనే తెరపడింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ శ్రీకాంత్ 21–23, 8–21తో చైనీస్ తైపీకి చెందిన చియా హావొ లీ చేతిలో వరుస గేముల్లో పరాజయం చవి చూశాడు. ఇతర మ్యాచ్‌ల్లో కిరణ్ జార్జ్ 21–16, 14–21, 21–13తో భారత్‌కే చెందిన క్వాలిఫయర్ చిరాగ్ సేన్‌పై గెలుపొందగా, సమీర్ వర్మ 9–21, 21–7, 17–21తో వాంగ్ జు వి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. ప్రియాన్షు రజావత్ 21–17, 21–19తో డిమిత్రి పనరిన్ (కజకిస్తాన్)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో క్లిష్టమైన డ్రా ఎదురవడంతో మాళ్విక బన్సోద్ తొలి రౌండ్లోనే ఇంటిదారి పట్టింది. ఆమె 21–18, 17–21, 10–21తో జపాన్ స్టార్ నజొమి ఒకుహర చేతిలో ఓడిపోయింది. భారత సహచరుల మధ్య జరిగిన పోరులో ఉన్నతి హుడా 15–21, 21–19, 21–18తో ఆకర్షి కశ్యప్‌పై గెలుపొందగా, క్వాలిఫయర్ కేయూర 8–21, 16–21తో ఎనిమిదో సీడ్ సంగ్ షు యున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ గాయత్రి గోపీచంద్–ట్రిసా జాలీ జోడీ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. తొలి రౌండ్లో గాయత్రీ–ట్రిసా జాలీ జోడీ 21–9, 21–16తో భారత్‌కే చెందిన అపూర్వ–సాక్షి గెహ్లోవత్ జంటపై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్ మొదటి రౌండ్లో కోన తరుణ్–శ్రీకృష్ణప్రియ జంటకు 14–21, 15–21తో నితిన్ కుమార్–నవధ మంగళం జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.

మళ్లీ ఓడిన హైదరాబాద్, ఆంధ్ర

విజయ్ హజారే ట్రోఫీ

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మరో పరాజయాన్ని చవిచూసింది. బుధవారం గ్రూప్ 'బి' మ్యాచ్‌లో సర్వీసెస్ 6 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 210 పరుగుల వద్ద ఆలౌటైంది. రాహుల్ బుద్ధి (87 బంతుల్లో 80; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), తన్మయ్ అగర్వాల్ (45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. సర్వీసెస్ 40.5 ఓవర్లలో 4 వికెట్లకు 211 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పలివాల్ (101 బంతుల్లో 77 నాటౌట్; 6 ఫోర్లు), వినీత్ ధన్కర్ (76 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో సర్వీసెస్‌ను గెలిపించారు.

విహారి, హెబ్బర్ రాణించినా...

చండీగఢ్: గ్రూప్ 'డి'లో ఆంధ్ర జట్టు కూడా వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడింది. రాజస్తాన్ 38 పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. ముందుగా రాజస్తాన్ 50 ఓవర్లలో 290 పరుగుల వద్ద ఆలౌటైంది. అభిజిత్ తోమర్ (115 బంతుల్లో 124; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, రామ్ చౌహాన్ (68 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. పిన్నింటి తపస్వికి 4 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆంధ్ర 47.4 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌటైంది. హనుమ విహారి (80 బంతుల్లో 60; 9 ఫోర్లు), అశ్విన్ హెబ్బర్ (89 బంతుల్లో 68; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించినా... మిడిలార్డర్ వైఫల్యంతో ఆంధ్ర ఓటమిపాలయ్యింది. అనికేత్ చౌదరి 4 వికెట్లతో దెబ్బ తీసాడు.

భారత పేస్ బౌలర్ ముకేశ్ కుమార్ పెళ్లి పీట లెక్కాడు. తన మిత్రురాలు దివ్యాసింగ్‌ను అతను వివాహమాడాడు. భారత్ తరఫున ఒక టెస్టు, 3 వన్డేలు, 7 టి20లు ఆడిన ముకేశ్ తన వివాహం కారణంగా మంగళవారం ఆసీస్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. శుక్రవారం జరిగే నాలుగో టి20 కోసం అతను జట్టుతో జతకలుస్తాడు.



సినిమా



● ఎన్టీఆర్

ఆ రోజే వార్?

'వార్ 2' సినిమా చిత్రీకరణలో కాస్త ఆలస్యంగా పాల్గొననున్నారట ఎన్టీఆర్. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వార్ 2'. హిట్ ఫిల్మ్ 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లో మొదలైంది. ఈ సినిమా గురించి చర్చించడానికి ఎన్టీఆర్, అయాన్ ముఖర్జీ తరచూ సమావేశమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో జనవరిలో జాయిన్ కానున్నారట ఎన్టీఆర్. ఇక ఈ సినిమాను 2025 జనవరి 24న విడుదల చేయాలనుకున్నప్పటికీ తాజాగా ఆగస్టు 14కి విడుదల చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందని బాలీవుడ్ సమాచారం. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం 'దేవర'తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తొలి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.



● రామ్

కౌంట్‌డౌన్ స్టార్ట్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమా రిలీజ్ కౌంట్‌డౌన్‌ని ఆరంభించారు మేకర్స్. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. సినిమా విడుదల తేదీలో ఎలాంటి మార్పు ఉండదని మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. రిలీజ్ డేట్‌ని స్పష్టం చేయడానికి వందరోజుల కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. రామ్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సీఈఓ: విషురెడ్డి.

ఇక షురూ

'కల్కి 2898 ఏడీ' షూట్‌కు టైమ్ అయ్యింది అంటున్నారట కమల్‌హాసన్. ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ వారంలో ఈ సినిమా చిత్రీకరణలో కమల్‌హాసన్ పాల్గొంటారని, ఆయనపై కొన్ని కీలక సన్నివేశాలను నాగ్ అశ్విన్ ప్లాన్ చేశారని టాక్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



● కమల్ హాసన్

టీజర్ ఆసక్తికరంగా ఉంది

- 'దిల్' రాజు

సంబీత్ ఆచార్య, జో శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఎమ్4ఎమ్'. నిర్మాత మోహన్ వడ్లపట్ల ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్విన్ గ్రూప్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ– ''టీజర్ ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''దర్శకుడిగా కొత్త అవతారం ఎత్తాను. నెక్ట్స్ హాలీవుడ్‌లోనూ ఓ సినిమాను నిర్మించబోతున్నాను. రాహుల్ అడబాల, జో శర్మలు ఈ చిత్రకథ రాయడంలో సహకరించారు'' అన్నారు మోహన్ వడ్లపట్ల. ఎంఆర్‌సీ చౌదరి, రాహుల్ అడబాల మాట్లాడారు.



● మోహన్ వడ్లపట్ల, 'దిల్' రాజు

దూత ఓ కొత్త అనుభూతి



● విక్రమ్ కె. కుమార్

''థ్యాంక్యూ' సినిమా తర్వాత 'దూత' వెబ్ సిరీస్ గురించి నాగచైతన్యతో చెప్పాను. హారర్, థ్రిల్లర్ నేపథ్యం అంటే నాకు భయం అన్నాడు. కథ వినమన్నాను. ఆ తర్వాత కథ నచ్చడంతో చేస్తానని చెప్పాడు. సూపర్ నేచురల్, ఊహాతీతమైన అంశాలతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తుంది'' అని డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ అన్నారు. హీరో నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ 'దూత'. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవానీశంకర్, ప్రాచీ దేశాయ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శరత్ మరార్ నిర్మించిన ఈ సిరీస్ డిసెంబరు 1 నుంచి అమేజాన్‌లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఎనిమిది ఎపిసోడ్స్‌గా ప్రసారం కానుంది. ఈ సందర్భంగా విక్రమ్ కె. కుమార్ చెప్పిన విశేషాలు.

● 'దూత' పూర్తిగా కల్పిత కథ. 'దూత' అంటే ఏదైనా సమాచారాన్ని చేరవేసేవాడు. ఇందులో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ సాగర్ పాత్రలో నాగచైతన్య అద్భుతంగా నటించాడు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అంటేనే సవాల్‌తో కూడుకున్నది. సంచలనం సృష్టించిన ఓ ఘటన తాలూకు వాస్తవాలను సాగర్ ఎలా పాఠకుల ముందు ఉంచాడు? ఆ తర్వాత అతని జీవితంలో ఎలాంటి మలుపులు ఎదురయ్యాయి? అనేది ప్రేక్షకులు అంచనా వేయలేరు. తన కంఫర్ట్ జోన్ నుండి బయటకి వచ్చి, ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రని సవాల్‌గా తీసుకుని చేశాడు నాగచైతన్య. ● 'దూత'లో మూడు సినిమాలు తీసేంత కథ ఉంది. అందుకే వెబ్ సిరీస్‌గా తీశాం. పైగా సినిమాగా తీస్తే మన ప్రేక్షకులకు మాత్రమే చేరువ అవుతుంది. ఓటీటీలో ప్రసారం చేయడం ద్వారా ఇతర దేశాల్లోని వారు కూడా మన ఇండియన్ వెబ్ సిరీస్‌లు చూసే అవకాశం ఉంటుంది. ● షార్ట్ ఫిలిం, వెబ్ ఫిల్మ్, సినిమా.. దేని కష్టం దానికి ఉంటుంది. అయితే సినిమా తీయడం సులభమే.. కానీ, మంచి మూవీ తీయడం చాలా కష్టం.

కథ మొదలెట్టినాడు చూడరయ్యా...




● తేజా సజ్జా, ప్రశాంత్ వర్మ

తేజా సజ్జా, అమృతా అయ్యర్ హీరో హీరోయిన్లుగా వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హను–మాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భాషల్లో జనవరి 12న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఆవకాయ ఆంజనేయ కథ మొదలెట్టినాడు చూడరయ్యా.. శక్తినంత కూడగట్టి సెట్టు దులిపినాడు అంజయ్యా..' పాటను విడుదల చేశారు. అనుదీప్ సంగీత సారథ్యంలో సింహాచలం మన్నెల సాహిత్యం అందించిన ఈ పాటను సాహితీ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో తేజా సజ్జా మాట్లాడుతూ– ''మనకి ఆపద వస్తే ఆంజనేయస్వామి... ఆకలేస్తే ఆవకాయ.. ఇది మన సంస్కృతిలోనే బలంగా పాతుకుపోయి ఉంది. ఇదొక భావోద్వేగం. అలాంటి మన సంస్కృతిని కమర్షియల్ పంథాలో గొప్పగా చూపించేందుకు ప్రశాంత్‌గారు ప్రయత్నించారు'' అన్నారు. ''ఆవకాయ ఆంజనేయ' పాటతోనే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ సినిమాలోని ప్రతి పాట కథను ముందుకు తీసుకువెళ్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చూడదగ్గ చిత్రం ఇది. 'హను–మాన్' అసలు సిసలైన సంక్రాంతి సినిమా'' అన్నారు ప్రశాంత్ వర్మ.

ఇలాంటి సినిమా తీయాలంటే ధైర్యం కావాలి

- సుద్దాల అశోక్‌తేజ

బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించారు. ఈ సినిమాలోని 'పోతుగడ్డ మీద..' పాటను విడుదల చేశారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో బాబీ సింహా మాట్లాడుతూ– ''భీమ్స్‌గారి సంగీతం, సుద్దాల అశోక్‌తేజగారి సాహిత్యంలో ఏదో తెలియని భావోద్వేగం ఉంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కూడా మేం అంతే భావోద్వేగానికి లోనయ్యాం'' అన్నారు. ''సుద్దాల అశోక్‌తేజ, భీమ్స్‌గార్లు ఊరికే ఎమోషన్ కాలేదు. మా పూర్వీకుల చరిత్రలో అంతటి ఆవేదన నిండి ఉంది. భీమ్స్‌గారు పాడిన పాట వింటే పోతుగడ్డ మీద పుట్టిన భూమి బిడ్డల ఆత్మ ఘోషిస్తున్నట్లు ఉంటుంది'' అన్నారు యాటా సత్యనారాయణ. ''సుద్దాల హనుమంత, జానకమ్మల బిడ్డను కాకుంటే నా పాటలో ఇంత ఎమోషన్ ఉండేది కాదు. రజాకార్ ఉద్యమంలో మా అమ్మా నాన్న పాల్గొన్నారు. స్వాతంత్య్రం కోసం వారు నైజాంకు వ్యతిరేకంగా పోరాడారు. రజాకార్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కమ్యూనిటీ నుంచి వచ్చిన భీమ్స్ ఉండటం నాకు కలిసొచ్చింది. ఈ తరహా సినిమా తీయాలంటే డబ్బులు ఉంటే సరిపోదు.. ధైర్యం కావాలి. ఆ ధైర్యం గూడూరు నారాయణరెడ్డికి ఉంది'' అన్నారు సుద్దాల అశోక్‌తేజ. ''మా తాతగారు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ సమాజం ఎంత కష్టానికి గురైందో, ఎన్ని కన్నీళ్లను చూసిందో... వారందరి స్వరాలకు నేను స్వరాన్ని సమకూర్చానని చెప్పాలి'' అన్నారు భీమ్స్ సిసిరోలియో. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనుష్య త్రిపాఠి, కొరియోగ్రాఫర్ స్వర్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పోతిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.



● భీమ్స్, సుద్దాల అశోక్‌తేజ, స్వర్ణ, బాబీ సింహా

అందుకే సవాల్‌గా అనిపించింది


''అథర్వ' క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ నేపథ్యంలోని సినిమాలన్నీ ఒకే తరహాలో ఉంటాయి. కానీ, ఎలాంటి ఆధారాలు లేని ఓ కేసుని హీరో ఎలా పరిష్కరించాడు? అనేది ఈ సినిమాలో సరికొత్త పాయింట్''అని హీరో కార్తీక్ రాజు అన్నారు. మహేశ్ రెడ్డి దర్శకత్వంలో కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భగా కార్తీక్ రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో హీరో పాత్రకు ఆస్తమా ఉంటుంది. అందుకే పోలీస్ కావాలని ఉన్నా కాలేకపోతాడు. చివరకు పోలీస్ విభాగంలోని క్లూస్ టీమ్‌లో జాయిన్ అవుతాడు. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్లో నటిస్తున్నప్పుడు హావభావాలు చాలా ముఖ్యం. మన నటన మీదే సినిమా ఆధారపడి ఉంటుంది. అందుకే ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది. ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఓ సినిమా పూర్తి చేశాను. డిసెంబర్ 7 నుంచి కొత్త సినిమా ప్రారంభిస్తున్నాను'' అన్నారు.



● కార్తీక్ రాజు

నాలోని మరో కోణాన్ని చూస్తారు

- సుధీర్



● విరాజ్, బెక్కం వేణుగోపాల్, అరుణ్, సుధీర్, డాలీషా, విజేష్, జేడీ

''కాలింగ్ సహస్ర'లో సవాల్‌తో కూడుకున్న మంచి పాత్ర ఇచ్చిన అరుణ్‌గారికి థ్యాంక్స్. నాలోని మరో కోణాన్ని చూపించే పాత్ర ఇది. ఇకపై కొత్త కథలతో మంచి చిత్రాలు చేస్తాను. 'కాలింగ్ సహస్ర' మీకు నచ్చితే పది మందికి చెప్పండి'' అని 'సుడిగాలి' సుధీర్ అన్నారు. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో 'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకి నటుడు జేడీ చక్రవర్తి, దర్శకులు దశరథ్, 'బొమ్మరిల్లు' భాస్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుధీర్ మాట్లాడుతూ–''మా సినిమాను మంచి థియేటర్లలో విడుదల చేసేందుకు సాయం చేసిన బెక్కం వేణుగోపాల్‌గారికి ధన్యవాదాలు. నా 'గాలోడు' సినిమా అభిమానుల వల్లే హిట్ అయింది. ఎన్ని జన్మలు ఎత్తినా వారి రుణం తీర్చుకోలేను'' అన్నారు. ''సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు విజేష్ తయాల్, వెంకటేశ్వర్లు కాటూరి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
728	207
66,902	20,097

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 7.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,282	▲	41
డోజోన్స్	35,417	▲	84
ఎఫ్‌టీఎస్ఈ 100	7,447	▼	08
డాక్స్	16,161	▲	168
షాంఘై	3,022	▼	17
నికాయ్	33,321	▼	87

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్ఆర్ఐ	82.57	84.24
£	బ్రిటన్ పౌండ్	ఎన్ఆర్ఐ	103.73	107.11
€	యూరో	ఎన్ఆర్ఐ	90.23	93.33
¥	జపాన్ ఎన్ (100)	ఎన్ఆర్ఐ	55.82	57.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్ఆర్ఐ	54.29	56.66
S$	సింగపూర్ డాలర్	ఎన్ఆర్ఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	[illegible]	21.29	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.82	23.55
¥	చైనా యువాన్	[illegible]	10.57	12.54

బుల్ @ 4 ట్రిలియన్

బీఎస్ఈ సరికొత్త రికార్డ్

4 లక్షల కోట్ల డాలర్లకు మార్కెట్ క్యాపిటలైజేషన్ | అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ సరసన చోటు

లిస్టెడ్ కంపెనీల విలువ @ రూ. 338 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: విలువలో తాజాగా బొంబాయి స్టాక్ ఎక్స్చేంజీ(బీఎస్ఈ) సరికొత్త రికార్డ్ సాధించింది. ఎక్స్చేంజీలో లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 338 లక్షల కోట్లను అధిగమించింది. తద్వారా 4 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో బీఎస్ఈ చేరింది. వెరసి అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ సరసన భారత్ నిలిచింది. బుధవారం(29న) మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 728 పాయింట్లు జంప్‌చేసి 66,902 వద్ద ముగిసింది. దీంతో ఒక్క రోజులో మార్కెట్ విలువకు రూ. 2,35,308 కోట్లమేర జమయ్యింది. ఫలితంగా మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) రూ. 3,38,67,591 కోట్లకు చేరింది. రూపాయి ప్రస్తుత మారకపు విలువ ప్రకారం తొలిసారి 4 లక్షల కోట్ల డాలర్లను తాకింది. ఈ ఏడాది సెప్టెంబర్ 15న సెన్సెక్స్ 67,927 పాయింట్లను అధిగమించడం ద్వారా చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఇప్పటివరకూ సెన్సెక్స్ 6,061 పాయింట్లు (10%) ఎగసింది. దీంతో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 51 లక్షల కోట్ల మేర బలపడింది. కాగా.. 2007లో ట్రిలియన్ డాలర్ల విలువను అందుకున్న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 2 ట్రిలియన్ డాలర్లకు చేరేందుకు దశాబ్దకాలం పట్టింది. ఆపై 2021 మే 24న తొలిసారి 3 ట్రిలియన్ డాలర్లకు చేరి రికార్డ్ సృష్టించింది. అప్పటినుంచి 4 ట్రిలియన్లకు చేరుకునేందుకు రెండున్నరేళ్లే పట్టడం గమనార్హం!

స్పీడ్ ఎందుకంటే: గత వారం పరిమిత శ్రేణిలోనే కదిలిన మార్కెట్లు యూఎస్ వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు తగ్గడంతోపాటు, యూఎస్ బాండ్ల ఈల్డ్స్ నీరసించడంతో జోరందుకున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. క్యూ2 ఫలితాలు, వృద్ధి అంచనాలు, ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐలు) దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తుండటం, ఐపీవోల జోరు వంటి అంశాలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు తెలియజేశారు.

విలువ జోరు తీరిలా..

విలువ	తేదీ
1 ట్రిలియన్	28-5-2007
2 ట్రిలియన్లు	10-7-2017
3 ట్రిలియన్లు	24-5-2021
4 ట్రిలియన్లు	29-11-2023

(విలువ: డాలర్లలో)

గ్లోబల్ టాప్-5లో చోటు

దేశం	విలువ (డాలర్లలో)
అమెరికా	47.78 ట్రిలియన్లు
చైనా	9.74 ట్రిలియన్లు
జపాన్	6.02 ట్రిలియన్లు
హాంకాంగ్	4.78 ట్రిలియన్లు
భారత్	4.06 ట్రిలియన్లు

మళ్లీ 20 వేల పైకి నిఫ్టీ

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ
- సెన్సెక్స్ లాభం 728 పాయింట్లు

ముంబై: సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీతో స్టాక్ సూచీలు బుధవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 728 పాయింట్లు పెరిగి 66,902 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207 పాయింట్లు బలపడి 47 ట్రేడింగ్ సెషన్ల(సెప్టెంబర్ 18) తర్వాత తొలిసారి 20,000 స్థాయిపై 20,097 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే జోరును కొనసాగించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 772 పాయింట్లు ఎగసి 66,946 వద్ద, నిఫ్టీ 215 పాయింట్లు బలపడి 20,105 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. బ్యాంకింగ్, ఆటో, ఐటీ, ఫైనాన్స్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. కన్జూమర్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.78%, 0.40% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.72 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.2,361 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. ఆసియా మార్కెట్లు వారం గరిష్టానికి చేరుకున్నాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి.

- అధిక వెయిటేజీ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.50%, ఇన్ఫోసిస్ 1%, టీసీఎస్ 1%, రిలయన్స్ అరశాతం చొప్పున రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి.
- సెన్సెక్స్ 30 షేర్లలో నెస్లే 0.60%, టైటన్ 0.43%, బజాజ్ ఫిన్ సర్వ్ 0.30%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.01% మాత్రమే నష్టపోయాయి.

వారెవ్వా ఇరెడా..

మినీరత్న కంపెనీ ఐఆర్ఈడీఏ లిస్టింగ్ సూపర్ హిట్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.32)తో పోలిస్తే 56% ప్రీమియంతో రూ.50 వద్ద లిస్టయ్యింది. ప్రారంభం నుంచే కొనుగోళ్ల మద్దతు లభించడంతో 87% ఎగసి ఇంట్రాడే గరిష్టం రూ.60 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 3.81 కోట్ల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.16,124 కోట్లుగా నమోదైంది.

రుణ వ్యాపారాన్ని ప్రారంభించిన జియో ఫైనాన్స్

వ్యక్తిగత, కన్జ్యూమర్, వర్తక రుణాలు • మై జియో యాప్‌పై డిజిటల్‌గా ఆఫర్


న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో ఫైనాన్స్ తన రుణ వితరణ వ్యాపారాన్ని ప్రారంభించింది. తొలుత పర్సనల్ లోన్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్, మర్చంట్ ట్రేడ్ క్రెడిట్ ఫెసిలిటీని ఆరంభించింది. జియో ఫైనాన్స్, మై జియో మొబైల్ అప్లికేషన్స్ ద్వారా వేతన జీవులు, స్వయం ఉపాధిలో ఉన్న వారికి డిజిటల్ పర్సనల్ లోన్స్ ఆఫర్ చేస్తోంది. పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ఉంటే చాలు. రుణాన్ని వేగంగా పొందొచ్చు. కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్ కింద ఖరీదైన మొబైల్ ఫోన్లు, ఏసీలు, కెమెరా కొనుగోళ్లకు రుణాలను అందిస్తోంది. మర్చంట్ వెబ్‌సైట్లపై నోకాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కింద ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసుకోవచ్చు. ''జియో ఫైనాన్స్ కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రుణాలను అందిస్తోంది. తయారీదారులు, ఓఈఎంలు లేదా డీలర్లు ఈ రుణాలపై వడ్డీని భరిస్తారు. దీంతో నో కాస్ట్ ఈఎంఐ ప్రయోజనాన్ని వినియోగదారులు పొందొచ్చు. కాకపోతే కస్టమర్లు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది''అని జియో ఫైనాన్స్ పేర్కొంది.

ఇన్వెంటరీ కొనుగోళ్లకూ రుణాలు

వ్యాపారస్థులకు రుణాలను కూడా జియో ఫైనాన్స్ ప్రారంభించింది. అన్ సెక్యూర్డ్ మర్చంట్ ట్రేడ్ క్రెడిట్ ఫెసిలిటీని తన ప్లాట్‌ఫామ్‌పై నమోదైన వర్తకులకు అందించనుంది. జియో ఫైనాన్షియల్ రిలయన్స్ నుంచి విడిపోయి ఎక్స్చేంజీలలో లిస్టయింది. ఇన్సూరెన్స్ బ్రోకింగ్, మ్యూచువల్ ఫండ్స్ సేవలను సైతం ఈ సంస్థ త్వరలోనే అందించనుంది.

చార్లీ ముంగర్ కన్నుమూత

బెర్క్‌షైర్ వైస్ చైర్మన్‌గా కీలక బాధ్యతలు



కాలిఫోర్నియా: అమెరికా దిగ్గజ సంస్థ బెర్క్‌షైర్ హాథ్‌వే వైస్ చైర్మన్ చార్లీ ముంగర్ (99) కన్నుమూశారు. బెర్క్‌షైర్ హాథ్‌వే సామ్రాజ్యాన్ని ఇన్వెస్ట్‌మెంట్ గురు వారెన్ బఫెట్ నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ముంగర్ మరణంపై ప్రపంచవ్యాప్తంగా పలువురు వ్యాపార దిగ్గజాలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తినిస్తూ, వెన్నంటి నిలవకపోయి ఉంటే హాథ్‌వే ఈ స్థాయికి ఎదిగేది కాదని బఫెట్ వ్యాఖ్యానించారు. 1924 జనవరి 1న జన్మించిన ముంగర్ 1940లలో యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌లో విద్యాభ్యాసం చేశారు. అయితే, అక్కడ గణితంలో బ్యాచిలర్స్ డిగ్రీని మధ్యలోనే వదిలేసి, రెండో ప్రపంచ యుద్ధంలో ఆర్మీ ఎయిర్ కోర్‌లో వాతావరణ శాస్త్రవేత్తగా పని చేశారు. తర్వాత 1948లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1959లో బఫెట్‌ను కలిసిన తర్వాత నుంచి ఇద్దరి మధ్య దశాబ్దాల పాటు స్నేహం కొనసాగింది. పెట్టుబడులపై ఇద్దరు కలిసి తమ ఆలోచనలను పంచుకునేవారు. ఇన్వెస్ట్ చేసేవారు. ఆ బంధం మరింత బలపడి 1978లో బెర్క్‌షైర్‌లో ముంగర్ వైస్ చైర్మన్‌గా చేరారు. సంస్థ వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. పెట్టుబడి అవకాశాలను మదింపు చేసేందుకు సైకాలజీ, భౌతిక శాస్త్రం, గణిత సూత్రాలను ఉపయోగించేవారు. వ్యాపారాలకు విలువ కట్టడం, మనుషుల స్వభావాలను తెలుసుకోవడం గురించి చార్లీ తనకు ఎంతో నేర్పించారని బఫెట్ వ్యాఖ్యానించారు. ముంగర్ సంపద ఒక దశలో రెండు బిలియన్ డాలర్లకు చేరింది.

ఐదేళ్లు ప్రీమియం.. జీవితాంతం ఆదాయం

ఎల్ఐసీ కొత్త ప్లాన్ జీవన్ ఉత్సవ్ • ఏటా 10 శాతం ఆదాయం

న్యూఢిల్లీ: జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ 'జీవన్ ఉత్సవ్' పేరుతో ప్రత్యేక బీమా పథకాన్ని ఆవిష్కరించింది. ఇది నాన్ లింక్డ్ (ఈక్విటీయేతర), నాన్ పార్టిసిపేటింగ్, మనీ బ్యాక్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం. ఈ ప్లాన్‌లో నిర్ణీత కాలం తర్వాత నుంచి ఏటా 10 శాతం చొప్పున (సమ్ అష్యూర్డ్‌లో) వెనక్కి వస్తుంది. కనీస బీమా రూ.5,00,000. గరిష్ట బీమా కవరేజీకి పరిమితి లేదు. 5–16 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లింపుల కాలాన్ని ఎంపిక చేసుకోవచ్చు. గరిష్టంగా 65 ఏళ్ల వరకు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. రెగ్యులర్ ఇన్‌కమ్ లేదా ఫ్లెక్సీ ఇన్‌కమ్‌లో ఒక ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీ చెల్లింపుల కాలంలో మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్‌కు తోడు, గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు. ప్రతి వెయ్యి రూపాయలకు ఏటా రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్ లభిస్తుంది. ఇలా ప్రీమియం చెల్లింపుల కాలం వరకు ఏటా జమ అవుతుంది. ప్రీమియంను సకాలంలో చెల్లించడంలో విఫలమైతే గ్యారంటీడ్ అడిషన్స్‌ను దాని కింద సర్దుబాటు చేస్తారు. రెగ్యులర్ ఇన్‌కమ్ ఆప్షన్‌లో ప్రీమియం చెల్లింపుల కాల వ్యవధి ముగిసిన మూడేళ్లు లేదా ఆరేళ్ల తర్వాత నుంచి ఏటా 10% ఆదాయం లభిస్తుంది. ఉదాహరణకు 5 ఏళ్లు ఎంపిక చేసుకుంటే 8 ఏళ్లు లేదా 11వ ఏట నుంచి ఏటా 10% ఆదాయం అందుకోవచ్చు. పదేళ్ల ప్రీమియం చెల్లింపుల కాలం ఎంపిక చేసుకుంటే 13వ ఏట నుంచి ఆదాయం వస్తుంది. ఫ్లెక్సీ ఇన్‌కమ్ ఆప్షన్‌లోనూ ఏటా 10% ఆదాయం అందుకోవచ్చు.

భవిత

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

స్కాలర్‌షిప్స్

» పీఎం-యూఎస్‌పీ స్కాలర్‌షిప్పులకు ప్రకటన
» ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

ఆర్థిక పరిస్థితులు సహకరించక ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇలాంటి వారు తమ చదువులను కొనసాగించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. అర్హులైన విద్యార్థులకు ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా ప్రోత్సాహన్(పీఎం-యూఎస్‌పీ) పేరిట ఉపకార వేతనాలు చెల్లిస్తారు. సెంట్రల్ సెక్టార్ స్కీమ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ పేరుతో వీటిని అందిస్తున్నారు. ఆ వివరాలు..

పీఎం-యూఎస్‌పీ

ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా ప్రోత్సాహన్(పీఎం-యూఎస్‌పీ)కు దరఖాస్తు చేయాలంటే.. అండర్ గ్రాడ్యుయేషన్ లేదా ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫస్ట్ ఇయర్ కోర్సుల్లో చేరినవారు అర్హులు. యూజీ నుంచి పీజీ వరకు ఐదేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్పులను అందిస్తారు. బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాలుగేళ్ల వరకు ఈ ఉపకార వేతనం లభిస్తుంది. సాధారణ డిగ్రీలు, ఇంటిగ్రేటెడ్ పీజీలు చదువుతున్నవారికి ఏడాదికి రూ.12వేలు చొప్పున మొదటి మూడేళ్లు వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పీజీలో చేరినప్పుడు సంవత్సరానికి రూ.20వేలు చొప్పున రెండేళ్లు అందిస్తారు. బీటెక్ విద్యార్థులకైతే నాలుగో ఏడాది రూ.20వేలు ఇస్తారు.

82వేల మందికి

పీఎం-యూఎస్‌పీ కింద దేశవ్యాప్తంగా మొత్తం 82 వేల స్కాలర్‌షిప్‌లు అందించనున్నాయి. వీటిని రాష్ట్రాలవారీగా విభజించారు. ఇందుకు రాష్ట్రాల వారీగా 18–25 ఏళ్ల వయసు జనాభాను ప్రాతిపదికన తీసుకుంటారు. రాష్ట్రాలవారీ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డుల్లో పదోతరగతి ఉత్తీర్ణత శాతంతోనూ మదింపు చేస్తారు. రాష్ట్రాలవారీగా కేటాయించిన స్కాలర్‌షిప్పుల్లో సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్ విద్యార్థులకు 3:2:1 విధానంలో ఎంపిక చేస్తారు. అలాగే మొత్తం స్కాలర్‌షిప్పుల్లో 50 శాతం అమ్మాయిలకు కేటాయిస్తారు.

అర్హతలు

- 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా 10+2 కోర్సుల ఉత్తీర్ణులు ఈ స్కాలర్‌షిప్పుల దరఖాస్తుకు అర్హులు.
- ఇంటర్ లేదా ప్లస్ 2లో 80 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. అంటే.. ఆ బోర్డు పరిధిలో టాప్ 20 పర్సంటైల్ సాధించిన ఉండాలి.
- రెగ్యులర్ విధానంలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే అర్హులు. కుటుంబ వార్షికాదాయం రూ.4.5 లక్షలకు మించకుండా ఉండాలి. ఇతర ఏ ఉపకార వేతనం పొందనివారే దీనికి అర్హులు.
- స్కాలర్‌షిప్పులకు ఎంపికైన విద్యార్థులు ఆ తర్వాత ఏడాదిల్లోనూ వీటిని పొందడానికి అంతకముందు విద్యా సంవత్సరంలో కనీస హాజరు కలిగి ఉండాలి. నిర్దేశిత మార్కుల శాతం సైతం తప్పనిసరి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం సంబంధిత స్కాలర్‌షిప్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పూరించాలి. అవసరమైన పత్రాలను జత చేయాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** డిసెంబర్ 31, 2023
- **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

బీటెక్ తర్వాత.. పయనమెటు!



ఇంజనీరింగ్ స్పెషల్

» క్యాంపస్ ఆఫర్స్‌తోపాటు ఆఫ్ క్యాంపస్ హైరింగ్స్
» ఉన్నత విద్యలో ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీకి అవకాశం
» విదేశాల్లో ఎంఎస్, మేనేజ్‌మెంట్ కోర్సులకు మార్గం
» ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు

ఇంజనీరింగ్ పూర్తిచేసుకుంటే ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయని భావిస్తారు. దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది బీటెక్ పట్టాలతో జాబ్ మార్కెట్లోకి అడుగు పెడుతున్నారు. వీరిలో క్యాంపస్ ఆఫర్స్ దక్కేది చాలా తక్కువ మందికి మాత్రమే! మరి మిగతా వారి పరిస్థితి ఏంటి? బీటెక్ తర్వాత అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు.. విదేశీ విద్యకు మార్గాలేమిటి? మరికొద్ది నెలల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు ఉపయోగపడేలా బీటెక్ తర్వాత ఉన్నత విద్య, ఉపాధి మార్గాలపై ప్రత్యేక కథనం..

బీటెక్ విద్యార్థుల్లో అధిక శాతం మంది క్యాంపస్ ఆఫర్స్‌వైపు దృష్టి పెడతారు. లేదంటే విదేశీ విద్యను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ రెండింటికే పరిమితం కాకుండా.. విస్తృత కోణంలో ఆలోచిస్తే.. మరెన్నో అవకాశాలు అందుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ప్రస్తుతం బీటెక్ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఆఫ్–క్యాంపస్ విధానంలో ఉద్యోగ ప్రయత్నాలు చేసే అభ్యర్థులు టెక్నికల్ స్కిల్స్‌తోపాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవడంపైనా దృష్టిపెట్టాలి.

ఉన్నత విద్య

బీటెక్ తర్వాత ఉన్నత విద్య లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు ఎంటెక్‌వైపు అడుగులు వేస్తారు. ఇందుకోసం గేట్ పరీక్ష అందుబాటులో ఉంది. దాన్నే తమ తొలి లక్ష్యంగా భావిస్తున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర యూనివర్సిటీల్లో బీటెక్ అర్హతతోనే గేట్ స్కోర్ ఆధారంగా ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ (ఎంఎస్ బై రీసెర్చ్, ఎంటెక్ బై రీసెర్చ్ వంటివి) కోర్సుల్లో చేరే వీలుంది.

బీటెక్ అర్హతతో పీహెచ్‌డీ చేయాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో మార్గం.. సీఎస్ఐఆర్–యూజీసీ నెట్. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పలు పరిశోధన సంస్థల్లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్–పీహెచ్‌డీలో చేరొచ్చు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులకు తొలి రెండేళ్లు నెలకు రూ.25 వేలు చొప్పున; మూడో ఏడాది నుంచి నెలకు రూ.28 వేలు చొప్పున ఫెలోషిప్ సైతం లభిస్తుంది. ఈ పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు (జూన్/డిసెంబర్) నిర్వహిస్తారు.

మేనేజ్‌మెంట్ కోర్సులు

ఉన్నత విద్య పరంగా బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి కోర్సు.. మేనేజ్‌మెంట్ పీజీ/ఎంబీఏ. ఇందుకోసం ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). ప్రతిష్టాత్మక ఐఐఎంలు, ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి మార్గం.. క్యాట్. రాష్ట్రాల స్థాయిలో ఐసెట్ ద్వారా ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఐసెట్‌కు సంబంధించి.. ఏప్రిల్/మేలో పరీక్షలు నిర్వహిస్తారు.

విదేశీ విద్య

ఇంజనీరింగ్ కోర్సుల ఉత్తీర్ణులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ తదితర దేశాల్లో ఉన్నత విద్య అవకాశాలను అన్వేషిస్తున్నారు. వీరు ఆయా దేశాల్లో ఎంఎస్, మేనేజ్‌మెంట్ పీజీ వంటి కోర్సుల్లో చేరుతున్నారు. సదరు విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందేందుకు పలు ప్రామాణిక టెస్టుల్లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది.

- **జీఆర్ఈ:** ఫారిన్ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో పీజీలో చేరాలనుకునే విద్యార్థులు జీఆర్ఈ (గ్రాడ్యుయేట్ రికార్డ్స్ ఎగ్జామినేషన్)లో స్కోర్ పొందాల్సి ఉంటుంది.
- **జీమ్యాట్:** విదేశాల్లో మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశానికి కీలకమైన పరీక్ష.. జీమ్యాట్ (గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్).
- **టోఫెల్:** స్టడీ అబ్రాడ్ అభ్యర్థులు తప్పనిసరిగా ప్రతిభ చూపాల్సిన పరీక్ష.. టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఫారెన్ లాంగ్వేజ్). ఇది అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించేందుకు ఉద్దేశించిన పరీక్ష.

సర్కారీ కొలువులు

పీఎస్‌యూ జాబ్స్

బీటెక్ విద్యార్థులకు ప్రభుత్వ కొలువుల పరంగా పీఎస్‌యూ జాబ్స్ చక్కటి మార్గంగా చెప్పొచ్చు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే.. గేట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. గేట్ స్కోర్ ఆధారంగా పలు ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) ఎంట్రీ లెవల్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. అందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి.

యూపీఎస్సీ నోటిఫికేషన్స్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల సంస్థ యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలో ర్యాంకు ఆధారంగా ఇండియన్ రైల్వేస్, టెలికమ్యూనికేషన్స్, ఎనర్జీ డిపార్ట్‌మెంట్ తదితర శాఖల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఈ పరీక్షకు నోటిఫికేషన్ జనవరి/ఫిబ్రవరిలో వెలువడుతుంది. అభ్యర్థులు ఇప్పటి నుంచే బీటెక్ స్థాయిలోని సబ్జెక్ట్‌లను అకడమిక్, కాంటెంపరరీ అప్రోచ్‌తో సన్నద్ధమైతే విజయావకాశాలు మెరుగవుతాయి.

సివిల్ సర్వీసెస్

ఇంజనీరింగ్ అభ్యర్థుల ముందున్న మరో అవకాశం.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. దేశ అత్యున్నత సర్వీసులుగా పేరొందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్–ఎ, గ్రూప్–బి తదితర పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా సివిల్స్ పరీక్షను నిర్వహిస్తుంది. మూడంచెల్లో(ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియలో ఏటా గణనీయ సంఖ్యలో ఇంజనీరింగ్ అభ్యర్థులు విజయం సాధిస్తున్నారు.

రాష్ట్రాల స్థాయిలో ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పలు శాఖల్లో (ట్రాన్స్ కో, జెన్ కో, ఇరిగేషన్ అండ్ క్యాడ్, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్టీసీ) బీటెక్ అర్హతగా అసిస్టెంట్ ఇంజనీర్స్ పోస్టుల భర్తీ జరుగుతుంది. ఈ ప్రక్రియను పబ్లిక్ సర్వీస్ కమిషన్లు చేపడతాయి. కోర్ సబ్జెక్టులపై పట్టుతో ఈ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

కేంద్ర ఆరోగ్య శాఖలో 487 ఉద్యోగాలు

జాబ్స్ ఇన్ఫో

కేంద్ర ప్రభుత్వ కొలువులు కోరుకునే వారికి చక్కటి అవకాశం! డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. భారత ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన ఈ సంస్థ.. వివిధ నగరాల్లోని వైద్య సంస్థల్లో 487 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నైలలో ఈ ఉద్యోగాలు ఉన్నాయి. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు

రీసెర్చ్ అసిస్టెంట్, టెక్నీషియన్, ల్యాబరేటరీ అటెండెంట్, ల్యాబరేటరీ టెక్నీషియన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ వర్కర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ క్లర్క్, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, యానిమల్ అటెండెంట్, లైబ్రరీ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్‌నర్స్), పారామెడికల్ వర్కర్, వర్క్‌షాప్ అటెండెంట్ విభాగాల్లో 487 పోస్టులున్నాయి.

అర్హతలు

- **హెల్త్ ఇన్‌స్పెక్టర్:** ఈ విభాగంలో మొత్తం 70 పోస్టులున్నాయి. ఏదైనా డిగ్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్/హెల్త్ ఇన్‌స్పెక్టర్/శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డిప్లొమా పాసవ్వాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **ఫీల్డ్ వర్కర్:** ఇందులో మొత్తం 140ఖాళీలున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ట వయోపరిమితి 25 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **ల్యాబొరేటరీ అటెండెంట్:** ఈ విభాగంలో 69 ఉద్యోగాలున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి.. మెడికల్ ల్యాబొరేటరీ టెక్నిక్స్/యానిమల్ కేర్/ల్యాబరేటరీ యానిమల్ కేర్/ప్రొడక్షన్ ఆఫ్ ఇమ్యునోబయలాజికల్ అండ్ యానిమల్ కేర్/వెటర్నరీ ల్యాబొరేటరీ టెక్నాలజీలో ఏడాది పాటు ట్రెయినింగ్ సర్టిఫికేట్ లేదా ఏడాది డిప్లొమా ఉండాలి. గరిష్ట వయోపరిమితి 27 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **నర్సింగ్ ఆఫీసర్:** ఈ విభాగంలో 16 పోస్టులు ఉన్నాయి. బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ పాసవ్వాలి. నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రిజిస్టర్ అవ్వాలి. 50 పడకల హాస్పిటల్‌లో ఏడాది పాటు పనిచేసిన అనుభవం ఉండాలి. గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.

రాత పరీక్ష ఇలా

ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 60 ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రశ్నలన్నీ కూడా సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచే వస్తాయి. గతంలో చదివిన సబ్జెక్టులే అయినా అందులోని ముఖ్యాంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. ప్రతి ప్రశ్నకు ఒక నిమిషం మాత్రమే సమయం ఉంటుంది. కాబట్టి మొదట తమకు బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.11.2023
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ రెండో వారం, 2023 • **డాక్యుమెంట్ వెరిఫికేషన్:** డిసెంబర్ నాలుగోవారం, 2023
- **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ అండ్ ఎన్‌సీఆర్, చెన్నై, బెంగళూరు, ముంబయి, లక్నో, రాంచీ, చండీగఢ్, గువహటి, కోల్‌కతా.
- **వెబ్‌సైట్:** https://aiihph.gov.in

క్రీడాకారుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు క్రీడాకారుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని గ్రామ/వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశించారు. బుధవారం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రెండేసి పురుషుల, మహిళల జట్లను నమోదు చేయాలని సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన కల్పించి, ప్రతి సచివాలయం వద్ద పోస్టర్లు ప్రదర్శించాలని ఆదేశించారు.

క్రీడలతో మానసిక స్థిరత్వం



పోస్టర్ విడుదల చేస్తున్న నాగరాణి తదితరులు

సాక్షి, అమరావతి: మానసిక, శారీరక స్థిరత్వానికి క్రీడారంగం ఆలంబనగా నిలుస్తుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. రాష్ట్రస్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఏటా నిర్వహించే 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023–24 పోస్టర్‌ను బుధవారం మంగళగిరిలోని సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనవరి 4 నుంచి 6 వరకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిసెంబర్ 5 నుంచి 9 వరకు ప్రాంతీయ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లు జరుగుతాయని వెల్లడించారు.

కేజీబీవీ పార్ట్‌టైమ్ పీజీటీలకు వేతనాల పెంపు

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పార్ట్‌టైమ్ పీజీటీలుగా పని చేస్తున్న టీచర్ల వేతనాలు పెంచుతూ సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీల్లో సుమారు 390 మంది పార్ట్ టైమ్ పీజీటీలుగా పనిచేస్తుండగా, నెలకు రూ.12 వేల వేతనం పొందుతున్నారు. వారంలో 24 పిరియడ్స్ ఆపై బోధిస్తున్న వారికి రూ.26,759కి పెంచుతూ, వేతన పెంపు డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పక్కాగా పరిహారం

- కొలిక్కి వచ్చిన ఖరీఫ్ పంట నష్టం అంచనాలు
- 7 జిల్లాల్లో 21 రకాల పంటలపై కరువు ప్రభావం
- 14.91 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం
- 5.59 లక్షల ఎకరాల్లో పత్తి.. 3.93 లక్షల ఎకరాల్లో వేరుశనగ
- 2.41 లక్షల ఎకరాల్లో కంది.. లక్ష ఎకరాల చొప్పున ఆముదం, మొక్కజొన్న పంటలకు నష్టం
- డిసెంబర్ నెలాఖరులోగా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు కసరత్తు



సాక్షి, అమరావతి: కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు కొలిక్కి వచ్చాయి. అర్హుల జాబితాలను సామాజిక తనిఖీల కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాల పరిశీలన పూర్తయిన తరువాత డిసెంబర్ 1న తుది జాబితాలను ప్రదర్శిస్తారు. డిసెంబర్ నెలాఖరులోగా పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రుతుపవనాలు మొహం చాటేయడంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. ఈ ప్రభావం రాయలసీమ జిల్లాల్లో కొంతమేర చూపించింది. ఖరీఫ్‌లో 574.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. 487.2 మిల్లీమీటర్లు నమోదైంది. 7 జిల్లాలో 21 నుంచి 35 శాతం మధ్య లోటు వర్షపాతం నమోదైంది. వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 85.97 లక్షల ఎకరాలు కాగా.. వర్షాభావ పరిస్థితుల వల్ల 64.35 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఉద్యాన పంటల సాధారణ విస్తీర్ణం 42 లక్షల ఎకరాలు కాగా.. 28.94 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి.

103 మండలాల గుర్తింపు

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు నిర్వహణ మాన్యువల్ ప్రకారం మండలాన్ని యూనిట్‌గా తీసుకొని 4 సూచికల ఆధారంగా మూడు దశల్లో పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత కరువు మండలాలను గుర్తించారు. 80 మండలాల్లో కరువు ప్రభావం ఎక్కువగా ఉందని.. 23 మండలాల్లో స్వల్పంగా ఉందని అధికారులు గుర్తించారు. మొత్తంగా 7 జిల్లాల పరిధిలో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. కరువు ప్రభావిత మండలాలతో పాటు ఇతర జిల్లాల్లో కూడా వర్షాభావ పరిస్థితుల వల్ల ఏర్పడిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. దాదాపు నెల రోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పంట నష్టాన్ని అంచనా వేశారు. వ్యవసాయ పంటల వారీగా నష్టం అంచనాలు కొలిక్కిరాగా.. ఉద్యాన పంటల నష్టం అంచనాలు నాలుగైదు రోజుల్లో కొలిక్కి రానున్నాయి.

పత్తి, వేరుశనగ పంటలకే నష్టం

వ్యవసాయ పంటలకు వాటిల్లిన నష్టం పరిశీలిస్తే.. 7 జిల్లాల పరిధిలో 7.06 లక్షల రైతులకు చెందిన 14.91 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. వర్షాధారం కింద సాగయ్యే ప్రాంతాల్లో 14.17 లక్షల ఎకరాలు, నీటివసతి ఉన్న ప్రాంతాల్లో 74 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. అత్యధికంగా కర్నూలు జిల్లాల్లో 6.92 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. ఆ తర్వాత అనంతపురంలో 4.66 లక్షల ఎకరాల్లో, శ్రీసత్యసాయి జిల్లాలో 1.98 లక్షల ఎకరాల్లో పంటలపై ప్రభావం చూపినట్టు గుర్తించారు. పంటల వారీగా చూస్తే అత్యధికంగా 5.59 లక్షల ఎకరాల్లో పత్తి, 3.93 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2.41 లక్షల ఎకరాల్లో కంది, లక్ష ఎకరాల చొప్పున ఆముదం, మొక్కజొన్న పంటలు దెబ్బతినగా, 43 వేల ఎక ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. వీటిని ఆధారంగా చేసుకుని ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు నష్టపరిహారాన్ని అంచనా వేస్తున్నారు. మరోవైపు ప్రాథమిక అంచనాల మేరకు కరువు సాయం కోసం ఇప్పటికే కేంద్రానికి నివేదిక కూడా సమర్పించారు.

> **నెలాఖరులోగా పంపిణీ**
>
> పంట నష్టం జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఇప్పటికే ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాల పరిశీలన పూర్తయింది. తుది జాబితాలను డిసెంబర్ 1న ప్రచురిస్తాం. అర్హులకు డిసెంబర్ నెలాఖరులోగా పంట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) జమ చేసేలా కసరత్తు చేపట్టాం.
>
> – చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

రైళ్లలో నకిలీ టీసీలు

- విజయవాడ నుంచి నెల్లూరు వరకు టీసీల పేరుతో తనిఖీలు
- రోజుకు భారీగా వసూళ్లు
- తెనాలికి చెందిన వ్యక్తి సూత్రధారి
- చీరాలలో పట్టుబడిన ముగ్గురు నకిలీ టీసీలు

చీరాల: రైళ్లలో దోపిడీ దొంగలే కాదు.. టీసీల పేరుతో కొత్త రకం దోపిడీలకు పాల్పడుతున్నారు. టికెట్ లేని ప్రయాణికులు, రిజర్వేషన్ స్లీపర్, ఏసీ బోగీల్లో అనుమతి లేకుండా ఎక్కిన వారే వీరి టార్గెట్. మెడలో ఒక నకిలీ రైల్వే ఐడీ కార్డు, నకిలీ రశీదు బుక్‌తో చూడడానికి నిజమైన టికెట్ కలెక్టర్‌లా మాట్లాడుతూ టికెట్ తీసుకోని ప్రయాణికులకు జరిమానాలు విధిస్తూ కొత్త రకం దోపిడీకి పాల్పడుతున్నారు. వీరందరూ విజయవాడ నుంచి నెల్లూరు వరకు రైళ్లలో సంచరిస్తూ ముందస్తుగా అనుకున్న రైళ్లలోనే వెళుతుంటారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రవర్తిస్తూ జరిమానాలు విధిస్తూ అడ్డంగా దోచుకుంటున్నారు.

అతడే కీలకం

బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన ఉప్పు సాయి ప్రసాద్ తెనాలిలో ఉంటున్నాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్మరానికి చెందిన జి.గణేష్, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొర్లకొండ గ్రామానికి చెందిన బొంతా కళ్యాణ్, మహబూబాబాద్ జిల్లా నెల్లికోడూరు మండలం పెద్దతండాకు చెందిన బి.ప్రవీణ్ వద్ద లక్ష రూపాయలు తీసుకుని నకిలీ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడమే కాకుండా వారిని తనతో ఉంచుకుని విజయవాడ– నెల్లూరు మధ్య రైళ్లలో టీసీలుగా అవతారమెత్తించాడు. రోజూ అతడే డ్యూటీలు వేయించి ఏ రైలు ఎక్కాలో చెప్పేవాడు. రైళ్లలో టికెట్ లేనివారిని గుర్తించి వారి నుంచి జరిమానాలు వసూలు చేయించేవాడు. జరిమానాల సొమ్మును భారీగా తీసుకునేవాడని తెలిసింది. ముందుగా అనుకున్న రైళ్లలోనే టీసీలుగా వెళ్లి టికెట్ తీసుకోని ప్రయాణికుల వద్ద నుంచి జరిమానాలు వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి నెల్లూరు రైల్వేస్టేషన్ల మధ్య అనుకున్న రైల్వేస్టేషన్లలో దిగి మరో రైలు ఎక్కుతూ జరిమానాలు విధిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో చీరాలకు వచ్చిన వారు చీరాల రైల్వేస్టేషన్‌లో అసలు టీసీకి దొరికిపోయారు. టీసీలా వ్యవహరిస్తున్న వారిపై అనుమానం రావడంతో ముగ్గురిని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. దీంతో జీఆర్పీ పోలీసులు విచారించగా సాయి ప్రసాద్ బాగోతం బయటపడింది. సాయి ప్రసాద్ వలే విజయవాడలో ఇదే తరహాలో మరో వ్యక్తి దందా సాగిస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై జీఆర్పీ ఎస్ఐ కొండయ్యను 'సాక్షి' వివరణ కోరగా పట్టుబడిన ముగ్గురు మైనర్లు కావడంతో వారికి 41 నోటీసులిచ్చినట్టు తెలిపారు. వ్యవహారంపై విచారణ జరుగుతోందని, దర్యాప్తు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లను జేఎల్ఎంలతో పోల్చలేం

సీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఎనర్జీ అసిస్టెంట్ల(జేఎల్ఎం గ్రేడ్–2)తో జూనియర్ లైన్‌మేన్(జేఎల్ఎం)లను పోల్చలేమని, వారి నియామక ప్రక్రియ ఒకేలా ఉండదని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రత్యేకంగా రూల్స్‌ని రూపొందించామని వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వార్డు పనులు, వీధి లైట్లు, విద్యుత్ పనులు కూడా నిర్వహించేలా జాబ్ చార్ట్ ఇచ్చామని సీఎండీ స్పష్టం చేశారు. డిస్కంలలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు రూ.15 వేలు కన్సాలిడేటెడ్ పే రెండేళ్లకు ఇచ్చి, ప్రొబేషన్ అయ్యాక రూ.22,460తో పే స్కేలు అమలు చేశామని, అంటే దాదాపు రెండేళ్లలోనే 100 శాతం జీతం పెరిగిందన్నారు. ఈ ఎనర్జీ అసిస్టెంట్ల నియామకం విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల ద్వారానే జరిగిందని, డిస్కంలే వారికి జీతాలిస్తున్నాయని తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్లు రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల మధ్య సచివాలయంలో ఎలక్ట్రికల్ పనుల్ని నోట్ చేసుకుని, హాజరు కూడా రికార్డు చేయాలని పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ప్రమాదం వల్లగానీ, మరే విధంగానైనా మరణిస్తే వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు.

ధవళేశ్వరం వద్ద ఇసుక తవ్వకాలు ఆపండి

అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గోదావరి నదిలో ధవళేశ్వరం వద్ద భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలపై హైకోర్టు స్టే విధించింది. తవ్వకాలు జరగకుండా చూడాలని ఆదేశించింది. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలో గోదావరి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారంటూ వంశీ దినేష్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తవ్వకాలకు సంబంధించిన ఫొటోలను ఆయన కోర్టు ముందుంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం ధవళేశ్వరం వద్ద భారీ యంత్రాలతో చేస్తున్న ఇసుక తవ్వకాలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

ఇంజనీర్ల కొరత లేదు

ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు



సాక్షి, అమరావతి: ఏపీ విద్యుత్ ఉత్పాదక సంస్థలో ఇంజనీరింగ్ ఉద్యోగుల కొరత లేదని ఏపీజెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు తెలిపారు. ఏపీజెన్‌కోలో 400 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. పనికి తగిన మానవ వనరులు లేవని ఆర్టీపీపీలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఏపీ జెన్‌కో మూడు థర్మల్ విద్యుత్ కేంద్రాల (ఆర్టీపీపీ, ఎస్‌డీఎస్‌టీపీఎస్, డాక్టర్ ఎన్‌టీటీపీఎస్) నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. వీటిలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ప్రామాణికాలు, మార్గదర్శకాల ప్రకారం కావాల్సిన సంఖ్య కంటే కొంత ఎక్కువ సంఖ్యలోనే ఇంజనీరింగ్, ఇతర ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏపీజెన్‌కో జలవిద్యుత్ కేంద్రాల్లోనూ అవసరమైనంతమంది ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతానికి ఉద్యోగుల కొరత లేదు. మ్యాన్/మెగావాట్ రేషియో 200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లలో 0.381, 600 మెగావాట్ల యూనిట్‌లో 0.491, 800 మెగావాట్ల యూనిట్‌లో 0.273 ఉండాలని సీఈఏ పేర్కొంది. ఇందులో 20 శాతం మంది ఇంజనీరింగ్ ఉద్యోగులు ఉండాలని తాజాగా సీఈఏ ప్రమాణికాల్లో స్పష్టం చేసింది. ఏపీజెన్‌కోకు చెందిన అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఈ దామాషా కంటే ఎక్కువ సంఖ్యలోనే ఇంజనీరింగ్ ఉద్యోగులున్నారు. అటు సంస్థ ప్రగతి, ఇటు ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ దిశగానే ఎల్లప్పుడూ ఏపీ జెన్‌కో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నది' అని ఆయన స్పష్టం చేశారు.

ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలు

సిడ్బీతో ఏపీఐఐసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సులభంగా రుణాలు అందించే విధంగా స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ)తో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిడ్బీ జనరల్ మేనేజర్ హిమాన్షు ఆస్థానా, ఏపీఐఐసీ వీసీఎండీ ప్రవీణ్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్రంలోని 531 పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈలకు ఇక నుంచి సులభంగా రుణాలు లభిస్తాయని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ఇప్పటికే పలు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకున్నామని, ఇప్పుడు తాజాగా సిడ్బీతో కుదుర్చుకున్న ఒప్పందం ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని అన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.